ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 90 పేజీలు: 8+16 వెల: 6.50

బంగ్లా సరిహద్దు వెంబడి నిరంతర పహారా

యుఎస్‌తో ఖనిజాల ఒప్పందంపై ఉక్రెయిన్ సంతకం

5



## మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?

### ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై కోర్టు ఆగ్రహం

### పిటిషన్ తిరస్కరించిన 'సుప్రీం' బెంచ్

**న్యూఢిల్లీ, మే 1:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై న్యాయ విచారణ జరపాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. సైనికుల మనోధైర్యాన్ని దెబ్బ తీయకండంటూ పిటిషనర్‌ను కోరింది. గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ పిటిషన్ విచారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పిటీషన్ దాఖలు చేసే ముందు ఈ అంశంలోని సున్నితత్వాన్ని చూడాలని పిటీషనర్‌కు సూచించారు. ఈ తరహా ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసేందుకు బాధ్యతతో వ్యవహరించాలంటూ హితవు పలికింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు చేతులు కలిపి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అందులో మీ కర్తవ్యాన్ని సైతం నిర్వహించాలని పిటీషనర్‌తో పేర్కొన్నారు. అంతేకాదు న్యాయమూర్తుల పని వివాదాలపై నిర్ణయం తీసుకోవడమే తప్ప విచారణలు నిర్వహించడం కాదని జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి జరగడం వల్ల

>>2

## కులగణనలో తెలంగాణను మోడల్‌గా తీసుకోండి



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో సిఎం రేవంత్. చిత్రంలో కెకె, మధుయాష్కి

### జనగణనలో కులగణనకు మోడీ నిర్ణయం అభినందనీయం

### కేంద్రం, రాష్ట్రాలు కలిసి చేస్తే యేడాదిలో పూర్తి!

### మీరిచ్చే నివేదికనే మేం అనుసరిస్తాం..

### కులగణనపై కేంద్ర మంత్రుల కమిటీ ఏర్పాటు చేయాలి: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలని, ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలని కేంద్రానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీ పంపాలని, కులగణనలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని, కులగణన విషయంలో తెలంగాణ రాష్ట్ర అనుభవం వినియోగించుకోవాలని కేంద్రాన్ని కోరారు. గురువారం ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ 'కుల గణన చేపట్టాలనే రాహుల్ గాంధీ ఆలోచనను కేంద్రం అమలు చేస్తుంటే స్వాగతిస్తున్నాం, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదర్శంగా తీసుకున్నందుకు సంతోషం' అని వ్యాఖ్యానించారు. 'కులగణన చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ విషయంలో

>>2

### ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండి

2

త్వరలో అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీ

కార్మికుల సంక్షేమ మే ప్రజాప్రభుత్వ లక్ష్యం

మే డే వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్

## వినోదరంగ హబ్‌గా భారత్



### సృజనాత్మకతల వేదికకు పునాది

### వేవ్స్ సదస్సు ప్రారంభించిన మోడీ

**ముంబయి, మే 1:** అంతర్జాతీయ ప్రతిభ, సృజనాత్మకతల కోసం ప్రపంచ వేదిక నిర్మాణానికి వేవ్స్ పునాది వేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, మ్యూజిక్, కాన్సర్ట్‌లకు భారతదేశం కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వేళ ప్రపంచ ప్రతిభకు ఒక వేదికను అందించే సామర్థ్యం వేవ్స్‌కు ఉంటుందని ప్రధాని తెలిపారు. ముంబయిలో తొలి గ్లోబల్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్ వేవ్స్‌ను మోదీ ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు, స్టార్టప్‌లు, ఇండస్ట్రీ లీడర్లు, పాలసీ మేకర్లను ఒకచోట చేర్చడం ద్వారా భారత్‌ను మీడియా, వినోదం డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఉంచడం వేవ్స్ లక్ష్యమని మోదీ చెప్పారు. సామాజిక మాధ్యమాలు, ఓటీటీల్లో అసభ్య కంటెంట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, సమాజంలో సృజనాత్మకమైన బాధ్యతలు కలిగి ఉండటం ముఖ్యమన్నారు. మనుషులు రోబోల్లా మారకూడదని హితవుపలికిన ప్రధాని, మానవ సమాజ సున్నితత్వాన్ని కాపాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మారుతున్న సాంకేతికతతో స్క్రీన్ పరిమాణం మినీగా మారుతున్నప్పటికీ భారతదేశం కథలు మెగాగా మారుతున్నాయని ఆయన అన్నారు. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న ఈ భారతదేశం, వందల కోట్లకు పైగా కథలకు నిలయం. గత శతాబ్దకాలంగా ప్రపంచంలోని నలుమూలలా భారతదేశానికి ప్రాచుర్యాన్ని వ్యాప్తి చేయడంలో భారతీయ సినిమా విజయవంతమైంది. రష్యాలో రాజ్‌కపూర్‌కు, సత్యజిత్ రేకు కేన్స్‌లో ఉన్న ప్రజాధరణ ఆస్కార్‌లో ట్రిపుల్ ఆర్ సాధించిన విజయాలే ఇందుకు సాక్ష్యాలని ప్రధానిపేర్కొన్నారు.

## జననమరణాలతో ఓటర్ల జాబితా లింకు




### ఎన్నికల సంఘం తాజా నిర్ణయం

**న్యూఢిల్లీ,మే 1:** ఓటర్ల జాబితా కచ్చితత్వాన్ని మెరుగు పరచడానికి, ఓటర్ల సేవలను క్రమబద్ధీకరించడానికి భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం మూడు ప్రధాన కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా లింక్ చేస్తున్నట్లుప్రకటించింది. ఓటర్ల జాబితా కచ్చితత్వాన్ని మెరుగు పరచడానికి, ఓటర్ల సేవలను క్రమబద్ధీకరించడానికి భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు ప్రకటించింది. అయితే ఇందుకోసం జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) నుంచి మరణాల సమాచారన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని పేర్కొంది. దీని ద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలు ఉంటుందని వెల్లడించింది. ఓటర్ల జాబితా కచ్చితత్వాన్ని మెరుగు పరచడానికి, ఓటర్ల సేవలను

>>2

## యేడాదిలో పాలమూరు ప్రాజెక్టులు పూర్తి

### గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పనుల్లో జాప్యం

### 'కల్వకుర్తి' పంపులను త్వరలోనే రిపేర్ చేస్తాం: మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి

### ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు



గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి తదితరులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసి తీరుతామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యే దశలో ఉన్నప్పటికీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం వహించడం వల్లే పనుల్లో జాప్యం జరిగిందన్నారు. గతంలో పాలమూరు ప్రాజెక్టు వద్ద ప్రారంభించిన మోటార్‌కు సంబంధించి విద్యుత్ ఏర్పాట్లు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ విద్యుత్ శాఖ, ఇరిగేషన్ శాఖలకు రూ.262 కోట్లు చెల్లించి స్టేషన్ల వద్ద మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు అందించామన్నారు. నార్లాపూర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రాజెక్టు వద్ద పంపింగ్ ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టులకు అడ్డంకిగా మారిన భూసేకరణ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలను పూర్తిచేసుకొని పనులను వేగవంతంగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులను కేటాయిస్తామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో గతంలో పాడైన పంపులను రిపేరు చేయించి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను సందర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 2026 లోపు పూర్తి

>>2



## ఏ ఒక్కరినీ వదలం

### ఉగ్రవాదుల్ని మట్టుబెడతాం!

### పహల్గాం ఉగ్రదాడిపై హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 1:** దేశం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మోదీ సర్కారు సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతామని పునరుద్ఘాటించారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా, నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఏ ఉగ్రవాది తప్పించుకోలేరని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పోరాటం ఆగదన్న అమిత్ షా, ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అది ఈశాన్య ప్రాంతాలు కావచ్చు, వామపక్ష తీవ్రవాద ప్రాంతాలు కావచ్చు లేదా కశ్మీర్‌లోని ఉగ్రవాద ప్రాంతాలు కావచ్చు. ప్రతి అంశంలోనూ మేము గట్టి సమాధానం ఇచ్చాం. ఈ పిరికిపంద దాడి ద్వారా తాము పెద్ద విజయం సాధించినట్లు ఎవరైనా భావిస్తుంటే ఒక విషయం అర్థం చేసుకోండి. ఇది మోదీ ప్రభుత్వం ఎవరూ తప్పించుకోలేరని గ్రహించాలి. దేశంలోని ప్రతి అంగుళం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మా సంకల్పం.

>>2



## సరిహద్దుల్లో పాక్ కవ్వింపు కాల్పులు

### తిప్పికొడుతున్న భద్రతా బలగాలు

**శ్రీనగర్, మే 1:** పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ సరిహద్దు వెంబడి మరోసారి కాల్పుల కలకలం కొనసాగుతోంది. పాకిస్థాన్ సైన్యం వరుసగా ఏడో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. నియంత్రణ రేఖ వెంబడి

>>2



గురువారం న్యూఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


## కులగణనపై విపక్షాలవి నాటకాలు

### జనగణనతోనే కులగణన సాధ్యమవుతుంది

### బిసిల్లో ముస్లింలను చేర్చే ప్రసక్తే లేదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 1 ప్రభాతవార్త:** జనగణనలో భాగంగా కుల గణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తర్వాత ప్రతిపక్ష పార్టీలు రాజకీయ నాటకాలకు తెరలేపుతున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిసి రిజర్వేషన్లకు సంబంధించిన కుట్రలు, కుతంత్రాలు చేశారన్నారు. ముస్లింలందరినీ బిసిల్లో చేర్చారని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రజలను మతం పేరుతో విడగొడుతూ మతఘర్షణలు సృష్టించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కులాల పేరుతో సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలపై, బిసిలపై కపటప్రేమను చూపించడం ఒక్కటే కాదు వీలు చిక్కినపుడల్లా విషం కక్కిన సందర్భాలు కూడా చరిత్రలో ఎన్నో ఉన్నాయన్నారు. ఎస్సీ అయిన రామ్‌నాథ్ కోవింద్‌ని, ఎస్టీ అయిన ద్రౌపది ముర్ము రాష్ట్రపతి

>>2




## సామాన్యుడికి అందని ఆవకాయ

### 'పచ్చడ్డి' మెతుకులూ భారమే

### చుక్కలు చూపిస్తున్న సరుకుల ధరలు

### భయపెడుతున్న మామిడి కాయలు



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** సాంబారు.. పప్పన్నమే కాదు, పచ్చడి మెతుకులు సైతం సామాన్యులకు భారంగా తయారైంది. పేదల నుండి ధనవంతుల వరకూ నోరూరించే మామిడి కాయ పచ్చడి 'ఆవకాయ్ణ లేని ఇల్లు సాధారణంగా ఎక్కడా కనిపించదు. పేదలకు అయితే పచ్చడి మెతుకులే పరమాన్నంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వేసవి కాలం సీజన్ వచ్చిందంటే చాలు మామిడి కాయలతో ఆవకాయ, ఊరగాయ పచ్చళ్ల పైనే అందరి దృష్టి ఉంటుంది. వేసవి సీజనులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మామిడి కాయ పచ్చడి అంటే ఇష్టపడి మరీ తింటారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తప్పకుండా సీజన్ వారీగా మామిడి కాయ పచ్చళ్లు పడతారు. అయితే ఇప్పుడు మామిడి కాయ పచ్చళ్లు పెట్టాలంటే తలకు మించిన భారంగా మారింది. అన్నిధరలు పెరిగి పచ్చళ్లు పెట్టాలంటే రెట్టింపు ఖర్చు కావడంతో వామ్మో ఆవకాయ అంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోన నలుగురు సభ్యులుండే ఒక కుటుంబం ఏడాది వినియోగానికి సగటున 10 కిలోల వరకూ మామిడికాయ పచ్చళ్లు తయారు చేసుకుని నిల్వ పెట్టుకోవడం జరుగుతుంది. కుల, మతాలకు అతీతంగా, ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా అందరూ మామిడి కాయల పచ్చడిని పెట్టాల్సిందే. అయితే ఈ పచ్చళ్ల తయారీకి ప్రధానమైన మామిడి కాయలతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు

>>2




లక్నోలోని అబ్దుల్ కలాం వర్సిటీలో గురువారం యుపి గవర్నర్ ఆనందిబెన్ పటేల్ రచించిన 'చునౌతియాన్ ముఝే పసంద్ హై' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్. చిత్రంలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# అందని ఆవకాయ

>> మాత్రం సామాన్యులను భయపెడుతున్నాయి. తయారీకి అవసరమైన సరుకుల ధరలన్నీ మండిపోతున్నాయి. పచ్చడి పెట్టాలంటే వేల రూపాయలు చేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 100 మామిడి కాయలతో పచ్చడి పెట్టాలంటే ప్రస్తుత ధరల ప్రకారం చేతిలో 13 వేల రూపాయలు ఉండాల్సిందే. ఇదే 50 కాయలతో అయితే దాదాపు 6 వేల రూపాయలు తప్పనిసరిగా కావాల్సిందేనని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. దీనికి కారణం అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోవడం, చెట్లు విరిగిపోవడం తదితర కారణాలతో పచ్చడి మామిడి కాయల దిగుబడి తగ్గిపోయింది. దీనికితోడు, పచ్చడి తయారీకి అవసరమైన నూనె, కారం తదితర వస్తువుల ధరలు కొండెక్కడమే అని అంటున్నారు. చిల్లరగా నాణ్యమైన పెద్ద సైజు పచ్చడి మామిడికాయలు కిలో ధర హైదరాబాద్ మార్కెట్‌లో 150 నుండి 200 రూపాయలకు పైగా పలుకుతోంది. గత ఏడాది కంటే ఇది రెట్టింపు కావడం విశేషం.?ఇక పచ్చళ్ల తయారీకి సాధారణంగా నువ్వుల నూనె వినియోగిస్తారు. మరి కొందరు అయితే వేరుశెనగ నూనెను కూడా ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మామిడి కాయ పచ్చడికి సంబంధించి ప్రత్యేకమైన వేరుశెనగ నూనె లీటరు ధర 500 రూపాయల వరకూ పలుకుతోంది. నువ్వుల నూనె ధర గత ఏడాదితో పోలిస్తే 600 రూపాయలకు పైగా చేరుకుంది. అలాగే నువ్వుల నూనెతోపాటు, ఆవపిండి, మెంతుల పొడి, కారం, ఉప్పు వంటి సరుకుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. వీటిలో కారం మిరపకాయల రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా మిరపకాయల ధరలు ఘాటెక్కాయి. కేజీ మేలు రకం 750 రూపాయలు పలుకుతోంది. ఇక కారం పొడి ధర అయితే బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుత ధర 810 రూపాయలు ఉంది. వంద కాయల పచ్చడి పెట్టాలంటే మూడున్నర నుండి నాలుగు కేజీల కారం అవసరం. అంటే ఒక్క కారానికే 3 వేల రూపాయలు ఖర్చవుతుంది. అలాగే ఆవపిండి కూడా మూడు కేజీల వరకూ అవసరం. కేజీ 280 రూపాయలు పలుకుతోంది. ఈ లెక్కన మూడు కేజీలకు 800 రూపాయలు అవసరం అవుతాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది మామిడి కాయల పచ్చడి అంటేనే ముఖ్యంగా పేదలు, సామాన్యులు తారెత్తిపోతున్నారు.

# పాలమూరు ప్రాజెక్టులు పూర్తి

>> చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వేనా ప్రాజెక్టులను పూర్తి చేసి 50 టీఎంసీల నీటిని నింపేందుకు 6 నెలల సమయాన్ని పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా పనులు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నింపేందుకు వచ్చే ఏడాది మార్చి 2026 లోపు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధికారులను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులను సందర్శించేందుకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ప్రాజెక్టులు ముంపుకు గురైన రైతులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద తమకు పరిహారం చెల్లించాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డిసిసిబి అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# ఓటర్ల జాబితా లింకు

>> క్రమబద్ధీకరించడానికి భారత ఎన్నికల కమిషన్ మూడు ప్రధాన కార్యక్రమాలను ప్రారంభించింది. మార్చిలో జరిగిన ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశం తర్వాత.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్ బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సంస్కరణలను ప్రకటించారు. ముఖ్యంగా పత్రికా ప్రకటన ద్వారా గురువారం రోజు ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు.
నమోదిత మరణాలకు సంబంధించి సమాచారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ) సకాలంలో పొందే వీలు ఉంటుంది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంత వరకు వేచి చూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు వారి గ్రామాల్లోకి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారని ఎన్నికల సంఘం వెల్లడించింది. దీని వల్ల మరణించిన వ్యక్తుల పేర్లను వెంటనే తొలగించడం ద్వారా ఓటర్ల జాబితా యొక్క సమగ్రతను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. ఎన్నికల నింబధనలు 1960, జనన, మరణాల నమోదు చట్టం 1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది.

# సరిహద్దుల్లో పాక్ కవ్వింపు కాల్పులు

>> మూడు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో భారత సైన్యం పైకి కాల్పులు జరిపింది. దీనిని భారత్ సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 30, మే1 అర్ధరాత్రి జమ్ముకశ్మీర్‌లోని మూడు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో పాకిస్థాన్ కాల్పులు జరిపింది. కుప్వారా, ఉరి, అఖ్నూర్ ఎదురుగా ఉన్న పాకిస్థాన్ ఆర్మీ పోస్టుల నుంచి కాల్పులు జరిపినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. వీటికి భారత్ ఆర్మీ దళాలు వేగంగా స్పందించాయని ఆర్మీ అధికారి పేర్కొన్నారు. అటూ బారాముల్లా, పూంచ్ జిల్లాల్లోనూ కవ్వింపు చర్యలకు దిగినట్లుగా తెలుస్తోంది. ఏప్రిల్ 24 అర్ధరాత్రి నుంచి వరుసగా ప్రతిరోజూ పాక్ సైన్యం భారత దళాలపై ఎల్‌ఓసీ వెంబడి కాల్పులు జరుపుతున్నాయి. దీటుగా భారత్ ఆర్మీ బదులిస్తోంది. ఉగ్రదాడి తర్వాత నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఇరు దేశాల సైనికాధికారులు బుధవారం హాట్‌లైన్ ద్వారా మాట్లాడినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. నియంత్రరేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లఘించి కాల్పులు జరపడంపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపిందని చెప్పాయి. ఇకపై ఎలాంటి కవ్వింపుల లేకుండా ఉల్లంఘనలకు పాల్పడవద్దని గట్టిగా హెచ్చరికలు జారీ చేసిందని పేర్కొన్నాయి. ఈ చర్చల్లో పాకిస్థాన్ ఏ రోజు ఏయో ప్రాంతాల్లో కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడిందో వివరించినట్లు సమాచారం. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాక్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లాలని గడువు విధించడం వంటి చేసింది. ఈ చర్యలతో పాకిస్థాన్ అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది.

# నేడు ఢిల్లీకి సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే1:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసిసి నాయకులతో పాటు, అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కేంద్రం ప్రకటించిన కులగణనపై భేటీలో ప్రధానంగా చర్చించనున్నట్టుగా సమాచారం.

# కార్మికులకు కెసిఆర్ మే డే శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే1:** ఉత్పత్తిలో భాగమై జాతి సంపదను సృష్టిస్తున్న సబ్బండ కులాల శ్రామికుల, పరిశ్రమలు తదితర రంగాల్లో పనిచేసే కార్మికుల రెక్కల కష్టానికి వెలకట్టలేమని, వారి త్యాగం అసామాన్యమైనదని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. చారిత్రాత్మక మేడే ఆవిర్భావ నేపథ్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకుని వారి త్యాగాలకు ఘన నివాళులర్పించారు. మేడే స్ఫూర్తితో, రాష్ట్రంలోని శ్రామికుల హక్కులను కాపాడుతూ నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు వారి జీవన బద్రతకు భరోసాను పెంచాయన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టామన్నారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించామని కేసీఆర్ అన్నారు. ఉత్పత్తి సేవా రంగాల్లో పాల్గొనే మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యా లను హక్కులను కల్పించి అండగా నిలిచామన్నారు. సింగరేణి, ఆటోడ్రైవర్లు, పలు పరిశ్రమలు సహా అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న శ్రామికులకు అన్ని రకాలుగా భరోసా కల్పించా మన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్మికవర్గ అనుకూల విధానాలను మరింత బలోపేతం చేయడం ద్వారా, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారా మాత్రమే, మేడే స్ఫూర్తికి, ప్రపంచ కార్మికలోక త్యాగాలకు మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 02-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
పంచమి ఉ.9.18
ఆరుద్ర మ.1.09
వర్జ్యం రా.12.54-2.28
దు.ఉ.8.16-9.07, 2) మ.12.31-1.22
శుభసమయం : ఉ.6.10-6.55
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఆత్మీయులతో ఉత్సాహంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వస్తులాభం.

**వృషభం:** విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు.

**మిథునం:** శుభకార్యాల రీత్యా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి సహాయసహకరాలు అందిస్తారు.

**కర్కాటకం:** పనులలో విజయం సాధిస్తారు. జీవితభాగస్వామి నుండి ధన లాభం పొందుతారు. విందు, వినోదాలు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో కొత్త ఆశలు పెరుగుతాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కన్య:** సన్నిహితులతో ఏర్పడిన మాటపట్టింపులు పరిష్కరించు కుంటారు. పనుల్లో ప్రతిబంధకాలు ఏర్పడతాయి.

**తుల:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలలో లాభాలు.

**వృశ్చికం:** కుటుంబంలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణదాతల ఒత్తిడులు ఎక్కువైతాయి.

**మకరం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణాలలో తొందరపాటు తగదు.

**కుంభం:** అనుకోని అతిథుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఇంటా బయిటా ప్రోత్సాహం.

**మీనం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండి

## త్వరలో అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీ

## కార్మికుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

## మే డే వేడుకల్లో సిఎం రేవంత్



గురువారం హైదరాబాద్‌లో జరిగిన మే డే వేడుకల్లో పాల్గొన్న సిఎం రేవంత్, మంత్రులు పొన్నం, పొంగులేటి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 1 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ పదేళ్ల ఆర్థిక దోపిడి, విధ్వంసం, చేసిన విచ్చల విడి అప్పులతో రాష్ట్రం ఆర్థిక అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతోందని, సమ్మె పోటు రాష్ట్రానికే చేటని, ఆర్టీసి కార్మికులు తలపెట్టిన సమ్మె ఆలోచనను వీడండని విజ్ఞప్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గడచిన పదేళ్లు ఏమేలు చేయనివారి మాటల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు, చెప్పుడు మాటలువిని పంతాలకు, పట్టింపులకు పోవద్దు ... ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత మంత్రితో సామరస్యపూర్వకంగా చర్చించి పరిష్కరించుకోండి. రాష్ట్రానికి వచ్చే ఆదాయం మీచేతిలో పెడతా. ఎలా ఖర్చుచేద్దామో మీరే సూచన చేయండి. అణాపైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేదిలేదు... మీకో సమే ఖర్చుచేస్తాం. కష్టమైనా, నిష్టూరమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆర్టీసి కార్మికులు నన్ను నమ్మండి... నమ్ముకున్న మీకు నేను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఇప్పుడే ఆర్టీసి లాభాలబాటలో పయనిస్తోంది.. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసి కార్మికులపైనే ఉంది. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పట్టాలెక్కుతోంది. తప్పుదోవ పట్టించకపోతే మరో ఏడాదిలో కొంత కుదుటపడుతుంది అని రేవంత్‌రెడ్డి వివరించారు. ఏదిఏమైనా ఏఒక్క ప్రజాసంక్షేమ పథకాలు ఆపలేదని రేవంత్‌రెడ్డి వివరించారు. కపటనాటక సూత్రధారి అయిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మళ్లీ బయలుదేరిండు.. నక్కజిత్తు మాటలు చెప్పజూస్తుండు... రాష్ట్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం మధ్యాహ్నం జరిగిన మేడే వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విశిష్ట అతిథులు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కార్మికశాఖ కమిషనర్ ఎం.దాన కిషోర్, సంయుక్త కార్మికశాఖ కమిషనర్ జి.సునీత గోపాల్‌దాస్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ బి.జనక్‌ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. ప్రపంచాభివృద్ధికి బాటలు వేస్తుంది కార్మికుల శ్రమశక్తి, చెమటచుక్కలేనని, ప్రపంచంలో ఎన్ని విప్లవాలు వచ్చినా కార్మికుల ఉద్యమం ప్రత్యేకం, ప్రతిష్టాత్మకమన్నారు. ఏదేశమైనా ఆర్థికరంగంలో అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు పెట్టాలి. ఉత్పత్తి జరగాలంటే కార్మికులు కష్టపడి పనిచేయడం వల్లనే అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి, ఆర్టీసి, విద్యుత్, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేమనడం అతిశయోక్తి కాదు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రజాప్రభుత్వం నిరంతర కృషిచేస్తోందని, కార్మికులకు మేలు చేయడమే ప్రభుత్వ విధానమన్నారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో ఉడడంలో మీకృషి, శ్రమ ఉందని, తెలంగాణ దేశానికే రోల్‌మాడల్ అని, తెలంగాణ ఈజ్ రైజింగ్... ఈ రైజింగ్‌ను ఎవ్వడూ ఆపలేడు... ఆపాలనుకుంటే వాళ్ల కళ్లు, కాళ్లు, చేతులు కాలిపోతాయని తెలుపుతున్నా అన్నారు. చివరిగా రేవంత్‌రెడ్డి ఇతర అతిథులతో కలిసి పలువురికి శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డులను ప్రదానంచేసి అభినందించారు.

# విపక్షాలవి నాటకాలు

>> అభ్యర్థిగా ప్రకటించినపుడు వ్యతిరేకించి తమ పార్టీ అభ్యర్థులను బరిలో దింపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మాదిగ రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించేందుకు మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పూర్తి వివరాలు అందజేసిన తర్వాత ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమమైందన్నారు. వెనుకబడిన వర్గాలనుంచి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీని కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బిసిలపట్ల మొసలికన్నీరు కారుస్తుందన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ఎప్పుడు పనిచేయలేదని, 2018లో జాతీయ బిసి కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2019లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకోసం 10 రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. సమాజంలోని అన్ని వర్గాలకు సరైన న్యాయం జరగాలని సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదంతో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నాం. మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పించి వారి సాధికారిత కోసం, వారికి ఆత్మగౌరవం కల్పించిన ఘనత మోడీకి దక్కుతుందన్నారు. ముస్లిం మహిళలపై ట్రిపుల్ తలాక్ వంటి అనాగరికమైన విధానాలను రద్దు చేసి ముస్లిం మహిళలకు హక్కులు, అధికారాన్ని కల్పించిన ఘనత మోడీ ప్రభుత్వానిదన్నారు. సమాజంలోని ఏ ఒక్క వర్గానికీ తమను పట్టించుకోవడం లేదనే భావన రానీయకుండా మేం పనిచేస్తున్నామన్నారు. 1881 నుంచి 1931 కులగణన జరిగిందని, కానీ స్వాతంత్ర్యానంతరం కులగణన జరగకూడదని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీని ప్రకారం 1951 నుంచి నేటివరకు ఏనాడూ కులగణన జరగలేదన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కులగణనకు వ్యతిరేకంగానే ఉంది. నెహ్రూ, మౌలానా ఆజాద్ వంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కులగణన పట్ల బహిరంగంగానే విముఖత వ్యక్తం చేశారన్నారు. తాము చేపట్టబోయే కులగణనలో ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలను బిసిల్లో చేర్చబోం, మత ప్రాతిపదికన ఎవరినీ బిసిల్లో చేర్చే ప్రసక్తే లేదన్నారు. రాజ్యాంగ విరుద్ధమన్న న్యాయస్థానాల తీర్పుకు విరుద్ధంగా బిసి ముస్లింలు అనే ఆలోచనతో కాంగ్రెస్ ముందుకెళ్లిందన్నారు. దీన్ని మేం ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించం అన్నారు. దేశం హితం కోసం, దేశ ప్రజల అభ్యున్నతి గురించి ఆలోచించలేదు. తెలంగాణ, కర్ణాటకల్లో రాష్ట్రాల్లో చేపట్టిన కులగణన కూడా హడావుడిగా ఏదో సాధించామని చెప్పుకునే ప్రయత్నం చేశారు తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదు. ఇది కులగణన కాదు. ఇది కులాలకు సంబంధించిన సర్వే. కులగణన చేయాలంటే విధానపరమైన నిర్ణయాలు చాలా తీసుకోవాల్సి ఉంటుంది. 50శాతం జనాభాను కూడా చేరుకోకుండా మొత్తం సర్వే పూర్తి చేశామని చెప్పడం హాస్యాస్పదం. నిష్పాక్షికమైన, సైంటిఫిక్ పద్ధతిలో కులగణన జరగాలనేదే మోడీ సర్కారు ఆలోచన. దీనికోసమే జనగణన వరకు వేచి చూశాం. జనగణన చేస్తున్నప్పుడే కులగణన సాధ్యమవుతుందన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో దీనికి సంబంధించిన సవరణ తీసుకుని వచ్చిన తరువాత జనగణనపై ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు.



ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగాన్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కార్మికులతో సిఎం రేఖా గుప్తా, ఎంపీ బాన్సురి స్వరాజ్, ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రా తదితరులు

# తెలంగాణను మోడల్‌గా తీసుకోండి

>> మొదట రాహుల్‌కు అభినందనలు చెప్పాలి. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయి. కులగణన చేయాలని దిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయి. కులగణన నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు చెబుతున్నాం. కులగణన విషయంలో కేంద్రమంత్రుల కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీలో కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులను నియమించాలి' అని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో బీసీలుగా ఉన్న బోయలు, కర్ణాటకలో మరో వర్గంలో ఉన్నారు. ఏపీలో ఓసీలుగా ఉన్న కాపులు, తెలంగాణలో బీసీలుగా ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రాలను యూనిట్లుగా తీసుకుని జనగణనతో పాటు కులగణన చేయాలని చెప్పారు. కేంద్రం జనగణనతో పాటు కులగణనపై తుది నివేదిక ఇచ్చాక దానినే ఫైనల్‌గా భావించి అనుసరిస్తామన్నారు. కులగణన చేపట్టడం వల్ల సంక్షేమ పథకాలు అమలు చేయడం సులభం అవుతుందన్నారు. దేశంలో జనగణనతో పాటు కులగణన ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పుడు పూర్తి చేస్తారో తేదీలు నిర్ణయించాలని కేంద్రాన్ని ఆయన కోరారు. ఏడాది గడువు లోపల కులగణన పూర్తి చేయవచ్చునని తాను అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కులగణన చేసేముందు వచ్చే సవాళ్లపై అన్ని రాష్ట్రాలతో మాట్లాడాలి. పార్టీలు, ప్రజాసంఘాలతో నిపుణుల కమిటీ విస్తృతంగా చర్చించాలి. కులగణనపై విధివిధానాలు పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని కేంద్రానికి సూచించారు. మొన్నటి వరకు బీజేపీ కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడిందని, మా ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు ముందుకు వచ్చిందని, బీజేపీ తమ సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలంటే కులగణన చేసి తీరాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ ప్రజల గుండెచప్పుడు విన్నారు, కులగణన చేస్తామని హామీ ఇచ్చారు, కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిదని రాహుల్ గాంధీ ఆనాడే చెప్పారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. జనగణనలో కులగణన చేపట్టాలని, రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని తొలగించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపామని చెప్పారు. జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాలతో కలిసి ధర్నా చేపట్టాం, మా ఒత్తిడికి తలొగ్గి ప్రధాని మోదీ కులగణనపై నిర్ణయంతీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. జనగణనతో కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రధాని చెప్పాలి, కులగణనకు అనుసరించే విధానాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలి, ఇందుకు కేంద్ర మంత్రులతో కూడిన కమిటీతో పాటు, అధికారులతో కూడిన మరో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మేం కులగణన చేపట్టే క్రమంలో విధి విధానాలు రూపొందించి ప్రజల ముందు పెట్టాం, తెలంగాణలో మేం 57 ప్రశ్నలతో 8 పేజీలతో కూడిన సమాచారాన్ని సేకరించాం. ఎక్కడా మా పార్టీ కార్యక్రమంలా చేయలేదు. అందరినీ భాగస్వామ్యం చేసి కులగణన పూర్తి చేశాం. అందుకే కులగణనలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో నిలిచిందని చెప్పారు. కులగణనకు ఉత్తమ్, భట్టి, సీతక్క, పొన్నం, శ్రీధర్‌బాబుతో కమిటీ వేశాం. కులగణన, బీసీలకు 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వాలని కోరాం. ఈ అంశాలపై అసెంబ్లీలో రెండు తీర్మానాలు చేశాం. కులగణనలో అన్ని పార్టీలనూ భాగస్వాములు చేశామన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి రోల్ మోడల్ అని రాహుల్ చెప్పారు. ఎన్యుమరేటర్ నుంచి సీఎస్ వరకు, తాను కూడా పలుసార్లు సమీక్ష చేసినట్లు వివరించారు. కులగణన విషయంలో అనేక సూచనలు, సలహాలు వచ్చాయ న్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ ఇచ్చామని, ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లలో అసూయ, అసంతృప్తి కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి విధానాలను మోదీ అనుసరిస్తున్నారనే బాధ వారిలో కనిపిస్తోందని మండిపడ్డారు. కులగణన విషయంలో తమ అనుభవాన్ని కేంద్రంతో పంచుకుంటామని తెలిపారు. నివేదిక తయారు చేశాక పేదలకు లబ్ధి జరగాలని ఆశించారు. ఆలస్యమైనా కేంద్రం మంచి నిర్ణయం తీసుకుందన్న ఆయన, దాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని బలహీనవర్గాల తరఫున రాహుల్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. బలహీనవర్గాలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు. కులగణ న విషయంలో కేంద్రంపై విమర్శలు చేయడం తనకు ఇష్టం లేదన్నారు. మహాత్మా గాంధీ శాంతియుత పద్ధతుల్లో విజయాన్ని సాధించారు, గాంధీ విగ్రహాన్ని హిరోషిమాలో పెట్టుకొని జపానీయులు పూజిస్తున్నారు, గాంధీ గారు ఎలా అనుకున్నది సాధించే వరకు వదిలిపెట్టలేదో, రాహుల్ గాంధీ అలానే వదిలిపెట్టరు, ఏదో ఒక రోజు వారు అనుకున్నదానిని అందరూ పాటించాల్సిందేనని చెప్పారు.

# స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?

>> 26 మంది మృతిపై న్యాయ కమిషన్ ఏర్పాటు చేసి రిటైర్డ్ న్యాయమూర్తి చేత విచారణ జరపాలంటూ పిటీషనర్ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి పైవిధంగా స్పందించారు. మనం ఎప్పటి నుండి దర్యాప్తులో నైపుణ్యాన్ని సంపాదించాం మీరు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని దర్యాప్తు చేయమని అడుగుతున్నారు. వారు తీర్పు మాత్రమే చెప్పగలరు. మమ్మల్ని ఆదేశాలు జారీ చేయమని అడగకండని పిటిషనర్‌ను న్యాయమూర్తి మందలించారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో కాకుండా బయట చదువుతోన్న విద్యార్థులపై జరుగుతోన్న దాడులను సైతం ఈ పిటీషన్‌లో స్పష్టం చేయడం పట్ల న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ జరుపుతోన్న సంగతి తెలిసిందే. సాయుధ దళాల దెబ్బతీసే చర్యలు మానుకోవాలని హెచ్చరించింది. ఈ దేశంలోని ప్రతి పౌరుడు ఉగ్రవాదంపై పోరాడటానికి చేతులు కలిపిన కీలకమైన సమయం ఇది" అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బాధ్యత వహించండి. మీరు దేశం పట్ల కొంత బాధ్యతతో మెలగాలి. ఇదేనా మార్గం దయచేసి ఇలా చేయకండి. పదవీ విరమణ చేసిన హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎప్పటి నుండి ఇటువంటి అంశాలను (ఉగ్రవాదం) దర్యాప్తు చేయడానికి నిపుణుడిగా మారారు మేము దేనినీ అంగీకరించడం లేదు. దయచేసి మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారో అక్కడికి వెళ్లండి అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పహల్గాం ఘటనకు సంబంధించి రిటైర్డ్ జడ్జి చేత విచారణ జరిపించాలంటూ పిటిషనర్లు దాఖలు చేసిన పిల్ పై సుప్రీం పై ఘాటుగా స్పందించింది. ఇలా ఉండగా, జమ్మూ కశ్మీర్‌కు చెందిన ముగ్గురు నివాసితులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఉగ్రవాద దాడిపై జవాబుదారీతనం నిర్ధారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. పిటిషనర్లు ఫతేష్ కుమార్ షాహు, మొహమ్మద్ జునైద్, విక్కీ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్రపాలిత ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలలో పౌరుల భద్రతను నిర్ధారించడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కేంద్రం, జమ్మూ కాశ్మీర్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, జాతీయ దర్యాప్తు సంస్థలను ఆదేశించాలని వారు తమ పిటిషన్లో కోరారు. అయితే, సుప్రీం కోర్టు దీనిని కొట్టిపారేయడమే కాకుండా పిటిషనర్లకు, వాళ్ల తరపు న్యాయవాదికి చురకలంటించింది.

# ఏ ఒక్కరినీ వదలం

>> గడువు పాకిస్థాన్ జాతీయులు భారత్ విడిచి వెళ్లిపోవాలన్న గడువు బుధవారంతో ముగియడంతో మరోసారి ఆ ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తదుపరి ఆదేశాలు వెలువడేవరకు పాక్ జాతీయులు వాఘాఅటారీ సరిహద్దు నుంచి పాకిస్తాన్ వెళ్లేందుకు వెసులుబాటు కల్పించినట్లు వార్తలు వచ్చాయి. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ జాతీయులు దేశం విడిచి వెళ్లాలని కేంద్ర ఇచ్చిన ఆదేశాలు ముగియడంతో ఇరుదేశాల మధ్య ఉన్న వాఘాఅటారీ సరిహద్దును మూసివేశారు. వాఘాఅటారీ సరిహద్దు పూర్తిగా మూతపడినట్లు అధికారులు చెప్పారు. దీంతో పంజాబ్‌లోని వాఘా అటారీ వద్దే పాక్ జాతీయులు నిలిచిపోయారు. పెద్ద సంఖ్యలో వాహనాలు సరిహద్దు వద్ద నిలిచిపోయాయి.

# ఎస్సీ, ఎస్టీ రైతు సమస్యలు పరిష్కరించాలి

## కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ రైతుల సమస్యకు ఇటీవల తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్, వారసత్వంగా వచ్చిన ప్రభుత్వ భూముల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ రైతులే కబ్జాలో ఉన్నారని వారి పేరుతో పట్టా పాస్ బుక్లు లేవన్నారు. దౌల్తాబాద్ రైతు వేదికలో భూభారతి అవగాహన సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో కబ్జాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు పట్టా పాస్‌బుక్‌లు లేకపోవడంతో రైతు భరోసా రావడం లేదన్నారు. అలాగే బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడం లేదని, దీంతో పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. భూభారతి చట్టంపై గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సాదా బైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులు భూభారతితో సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులను నియమిస్తుందని చెప్పారు.

# గాంధీభవన్‌లో మేడే వేడుకలు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో ఐఎన్‌టియుసి పతాకం ఆవిష్కరించింది. ఆవిష్కరణ సందర్భంగా ఐఎన్‌టియుసి నేతలు కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. మేడే సందర్భంగా ఐఎన్‌టియుసి పతాకంతోపాటు జాతీయ పతాకం ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన జాతీయ పతాకం ఆవిష్కరణ కార్యక్రమంలో సేవాదళ్, ఐఎన్‌టియుసి ముఖ్య నాయకులు పాల్గొని మాట్లాడారు.

# మృత్యువులోనూ వీడని బంధం..

## విద్యుదాఘాతంతో తల్లీకొడుకులు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1, ప్రభాతవార్త:** నవమాసాలుమోసి పేగు తెంచుకొని పుట్టిన బిడ్డ కళ్లముందే కాటికి కాలుచాపడంతో ఆ బిడ్డను ఎలాగైనా కాపాడుకోవాలనే తపనతో తల్లి ముందడుగు వేసింది కానీ మృత్యువు తల్లి కొడుకులను విద్యుదాఘాతం రూపంలో వచ్చి కబళించింది. నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం తుమ్మలసూరు గ్రామంలో నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణ కోసం గ్రామంలో పిండిగిర్నిని నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం తల్లికి బాసటగా నిలిచేందుకు కుమారుడు శ్రీకాంత్(15) పిండి గిర్ని నిర్వహణ చేస్తున్న సమ యంలో అకస్మాత్తుగా పిండి గిర్నిలో విద్యుదాఘాతం చోటుచేసుకుంది. కొడుకుకు విద్యుదాఘాతం తగిలిన విషయం గమనించిన తల్లి జయమ్మ(40) కొడుకు శ్రీకాంత్‌ను కాపాడుకోవాలని శత విధాల ప్రయత్నం చేసినప్పటికి విఫలమైంది. విద్యుదాఘాతానికి గురై కొట్టుమిట్టాడుతున్న కన్న కొడుకును కాపాడుకోవాలనే ఆలోచనలో తాను కూడా విద్యుదాఘాతానికి బలైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. ఒకే సారి తల్లీకొడుకు మృతి చెందారనే విషయాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తట్టుకోలేక కంటతడి పెట్టారు. కుటుంబ సభ్యుల అర్ధనాథలు మిన్నంటాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా మృతుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



మృతి చెందిన తల్లీకొడుకులు (ఫైల్)

# మహిళను కత్తితో పొడిచి హత్య

**నవాబుపేట, మే 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాకర్జాల గ్రామ శివారులో యువతిని (23) దారుణంగా హత్యచేసి ఆ తర్వాత నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కొల్లూరు గ్రామానికి చెందిన సాలె శ్రీరామ్‌నరేష్ (30) జడ్చర్ల మండలం మల్లెబోయినపల్లి గ్రామానికి చెందిన గీతాంజలిని నిర్మాణుష్య ప్రదేశానికి తీసుకెళ్లి కళ్లలో కారంచల్లి కత్తితోపొడిచి చున్నీతో గొంతుకు ఉరేసి హత్యచేశాడు. అదే రాత్రి నిందితుడు పోలీసులకు ఫోన్‌చేసి లొంగిపోయాడు.

నరేష్‌కు గతంలో పెళ్లి అయి పాప కూడా ఉందని, భార్య ఇతనితో వేగలేక తల్లిగారి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. నిందితుడు జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పనిచేస్తూ మల్లెబోయినపల్లి గ్రామానికి చెందిన గీతాంజలి అనే యువతితో పరిచయం పెంచుకున్నాడు. అప్పటికే పెళ్లయి భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఆ యువతి నిందితుడికి దగ్గరైంది. దీంతో వారిరువురి సహజీవనం కారణంగా వారికి ఓ పాప పుట్టింది. అయితే ఆ తర్వాత వారి మధ్య కూడా మనస్పర్థలు వచ్చి తరచూ గొడవపడేవారని సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




సభలో ప్రసంగిస్తున్న ఎం.డి.యూసఫ్. చిత్రంలో ఎం.నర్సింహా, ప్రేమ్‌పావని తదితరులు

# నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం వెంటనే రద్దు చేయాలి

## ఎఐటియుసి డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 1, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం తిరోగమన విధానాలతో కార్మికుల హక్కులు, రక్షణ, గౌరవాన్ని తిరస్కరించే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల అమలుతో కార్మికుల హక్కులపై కేంద్రం నిరంతరం దాడి చేస్తున్నదని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయ కార్మిక దినం మేడేని పురస్కరించుకుని గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయం వద్ద ఆయన అరుణపతాకాన్ని ఆవిష్కరించి, జెండాను ఊపి కార్మికుల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన హైదర్‌గూడలోని షాలిమార్ ఫక్షన్ హాల్ వరకు జరిగింది. అనంతరం జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.నర్సింహ్మా ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో యూసఫ్ మాట్లాడుతూ కార్మికవర్గాన్ని గౌరవించడానికి, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం వారి పోరాటాలను స్మరించుకోవడానికి, కార్మికుల హక్కుల పోరాటానికి చిహ్నంగా మేడే జరుపుకుంటున్నామని చెప్పారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికోట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సభలో ఎఐటియుసి సినీయర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షులు ప్రేమ్‌పావని, కార్యదర్శులు మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, నందూరి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కులగణనకు దేశంలో రాహుల్.. రాష్ట్రంలో రేవంత్ హీరోలు

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** కుల గణన చేపట్టడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సమ్మతి తెలపడంతో దేశంలో రాహుల్‌గాంధీ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి హీరోలుగా మారారని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జనాభా గణనతోపాటు కులగణన చేపట్టాలనే ప్రధాని మోడీ నిర్ణయం హర్షణీయం కానీ క్రెడిట్ మాత్రం రాహుల్ దే అని దేశంలోని అణగారిన వర్గాల ప్రజలు చర్చించుకుంటున్నారని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకే వచ్చిన ఇలాంటి ఐడియా మోడీకి ఎందుకు రాలేదు అని బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చెప్పిన మాటను అనుసరించి కుల గణనను చేసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాక్ పాట్ కొట్టాడని అన్నారు.

రాహుల్ గాంధీకి ఎంత ముందు చూపు ఉందో చెప్పడానికి కుల గణనే ఒక నిదర్శనమని ఆయన అన్నారు. తెలంగాణలో రేవంత్ చేసిన కుల గణన పై కిషన్ రెడ్డి, కేటీఆర్, హరీష్ లు ఏం మాట్లాడినా ప్రజలు పట్టించుకోరని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర లో దేశ ప్రజల సమస్యలకు పరిష్కారం చేసే దిశగా అడుగులు వేశారు. జోడో యాత్రలో ప్రధానఅంశం కుల గణన చేయాలని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. ఇప్పుడున్న కేంద్రం కుల గణన చేస్తాం అని ప్రకటన చేయడం స్వాగతిస్తుంది.

రాహుల్ గాంధీ ముందు చూపుతో ఉన్నాడు అనడానికి కుల గణన ఒకటి అని ఆయన అన్నారు. సుష్మస్వరాజ్ కులగణన నినాదం ముందుగా వినిపించారని కిషన్‌రెడ్డి అనడం తగదు ఇది రాహుల్‌గాంధీ మాత్రమే అన్నారని ఆయన తెలిపారు. కిషన్‌రెడ్డి ఇప్పుడు ఏం అన్నా లాభం లేదు సుష్మస్వరాజ్ అప్పుడు అంటే ఇప్పటివరకు ఎందుకు చేయలేదు మీరుమీరేం చెప్పినా కుల గణన హీరో రాహుల్ గాంధీయే అని ఆయన ఘంటాపథంగా అన్నారు. కులగణనలో ఇతర మతాల వారు ఉండరు అని కిషన్ రెడ్డి కాదు మోదీ చెప్పాలి. కిషన్‌రెడ్డికి ఇష్టంలేదు కదా అని వదిలేస్తారా? ప్రధాని ఏం చెప్తారో చూసి మాట్లాడదాం. ముస్లింలు భారత దేశపౌరులు కదా? దేశంలో పుట్టిన హిందూ ముస్లిం క్రిస్టియన్‌లు అంతా భారత దేశబిడ్డలే కదా..? అని అన్నారు.

# కేంద్రం కులగణన నిర్ణయంపై గాంధీభవన్‌లో సంబురాలు

## ఉదయం రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం

## మధ్యాహ్నం వేడుకలు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** కులగణన చేపట్టాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గాంధీభవన్‌లో సంబురాలు అంబరాన్ని అంటాయి. గురువారం ఉదయం యాదవులు ఎంపి అనిల్ కుమార్ యాదవ్ నేతృత్వంలో గాంధీ భవన్ లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలుచేసుకొని రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసి చూపించిన విదంగా దేశ వ్యాప్తంగా కుల ఘననకు కేంద్ర కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ఎఐసిసిఅగ్రనేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి అనుకూలంగా నినాదాలు చేశారు. దేశంలో తొలి కులగణ చేసిన సిఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆయ చిత్రపటంకు పాలాభిషేకం చేస్తూ ఎంపి అనిల్‌యాదవ్ వ్యాఖ్యానించారు. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో మధ్యాహ్నం రెండున్నరకు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ నాయకత్వంలో టపాసులు పేల్చి కులగణన చేపట్టాలనే కేంద్ర నిర్ణయం స్వాగతించారు. గాంధీ భవన్ లో మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు ఇద్దరు సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడంతో కేంద్రం విధిలేక అనుసరిస్తున్నదని అన్నారు.

దేశవ్యాప్తంగా జనగణన కులగణన ఆధ్యుడు ఆరాధ్యుడు రాహుల్ అని ఫిషరీస్ చైర్మన్ అన్నారు. గాంధీ బిసిలకు 50శాతం మించి వారి జనాభా దామాషా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు అందుకొనేల కల్పించాలని దీనికి పార్లమెంట్ లో చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు చేసుకొని మిఠాయిలు పంచారు. క్షీరాభిషేకాలు చేశారు. గాంధీభవన్ మొత్తం సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసి చూపించిన విదంగా దేశ వ్యాప్తంగా కుల ఘననకు కేంద్ర కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సికి పాలాభిషేకం చేశారు. టపాసులు కాల్చి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరిపుకున్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి జిందాబాద్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు.

# జనగణనతోపాటు కులగణనకు కాలపరిమితిని విధించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 1, ప్రభాతవార్త:** మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మి స్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామంటూ ప్రకటించిందనీ, దానికి నిర్దిష్ట కాలపరిమితిని విధించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో మేడే వేడుకలను నిర్వహించారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఆనాడు ఎనిమిది గంటల పనివిధానం కోసం కార్మికులు పోరాడితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 12 గంటల పనివిధానాన్ని అమలు చేస్తున్నదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు కావడం లేదని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నదని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కు లేకుండా లేబర్ కోడ్‌లను తెస్తున్నదని అన్నారు. పెట్టుబడిదారులు దోపిడీ చేసేందుకు అనుకూలంగా చట్టాలను తెస్తున్నదని విమర్శించారు. రైతాంగం కనీస మద్దతు ధర కోసం ఉద్యమిస్తే భూమి నుంచి వారిని దూరం చేసి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తున్నదని చెప్పారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక లక్షకుపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల ఉపాధి హామీ పనికి రూ.2.50 లక్షల కోట్లు కావాలని అడిగితే రూ.86 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిందని విమ ర్శించారు. ఉపాధి హామీ పనులను కల్పించే బాధ్యత నుంచి కేంద్రం తప్పుకుంటున్నదని అన్నారు. శ్రామికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నదని చెప్పారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నదని విమర్శించారు. ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద పోగయ్యిందన్నారు. 50 శాతం ప్రజల వద్ద మూడు శాతం సంపద ఉందని వివరించారు. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటించారు. సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాలు, బస్తీల్లో సమ్మెకు మద్దతుగా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈనెల ఎనిమిదో తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు, ప్రదర్శనలను నిర్వహిం చాలని, మేడే స్ఫూర్తితో శ్రామికవర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. కర్రెగుట్ట అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను, వనరు లను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. మావోయిస్టులతో శాంతి చర్చలను జరపాలనీ, ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, బండారు రవికుమార్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసి క్రాస్‌రోడ్స్ సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

# అంతర పంటల సాగులో వెనుకబడిన రాష్ట్రం

## 12వ స్థానంలో తెలంగాణ

## కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** మిశ్రమ (అంతర) పంటల సాగులో రాష్ట్రం వెనుకం జలో ఉన్నట్లుగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధ్యయనంలో వెల్లడైంది. మిశ్రమ పంటల సాగులో తెలంగాణ దేశంలో 12వ స్థానంలో నిలిచింది. 2023-24 సంవత్సరానికి సంబంధించిన అధ్యయన రిపోర్ట్‌ను ఆ శాఖ గురువారం విడుదల చేసింది. ఒకే వ్యవసాయ క్షేత్రంలో ఏకకాలంలో రెండు, అంతకంటే ఎక్కువ పంట లను పండించే అంతర పంటల సాగు దేశంలో ఏటా విస్తరి స్తోందని నివేదిక స్పష్టం చేసింది. దేశంలో అంతర పంటల సాగులో బంగాల్, పంజాబ్, గుజరాత్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల తర్వాత స్థానంలో తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొంది. ప్రధాన పంటల మధ్య స్వల్పకాలిక పంటలను వేస్తున్నట్లుగా గుర్తించింది. కూరగాయలు, పండ్ల తోటల్లోనూ మిశ్రమ పంటలు సాగవుతున్నాయి. వరి పంట సాగు, ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థా నంలో ఉన్నప్పటికీ, మిశ్రమ పంటల సాగులో పురోగమించడం లేదని గుర్తించింది. రైతులు ప్రధా న పంటలు పండించేందుకే ఎక్కువ ఆసక్తి కనబరు స్తున్నట్లు పేర్కొంది. అంతర పంటలపై అంతగా ఆసక్తి లేకపోవడం, ప్రభుత్వపరంగా ఆశించి నటువంటి స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం తదితర అంశాలు దీనికి కారణాలుగా తెలిపింది.

# 50 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు విశ్రమించను

## త్వరలో ప్రధాని మోడీతో చర్చిస్తా: ఆర్.కృష్ణయ్య



ఆర్.కృష్ణయ్యను తులసిమాలతో సత్కరిస్తున్న బిసి నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, సిద్దేశ్వర్‌పటేల్.

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 1, ప్రభాతవార్త:** చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు సాధించేంతవరకు విశ్రమించేది లేదని, పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. దేశంలోని కోట్లాది మంది బిసిలు కూడా భారతమాత ముద్దు బిడ్డలేనని, అన్ని రంగాలలో బిసిలకు వాటా వస్తుందని, అన్ని డిమాండ్లపై త్వరలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి చర్చిస్తానని ఆయన చెప్పారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించడం–చారిత్రాత్మకమని– ఇందుకు ప్రధాన మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షత వహించగా 40 బిసి సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ బిసిల డిమాండ్ల సాధన కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా బిసి నాయకులు ప్రధాని కోరాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల తాను ప్రధాన మంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో కలిసి బిసిల డిమాండ్లపై చర్చించడం జరిగిందని, అంతకు ముందు రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని గుర్తు చేశారు. తమ విజ్ఞప్తి మేరకు కేంద్ర క్యాబినేట్ జనగణనలో కులగణన చేస్తామని ప్రకటిం చినందుకు మోడీ, అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్‌భగత్‌కు ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు చెప్పారు. బిసిలు హిందూవులేనని, ఎవరూ ఊహించని విధంగా విజయం సాధించడం జరిగిందని, కేంద్రంలో బిసిలకు మంత్రిత్వ శాఖ వస్తుందని, బిసిలంటే ప్రధాని ప్రేమ ఉందన్నారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలని, తెలుగు రాష్ట్రాలలో ఉన్న మాదిరిగా దేశ వ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు, హాస్టల్స్, ఫీజుల రీయంబర్స్ మెంట్ కోసం తదితర పథకాలు అమలు కోసం పిఎం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై సుప్రీంకోర్టులో వేసిన కేసును ఉపసంహరిం చుకుంటానని, అలాగే ఇతరులు కూడా ఉపసం హరించుకోవాలని కోరారు. ఈ సభలో బిసి నేతలు నీల వెంకటేష్, సిద్దేశ్వర్ పటేల్, ఆళ్ల రామకృష్ణ, లాలకోట వెంకటాచారి, మల్లేష్ యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే అడ్డు

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లు అడ్డంకిగా మారారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ ఒక ప్రతికాప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ కుల గణన తప్పులు తడక అనడం కిషన్ రెడ్డి, బండి సంజయ్ దిగజారుడు తనానికి నిదర్శనం అని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడం బిజెపి నేతలకు అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. కుల గణన పై కేంద్రం నిర్ణయం తో రాహుల్ సంకల్పం సిద్ధించిందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం కుల గణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని స్వోత్కర్షలు చెప్పుకున్నారు శాసన సభలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల సాక్షి గా ఏకగ్రీవ తీర్మానంతో బీసీ కుల గణనకు చట్ట బద్దత కల్పించామని ఆయన వివరించారు. బిసి పట్ల మీకు చిత్త శుద్ధి ఉంటే పార్లమెంట్ లో బిసి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసేలా పార్లమెంట్ లో చట్టం చేయాలని మహేష్‌కుమార్ డిమాండ్‌చేశారు. బిసి బిల్లు చట్ట బద్దత కోసం ప్రధాని మోదీకి లేఖ రాసే దమ్ముందా? బొమ్మ సవాల్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్ర మంత్రులమని మరిచి మాట్లాడటం వారి అహంకారానికి పరాకాష్ఠ అని అభివర్ణించారు. పారదర్శక సర్వేపై తప్పుడు ఆరోపణలు చేయడానికి బిసి బిడ్డగా బండి సంజయ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు. కేంద్రం జనగణన తో పాటు కులగణన నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ విజయమని ఆయన ప్రకటనలలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన ఎప్పుడు నిర్వహిస్తారో కేంద్రప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. కుల గణన తో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఆయన అన్నారు స్వతంత్ర భారతావనిలో కుల గణన నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. చారిత్రాత్మక కుల గణన, ఎస్సీ వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయాలతో దేశానికీ ఆదర్శంగా తెలంగాణ అని ఆయన

# అంగన్‌వాడీలకు వేసవి సెలవులు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు మొదటిసారి ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. రేపటి నుంచి నెల రోజుల పాటు హాలిడేస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. ఎండల తీవ్రత పెరగడంతో పాటు అంగన్వాడీ యూనియన్ల, తల్లిదండ్రుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాగా వేసవి సెలవుల్లో అంగన్వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు టేక్ హోం రేషన్ ద్వారా గుడ్లు, సరకులు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలియచేశారు. కాగా వేసవి సెలవుల్లో అంగన్వాడీ టీచర్లు ఇంటింటి సర్వే, చిన్నారుల గుర్తింపు వంటి విధులు నిర్వర్తించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

# తిరుపతిలో ఆన్‌లైన్ మోసం

**తిరుపతి, మే 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఆన్‌లైన్‌లో స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రెండింతలు అవుతుందని నమ్మించిన మోసగాళ్ళు ఓ బిటెక్ విద్యార్థి సైబర్‌నేరస్తుల వలలో పడ్డాడు. ఏకంగా తన తల్లిఅకౌంట్‌నుండి 6లక్షలు రూపాయలు పెట్టుబడిగా పెట్టి మోసపోయాడు. దీనిపై తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి సిఐ చిన్నగోవిందు కేసునమోదు చేశారు. చంద్రగిరి కొప్పరవాండ్లపల్లికి చెందిన మెకానికల్ డిప్లొమో విద్యార్థి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అదిక లాభాలు వస్తాయని ఫేక్‌యాప్ ద్వారా వాట్సాప్‌లింక్ కు అతని తల్లి అకౌంట్ నుండి 6,56,607రూపాయలు లావాదేవీలుగా పెట్టుబడి పెట్టాడు. లాబాలు వచ్చిన సొమ్మును డ్రా చేసుకోవడానికి మరో 10లక్షలు రూపాయలు జమచేయాలని సైబర్‌నేరస్తుడు నమ్మించాడు. అప్పటికే మోసపోయినట్లు గుర్తించిన విద్యార్థి 1930కి ఫిర్యాదు చేయడంతో బాగోతం వెలుగుచూసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.17లక్షలు విరాళం

**తిరుమల, మే 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం టిటిడి ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన వారాహి చలనచిత్రం వ్యవస్థాపకుడు, సినీనిర్మాత సాయికూరపాటి 17లక్షలు రూపాయలు డిడిలను విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి దాత అందించారు. భక్తులకు మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు వినియోగించాలని దాత కోరారు. కాగా తిరుమలలో అన్నప్రసాదం భవనంలో భక్తులకు ఒకరోజు వితరణకు 44లక్షలు రూపాయలు టిటిడి వెచ్చిస్తోంది. ఈ ఖర్చును కొందరుదాతలు తమ పుట్టినరోజు, పెళ్ళిరోజు, ఇంకా వారికి ఇష్టమైన రోజు వారివారి ఆర్థిక స్థోమతను బట్టి ఒకపూటకు అయ్యే ఖర్చును విరాళాల రూపంలో అందిస్తుండటం అభినందనీయం.

# పారిశ్రామికనోడ్‌ల అభివృద్ధికి రూ.3035 కోట్లతో టెండర్లు

**రాజంపేట అర్బన్, మే1 ప్రభాతవార్త** రాష్ట్రంలో వైజాగ్ చెన్నై, హైదరాబాద్ బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిలో ముందడుగు పడింది. ఈ రెండు కారిడార్ల పరిధిలోని ఉమ్మడి కడప జిల్లాలోని కొప్పర్తి, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు నోడ్ ల అభివృద్ధికి రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) టెండర్లను ఆహ్వానిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైజాగ్ చెన్నై కేంద్ర పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిలో భాగంగా కొప్పర్తిలో పారిశ్రామిక నోడ్ ను 2596 ఎకరాలలో 1264.44 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతారు. హైదరాబాద్‌బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ లో భాగంగా ఓర్వకల్ పారిశ్రామిక కారిడార్ను 2624 ఎకరాల విస్తీర్ణంలో 1771.19 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపడతారు.

ఈ రెండు పారిశ్రామిక రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. ఈ రెండు పార్కుల అభివృద్ధి కోసం డిజైన్లు, నిర్మాణం, మౌలిక సదుపాయాలు, నిర్వహణ కోసం టెండర్లు పిలవడం జరిగింది. బిడ్లు సమర్పించేందుకు జూన్ 12 చివరి గడువుగా నిర్ణయించింది. ఈపీసీ పద్ధతిలో పనులు చేపట్టాల్సి ఉంది.

వార్త

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.

-ఎడ్వర్డ్స్

# ప్రజారోగ్యానికి పొగబెడుతున్నదెవరు?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశాం, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్రప్రభుత్వం కానీ,ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్య విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరిచారు. కానీ ఇప్పటికీ అందరికి సంపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమవుతున్నారని చెప్పొచ్చు. మొన్న కరోనా సమయంలో మన వైద్యరంగం ఎంతటి దారుణ పరిస్థితుల్లో ఉందో బయటపడింది. కనీసం మనిషి బతకడానికి అవసరమైన ప్రాణవాయువు అందించలేకపోవడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికీ ఆ పరిస్థితి నుంచి మన బయటపడినట్టు కన్పించడం లేదు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులు కొందరు వ్యక్తులు తమకుతాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగిస్తున్నాయి. ఇందులో కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అనే తేడా లేకుండా బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు, చికిత్సలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. క్షయ, మలేరియా లాంటి వ్యాధులతోపాటు గుండె జబ్బులు, కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు కూడా పెరిగిపోతున్నాయి. వాస్తవంగా మలేరియాను రూపుమాపుతామని ఏనాడో ప్రకటించారు. కానీ నేటికీ దాని నుండి విముక్తి కలగలేదు. అతి ప్రధానమైన ప్రజారోగ్య సమస్యల్లో మలేరియా ఒకటిగా చెప్పొచ్చు. 1947లో దాదాపు ఏడున్నర కోట్ల మంది దీని బారిన పడగా వారిలో ఎనిమిది లక్షలమంది మరణించారు. వైద్యనిపుణులు చేసిన కృషి కారణంగా రెండువేల నాటికి సగానికి పైగా తగ్గించగలిగారు. గత యేడాది దేశవ్యాప్తంగా రెండు లక్షల ఇరవైఏడువేల మంది ఈవ్యాధిబారిన పడితే ఎనభై మూడు మంది మరణించారు. పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు దీనిని నియంత్రించగలిగినా ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దఎత్తునే ఈవ్యాధి ప్రాణాలను కబళిస్తున్నది. మెదడులో వ్యాపించే పాల్సీఫారం మలేరియా మృతుల్లో డెబ్భైశాతం గిరిజనులే ఉన్నారు. కొండప్రాంతాల్లో అడవుల్లో తేమ,వాతావరణం దోమల వ్యాప్తికి కారణమవుతున్నది. మలేరియానే కాదు, దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. స్వైన్‌ఫ్లూ,ఎబోలా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధకశక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.ఒక్క అల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం,హోమియో తదితర అన్నివిభాగాల డాక్టర్లు, వైద్యనిపుణులు శరీరంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెబుతున్నారు. అయితే ప్రజలకు ఈ వాస్తవాలు తెలిసి కూడా రోగనిరోధకశక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? ఈ రోగాలకు కారణాలు ఏమిటి? కారకులు ఎవరు?తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజుల్లోనో, వారంలోనో, నెల రోజుల్లో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటిస్తున్నవారు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది? ఎక్కడ నుండి వస్తుంది? మరోకపక్క కాలుష్యం ప్రజారోగ్యాన్ని కాటు వేస్తున్నది? కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రధానంగా వాయు, నీటికాలుష్యాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. భారతదేశంలో రాజధాని ఢిల్లీతోసహా దాదాపు వంద నగరాలకుపైగా వాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క వాహనాలు వదులుతున్న పొగ దీనికి తోడవుతున్నది.ఇంకొకపక్క ధూమపానంకూడా ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా 130కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నట్లు చెబుతున్నారు. భారత్‌లో ఇరవైకోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటుపడ్డారు. ఇందులో బీడీలు తాగేవారే ఎక్కువ. సిగరెట్లు, బీడీలు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. పదిహేనేళ్ల మైనర్లు కూడా ఈబీడీలకు అలవాటుపడుతున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిదివందలకు పైగా విషవాయువులు ఉన్నట్లు గుర్తించారు. ఇవి అనేక రోగాలకు కారణమవుతున్నాయి.మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న విషయం తెలియందికాదు. ఇవే కాదు కల్తీ కూడా ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. ఇలాంటి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. వీటిని కట్టడి చేయకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజారోగ్యాన్ని కాపాడడం సాధ్యమయ్యే పనికాదు.



కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.

జార్జి బెర్నార్డ్ షా



ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంతవరకూ విజయం సాధించలేడు.

ఎమర్సన్

# ప్రజావాక్కు



## ఎస్జీటీ టీచర్లను కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్కూళ్లలో రీస్ట్రక్చర్‌లో భాగంగా విద్యార్థి,ఉపాధ్యాయుల నిష్పత్తిలో ఫౌండేషన్ పాఠశాలలకు బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు తీవ్ర అన్యాయం జరిగింది. ఫౌండేషన్ స్కూల్‌లకు 30లోపు విద్యార్థులకు ఒక ఎస్జీటీ టీచర్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 20 లోపు విద్యార్థులకు ఒక ఎస్జిటి టీచర్ కేటాయిస్తుండగా హైస్కూల్లోని బేసిక్ ప్రైమరీస్కూళ్లలో మాత్రమే10మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలను, 11నుంచి 30 మంది విద్యార్థులకు ముగ్గురు ఎస్జీటీ కేటాయించడం ఎంతవరకు సమంజసం. వివిధ రకాల ప్రైమరీ స్కూళ్లకు ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిలో వ్యత్యాసాలు ఉండటం సరికాదు. దీనివల్ల బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో, ఫౌండేషన్ స్కూల్‌లలో అధిక శాతం స్కూళ్ల ఏకోపాధ్యాయపాఠశాలలుగా మారుతాయి.ఆయా స్కూళ్లలో మెరుగైన గుణాత్మక విద్య అందుబాటులో ఉండదు. ఆ ఆలోచనను వెనక్కుతీసుకుని మిగులుటీచర్లను స్కూళ్లకు కేటాయించాలి. ప్రతిబేసిక్ ప్రైమరీస్కూలు, ఫౌండేషన్ స్కూల్స్‌లోరెండోటీచరుగాఎస్జీటీచరును కేటాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూమిని యూనివర్సిటీకే అప్పగించాలని కోరుతూ విద్యావ్యవస్థ బలోపేతంలో భాగంగా యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ అభివృద్ధికే ఉపయోగించాలని తెలుపుతూభవిష్యత్తు తరాలకు సంపూర్ణ విద్యనుఅందించాలి అంటే యూనివర్సిటీలలో ఉన్న భూములను ఉద్యమ వనములు, క్రీడా మైదానాలకు గాను ల్యాబ్ లకు, నూతన కోర్సులు ప్రవేశపెట్టి భవన నిర్మాణాలు చెప్పట్టి ఉన్నత నాణ్యమైన విద్య పేద విద్యార్థులకు అందే విధంగా చూడాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## నవ్వుతూ బతకాలి

పరిశోధకుల లాఫర్ స్టడీ ప్రకారం రక్తప్రసరణ బాగుండాల్నా, గుండె సమస్యల బారిన పడినా, మందుల కన్నా నవ్వటమే మేలు అని తేల్చి చెప్పారు. కాబట్టి నవ్వుకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలి. నవ్వించే పుస్తకాలు చదవాలి. నవ్వించే సినిమాలు చూడాలి. అందరూ నవ్వుతూ బతకాలి. అందరిని నవ్విస్తూ ఉండాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

## పథకాలతో ప్రయోజనాలు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమిలేని నిరుపేదల పాలిట వరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరులపనికి హక్కునుకల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగాస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్ద మొత్తంలో అందిస్తూ మహిళలలో నాయకత్వ బాధ్యతను సమిష్టితనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగాస్వాములను చేస్తూ బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇలాగే ఈ పథకాలు కొనసాగాలి.

-భారత అవినాష్, జనగామ

## తల్లిదండ్రులను గౌరవించండి

తమ జీవితాంతం పిల్లలకోసం బతికిన తల్లిదండ్రులను చివరకు వృద్ధాశ్రమంలో,రోడ్లపైనావదిలేస్తున్నారు కొందరు.తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డల ఉన్నతికి కారణమైన తండ్రి,రోడ్డుపై , వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా,అనాథలా కాలం గడపాల్సి వస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పు చెయ్యరు. పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు అండగాఉంటే, సమాజం మరింత సంతోషకరంగా మారుతుంది. కాబట్టి తల్లిదండ్రులను గౌరవించండి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పోస్టులను భర్తీ చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలో ఉపాధ్యాయులు మరియు లెక్చరర్స్ సాంక్షన్ పోస్టులు ఉండి ఆయా సబ్జెక్టులకు సంబంధించిన కోర్సులను కూడా ఆయా విద్యా సంస్థలలో 2025-2026 వచ్చే విద్యాసంవత్సరం 12 జూన్ 2025 నాటికి ఆయా సబ్జెక్టులను విద్యా సంస్థలలో ప్రారంభించాలి. సంబంధిత అధికారుల చేత ఆదేశాలు జారి చేసి ఎక్కడ సాంక్షన్ అయిన పోస్టులను అక్కడనే సంబంధిత కోర్సులను కూడా ప్రవేశపెట్టాలి. పేద విద్యార్థులు గ్రామీణ విద్యార్థులు చదువుకు దూరం కాకుండా విద్యార్థుల విద్య అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పార్ట్‌టైం అధ్యాపకులు వెట్టిచాకిరి కూలీలేనా!

***1976లో భారత ప్రభుత్వం అమానవీయ వెట్టిచాకిరి నిర్మూలన కోసం చట్టం చేసినా అత్యున్నత విద్యాసంస్థ అయిన విశ్వవిద్యాలయాలలో వెట్టి చాకిరి ఆనవాళ్లు కనిపించటం ప్రజా ప్రభుత్వానికి మాయనిమచ్చగా మిగిలిపోతుంది. కాబట్టి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలి. రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాలలో ప్రస్తుతం పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకి మినిమం టైమ్ స్కేల్‌తో ఉద్యోగ భద్రతను కల్పిస్తూ సుదీర్ఘ బోధనా అనుభవం, విషయ నిపుణత కలిగి ఉన్న పార్ట్ టైం అధ్యాపకులకి అధ్యాపక నియామకాలలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలి. విశ్వవిద్యాలయాలలో అత్యంత వివక్షతకి అన్యాయానికి గురవుతున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పట్ల డిమాండ్ల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆశిద్దాం.***



డాక్టర్ తిరునహరి శేషు

విద్యా నిలయాలుగా విరాజిల్లిన విశ్వవిద్యాలయాలు పాలకుల పట్టింపు లేని వైఖరితో నేడు సమస్యలకు నిలయాలుగా మారి తమ ప్రతిష్టను కోల్పోతున్నాయి. అనేక సామాజిక సమస్యలకు చర్చా వేదికలుగా, నూతన ఆవిష్కరణలకు పరిశోధనలకి ప్రయోగశాలలుగా,ప్రభుత్వ విధాన నిర్ణయాలలో భాగస్వాములుగా తమ ప్రత్యేకతను నిలబెట్టుకున్న విశ్వవిద్యాలయాలు నేడు అనేక సమస్యలతో పూర్వవైభవాన్ని కోల్పోతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో అధ్యాపక నియామకాలు ఒకటి. విశ్వవిద్యాలయాల పరిపుష్టికి కొత్తగా నియామకాలు ఎలా చేపట్టాలి అనేది ఒక సమస్య అయితే, ఇప్పటికే దశాబ్దానికి పైగా విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రాతిపదికన పనిచేస్తున్న వందలాదిమంది అధ్యాపకులను ఏమి చేయాలనేది ప్రభుత్వం ముందున్న ఒక సంక్లిష్ట సమస్య.విశ్వవిద్యాలయాలలో అధ్యాపక నియామకాలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్.21 ద్వారా మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో మా ఉద్యోగ భద్రతకి ఎలాంటి హామీ ఇవ్వకుండా, మా సమస్యలకు పరిష్కారం చూపించకుండా జీవోని ఎలా విడుదల చేస్తారని కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులుజీవోకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాటపట్టారు. విశ్వవిద్యాలయాలలో బోధన కోసం రెగ్యులర్, కాంట్రాక్ట్ పార్ట్ టైం ప్రాతిపదికన అధ్యాపక నియామకాలు చేపడతారు. ముగ్గురుకి ఒకే పని భారం కానీ వేతనాల చెల్లింపులో మాత్రం భారీ వ్యత్యాసం ఉంటుంది. ఉన్నత విద్యార్హతలు, అత్యున్నత డిగ్రీలు, జాతీయ, రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షలలో ఉత్తీర్ణులై అన్నిఅర్హతలు ఉన్నవారిని రోస్టర్ పాయింట్‌తో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ పర్యవేక్షణలో వైస్ ఛాన్సలర్ నామినీ చేత ఇంటర్వ్యూలను నిర్వహించి యుజిసి మార్గదర్శకాలతో పార్ట్‌టైం అధ్యాపకులను నియమించుకొని బోధనతో పాటు పరీక్షల,ల్యాబ్‌లనిర్వహణ, మూల్యాంకనం లాంటి అన్ని రకాలైన సేవలకి వారిని ఉపయోగించుకుంటూ సంవత్సరంలో ఆరు నెలలకు మాత్రమే వేతనాలు చెల్లిస్తూ వెట్టిచాకిరీ చేసే ఒక బాండెడ్ లేబర్‌గా పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు మారినా అటు విశ్వవిద్యాలయ అధికారులు కానీ ఇటు ప్రభుత్వంకానీ పట్టించుకోవడం లేదు. తెలంగాణరాష్ట్ర ఏర్పాటుకు ముందు విశ్వ విద్యాలయాలలో ఫుల్‌వర్క్ లోడ్‌తో పనిచేసే పార్ట్ టైం అధ్యాపకులను ఆటోమేటిక్‌గా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్ గ్రేడ్ చేయటం వలన కొంత ఉద్యోగ భద్రతతో పాటు ప్రతినెలా ఒక నిర్దిష్ట పరిమాణంలో వేతనం లభించేది కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో విశ్వవిద్యాలయాలలో ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి కొత్త నియామకాలు చేపట్టరాదని ఒక సర్క్యులర్ విడుదలచేసింది. ప్రభుత్వం విడుదల చేసిన ఆ సర్క్యులర్‌ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వఅధికారులు, విశ్వవిద్యాలయ అధికారులు పార్ట్‌టైం అధ్యాపకులకి న్యాయంగా రావలసిన కాంట్రాక్ట్ అప్ గ్రేడేషన్‌ని నిలిపివేయడం వలన విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకి మరింత అన్యాయం జరిగింది. అతి తక్కువ వేతనాలతో విశ్వవిద్యాలయాలలో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న పార్ట్ టైమ్ అధ్యాపకులు నాలుగు పదుల వయసు దాటిన వారే, చేస్తున్న ఉద్యోగంతో వస్తున్న వేతనంతో కుటుంబాలను పోషించలేక పిల్లలకి మంచి భవిష్యత్తు ఇవ్వలేక పోతున్నామనే ఆందోళన భవిష్యత్తుపై బెంగతో వస్తున్న కన్నీళ్లను కనురెప్పల మాటునే అదిమి తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తూ వేలాదిమంది విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యాబోధన అందిస్తున్నారు. భద్రత లేని ఉద్యోగం, సంవత్సరంలో 6 నెలలు అది కూడా నెలనెలా రాని చాలీచాలని జీతం వచ్చినా తీరని అవసరాలతో పార్ట్‌టైం అధ్యాపకుల జీవితాలను కదిలిస్తే కన్నీటి గాథలే కనిపిస్తున్నాయి. ఒక పార్ట్ టైం అధ్యాపకుడి పసిబిడ్డ అనారోగ్యం పాలైతే లక్షల రూపాయలు పెట్టి బిడ్డను బ్రతికించుకోలేక అతను పడిన బాధ వర్ణనాతీతం. మరొక పార్ట్‌టైం అధ్యాపకురాలు భర్త చనిపోతే వస్తున్న జీతంతో తన బిడ్డలను పోషించలేక పని చేస్తున్న విద్యాసంస్థకే ఫినాయిల్ అమ్ముతూ బ్రతుకునీడుస్తున్న ఉదంతం, కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఒక పేద పార్ట్ టైం అధ్యాపకుడు విధులు నిర్వహించి ఇంటికి వచ్చి మరణిస్తే విశ్వవిద్యాలయం కానీ ప్రభుత్వం కానీ ఎలాంటి సహాయం ఆ కుటుంబానికి చేయకపోవటం చూస్తుంటే పార్ట్‌టైం అధ్యాపకుల జీవితాలు వ్యవస్థ మిగిల్చిన ఒక విషాదంగానే కనిపిస్తున్నాయి. పనిచేయటానికి (విద్యాబోధన) పనికివస్తున్న మేము అవకాశాలకు పనికిరామా అనే ఆవేదన పార్ట్ టైం అధ్యాపకుల మనసుని కలిచివేస్తుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో అధ్యాపక నియామకాల కోసం విడుదల చేసిన జీవో నెంబర్. 21 మార్గదర్శకాలలో పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీసెస్ కూడా పరిగణలోకి తీసుకోకపోవడం పార్ట్ టైం అధ్యాపకులను మరింత ఆవేదనకి,ఆందోళనకి గురిచేస్తుంది.



విశ్వవిద్యాలయాలలో వివక్షతకి అత్యంత శ్రమ దోపిడికి గురవుతున్న పార్ట్‌టైం అధ్యాపకుల పట్ల విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఉదాసీన వైఖరి భారత రాజ్యాంగ స్ఫూర్తికి, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కనిపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని తన చేతులలోకి తీసుకోవాలని ప్రయత్నించినప్పుడు హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు అలెన్‌గార్బర్ వ్యవహరించిన స్ఫూర్తితో తమ స్వయం ప్రతిపత్తి కలిగిన అధికారాలతో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లు పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించే చొరవ తీసుకోవాలి. విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయటమంటే ఉద్యోగాల భర్తీ మాత్రమే కాదు విద్యాబోధన చేస్తున్నఅధ్యాపకులకి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దటం కూడా అని ప్రభుత్వాలు గుర్తించకపోవడం శోచనీయం. రెగ్యులర్ అధ్యాపకుల రిటైర్మెంట్ వయోపరిమితిని 60నుండి 65 సంవత్సరాలకు పెంచిన ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో శ్రమ దోపిడీకి గురవుతున్న పార్ట్ టైం అధ్యాపకుల సమస్యల పట్ల స్పందించకపోవడం ప్రజాపాలన అనిపించుకుంటుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన నష్టపోయిన పార్ట్‌టైం అధ్యాపకులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వానిదే. 1976లో భారత ప్రభుత్వం ఆమానవీయ వెట్టిచాకిరి నిర్మూలన కోసం చట్టం చేసినా అత్యున్నత విద్యాసంస్థ అయిన విశ్వవిద్యాలయాలలో వెట్టి చాకిరి ఆనవాళ్లు కనిపించటం ప్రజా ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలిపోతుంది. కాబట్టి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలి. రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాలలో ప్రస్తుతం పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకి మినిమం టైమ్ స్కేల్‌తో ఉద్యోగ భద్రతను కల్పిస్తూ సుదీర్ఘ బోధనా అనుభవం, విషయ నిపుణత కలిగి ఉన్న పార్ట్ టైం అధ్యాపకులకి అధ్యాపక నియామకాలలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలి. విశ్వవిద్యాలయాలలో అత్యంత వివక్షతకి అన్యాయానికి గురవుతున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పట్ల డిమాండ్ల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆశిద్దాం. •

# అడవితల్లి బాటతో ఆదివాసీల డోలీ మోతలకు ముగింపు

ఎస్.సీతారామయ్య

కట్టుబాట్లతో జీవనం, విల క్షణమైన ఆహారం, గొప్ప ఐక్యత, అడవితల్లి ఒడిలో నిత్యం ఒదిగిసాగే పయనం. ఇలా ప్రత్యేక జీవనశైలి ఆది వాసీల సొంతం, వాళ్లే దేశానికి మూలవాసులు పచ్చని ప్రకృతి ఒడిలోఅడవితల్లినే నమ్ముకొని, తరతరాలుగా జీవనం సాగిస్తున్న అడవి బిడ్డలే ఆదివాసీలు, ప్రపంచ వ్యాప్తంగా 90దేశాల్లో 37కోట్ల మంది ఆదివాసీలు నివసిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. మన దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు న్నారు. ఆంధ్రప్రదేశ్లో అటు శ్రీకాకుళం నుంచి ఇటు చిత్తూరు వరకూ విస్తరించిన తూర్పు కనుమల్లోనూ, వాటి సాణువుల్లోనూ ఆదివాసీలు జీవిస్తున్నారు. అల్లూరిసీతారామ రాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వీరి సంఖ్య ఎక్కువ. గత జనాభా లెక్కల ప్రకారం వీరు 27.39 లక్షలుగా ఉన్నారు. పాలకుల తీరుతో ఆదివాసీలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. చాలా గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సదుపాయం లేదు. వైద్య సదుపాయాలు మృగ్యం. ఏదైనా రోగమొస్తే డోలీ మోతలే దిక్కవుతున్నాయి. మార్గం మధ్య లోనే తనువు చాలిస్తున్న ఘటనలు కోకొల్లలు. చిన్నారులు చదువుకునేందుకు కిలోమీటర్ల దూరం పొలాల గట్లపైనా, కొండకోనల వెంబడి నడిచి వెళ్లాల్సిన దుస్థితి. ఇటువంటి దుస్థితి నుంచి ఆదివాసిలను భవ్య ప్రపంచం వైపు నడిపించడానికి ఆదాయం, రాజకీయ ప్రయోజనాలు వంటివి ఆశించకుండా గిరిజన బిడ్డలకు మేలుచేయాలనే లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది వారి బాధలు తీర్చడానికి పెట్టిన గొప్ప కార్యక్రమం 'అడవితల్లి బాట'.

ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం క్రింద 206 రహదారులు, 612.72 కిలోమీటర్ల మేరరోడ్లు, 239అనుసంధాన గ్రామాలు, రూ.555.61కోట్ల నిధులు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం 343 రోడ్లు,367 అనుసంధాన గ్రామాలు, 471.63 కిలోమీటర్ల రోడ్లు, రూ.399.66 కోట్ల నిధులు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నిధులు 9 రోడ్లు, 19 అనుసంధాన పంచాయతీలు, 48.85 కిలోమీటర్లమేర రోడ్లు, రూ.49.73 కోట్ల నిధులను సమకూర్చుకుని ఈ కార్యక్రమం ద్వారా ఆదివాసి గ్రామాల్లో ఎన్నాడు లేనివిధంగా అభివృద్ధిని పరుగులు పెట్టించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఉంది. అడవితల్లి బాట కార్యక్రమం గిరిజన గ్రామాల రూపురేఖలు మార్చే వరకు నిరంతరం కొనసాగించే విధంగా కార్యాచరణ చేయడం చూస్తే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి కనిపిస్తుంది. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సరైన రోడ్లు ఉండాలి. గిరిజన గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో తక్కువ మంది జనాభాతో ఉంటాయి. వాటిని అనుసంధించాలనే గొప్ప సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం తీసుకు వచ్చింది. 500 జనాభాలోపు ఉన్న గ్రామాలకు కూడా అనుసంధాన రహదారులు వేయాలంటే ప్రధాన మంత్రి జన్‌మన్ ఎంతగానో ఉపయోగపడుతున్నది. ప్రభుత్వంలో నిధులు లేని సమయంలో కూడా గత ప్రభుత్వం ఉన్న నిధులను అడ్డగోలుగా వాడేశారు. లెక్కా పత్రం లేకుండా నిధులను పక్కదోవ పట్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తే నిధులు లేకపోయినా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గిరిజనుల గ్రామాల అభి వృద్ధికి రోడ్లు వేయాడానికి రూ.49 కోట్లు కేటాయించడం చూస్తే అతనికి గిరిజన గ్రామాలంటే ఎంత అభిమానమో అర్థం అవుతున్నది. అడివితల్లికి ఏదో చేయాలన్న ఆలోచన నుంచి పుట్టిన కార్యక్రమమే అడవితల్లి బాట కార్యక్రమం. గిరిజన ప్రాంతం ఒక అద్భుతం. టూరిజం పూర్తి స్థాయిలో ఇక్కడ అభివృద్ధి చెందితే, దేశం మొత్తం గిరిజన ప్రాంతాల వైపుచూస్తాయి. ప్రభుత్వలెక్కల ప్రకారం నేడు మన రాష్ట్రం లో 2,605 గిరిజన ఆవాసాలు ఉంటే వాటిలో 1,177 ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటిలేదు. ప్రస్తుతం మొదటి విడత అడవితల్లిబాట కార్యక్రమంలో 1,069 ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీ చేస్తున్నారు. మిగిలిన గ్రామాలకు కూడా సమీప కాలంలో పూర్తిచేస్తాం అని, ఆదివాసిల బిడ్డల బంగారు భవిష్యత్తు కూటమి ప్రభుత్వానికి అవసరం. ఆదివాసి ప్రజల మనసులు గెలుచుకోవాలంటే వారికి వారి అవసరాలు, సౌక ర్యాలు, వసతులు తీర్చేప్రభుత్వం కావాలి. అలాంటి ప్రభు త్వమే కూటమి ప్రభుత్వం అన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా రోడ్లు వేసి ఆదివాసిలకు డోలీ మోతల కష్టలు,మరణాలు నుంచి విముక్తికి ఆదివాసీ ప్రాంతంలో పట్టిపీడిస్తున్న అనేక సమస్యల పరిష్కరానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఈ ప్రభుత్వ కృషికి ఆదివాసి సమాజం ఎప్పుడు రుణపడి ఉంటుంది. •

# కులగణన సామాజిక న్యాయానికి తొలి అడుగా?

డి జె మోహన రావు

స్వాతంత్ర్యం అనంతరం సమగ్ర కులగణన జరుగుతుంది. భారతదేశంలో కులగణన ఒక సంక్లిష్టమైన సామాజిక రాజకీయ చర్చాంశం. స్వాతంత్ర్యం అనంతరం ఇతరకులాల సమగ్ర గణన జరగకపోయినా, 2025లో జరగనున్న జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ఆవశ్యకత, దాని అమలులో ఎదురయ్యే సవాళ్లు ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లోతైన విశ్లేషణ అవసరం. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విద్యా ఉద్యోగరంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్యతెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతే కాకుండా కులగణన వివిధ కులాల సామాజిక ఆర్థిక విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది. కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలక పాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటిరంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు.ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. చివరగా కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు ఆర్థికవేత్తలు ఇతర పరిశోధకులకు



కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి ఒక విలువైన వనరుగాఉపయోగపడుతుంది. ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది.భారతదేశంలో విశాలజనాభా భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్దసవాలు. దేశంలో వేలసంఖ్యలో కులాలు ఉపకులాలు ఉన్నాయి. వాటిని కచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. కాలక్రమేణా వ్యక్తులు సమూహాలు తమ కులగుర్తింపును మార్చుకునే అవకాశం ఉంది. డేటా సేకరణలో పక్షపాతం సామాజిక రాజకీయ ఒత్తిడులు లాజిస్టికల్ సమస్యలు ప్రజల్లో అవగాహన లేమి సేకరించిన డేటా గోప్యత భద్రత వంటి అనేక సవాళ్లు ఈ ప్రక్రియలో ఎదురవుతాయి. సాంకేతికత సమగ్ర ప్రణాళిక ఈ సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన వ్యూహాలు అవసరం. కులాల వర్గీకరణ కోసం స్పష్టమైన మార్గదర్శకాలు సాంకేతికత వినియోగం కీలకం. ప్రజల స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం గణన సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వడం పక్షపాతాన్ని తగ్గించగలదు. పారదర్శక ప్రక్రియలు స్వతంత్ర పర్యవేక్షణ రాజకీయ జోక్యాన్ని నివారిస్తాయి. ఆధునిక సాంకేతికత డేటా సేకరణ నిర్వహణను సమర్థవంతం చేస్తుంది. విస్తృత అవగాహన కార్యక్రమాలు ప్రజల సహకారాన్ని పెంచుతాయి. కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లు డేటా గోప్యతను కాపాడతాయి. కులగణన విజయవంతం కావాలంటే ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. స్పష్టమైన లక్ష్యాలు పరిధిని నిర్దేశించడం సమగ్రమైన ప్రణాళికవ్యూహం రూపొందించడం కచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. కులగణన భారతదేశ సామాజిక రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. ఇది కేవలం సంఖ్యల లెక్కకాదు సమానత్వం సామాజిక న్యాయంవైపు ఒక చారిత్రాత్మక అడుగు. ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించి సరైన జాగ్రత్తలు తీసుకుంటే కులగణన వెనుకబడినవర్గాల సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా మారగలదు. ఇది లక్షిత విధానాల రూపకల్పనకు వనరుల సరైన కేటాయింపునకు అంతిమంగా ఒక సమగ్రమైన న్యాయమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. ఈ చారిత్రాత్మక ప్రక్రియను విజయ వంతం చేయడం మనందరి బాధ్యత. •

# పహాల్గాంకు ముందు 3 ప్రాంతాలు టార్గెట్



## భద్రతా దళాలతో వెనుకంజవేసిన ముష్కరులు

**శ్రీనగర్, మే 1:** పహల్గాం దాడికి రెండు రోజుల ముందు నుంచే బైసరన్ లోయలో ఉగ్రవాదులు ఉన్నారని తెలుస్తోంది. వాస్తవానికి ఉగ్రవాదులు వేరే మూడు చోట్ల మారణకాండ సృష్టించాలని నిర్ణయించుకున్నారు. అసలు దాడి చేయాలనుకున్నది ఈ మూడు చోట్ల.. 2 రోజుల ముందే పహల్గాంకు ఏప్రిల్ 22న, జమ్ము కశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై సాయుధ ఉగ్రవాదులు కాల్పులు జరిపిన ఘటనకు సంబంధించి సంచలన విషయాలు ఒక్కక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రమూకలు దాడికి పాల్పడ్డ పహల్గాంలోని బైసరన్ లోయకు రెండు రోజుల ముందే చేరుకున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 22 దాడికి రెండు రోజుల ముందు బైసరన్ లోయలో ఉగ్రవాదులు ఉన్నారని కూడా నివేదిక పేర్కొంది. అంతేకాదు, వాస్తవానికి ఉగ్రవాదులు మరో మూడు చోట్ల మారణకాండ సృష్టించాలని భావించినట్టు తెలుస్తోంది. అరు వ్యాలీ, ఎమ్యూజ్ మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ప్రదేశాలపై దాడి చేయాలని ఉగ్రవాదులు మొదట ప్రణాళిక వేసుకున్నారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ప్రదేశాలలో భద్రతా దళాలు ఉండటం వల్ల వారి ప్రణాళిక విఫలమైందని సమాచారం. బైసరన్ లోయ దాడికి సంబంధించి ఉగ్రవాదులకు నలుగురు భూగర్భ కార్మికులు సహాయం చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి అధికారులు దాదాపు 20 మంది ఉగ్రవాదులను గుర్తించగా, మరికొందరిని కూడా అరెస్టుచేశారు. దాడికి సంబంధించి మొత్తం 186 మందిని విచారిస్తున్నారు. బైసరాన్ వ్యాలీలో నరమేధానికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా జమ్ము కశ్మీర్‌లోనే ఎన్ఐఏ అధికారులు అనుమానిస్తున్నారు. ఉగ్రఘటన జరిగి వారం రోజులు గడిచినా దాడికి పాల్పడిన ముష్కరులు మాత్రం ఇంకా కశ్మీర్‌లోనే దాగి ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఎన్ఐఏ వర్గాలు తాజాగా వెల్లడిం చాయి. ముష్కరులు దక్షిణ కశ్మీర్‌లో తలదాచుకు న్నట్లు ఎన్ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన బలమైన ఆధారాలు ఉన్నట్లు తాజాగా వెల్లడించాయి. ఒకవేళ భద్రతా బలగాలు వారిని గుర్తించి కాల్పులు జరిపితే.. కవర్ ఫైర్ చేసేలా మరింతమంది ముష్కరులను వీరికి బ్యాకప్‌గా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ ఉనికి బయటపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు సదరు వర్గాలు గుర్తించాయి. ఆహార సామగ్రితోపాటు ఇతర ముఖ్యమైన వస్తువులను తమవెంట తీసుకెళ్లినట్లు గుర్తించామని ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. అటవీ ప్రాంతంలో ఎక్కువ కాలం గడిపినా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లూ చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అంతేకాదు దక్షిణ కశ్మీర్ ప్రాంతంలో మరింత మంది ఉగ్రవాదులు దాక్కొని ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**మరో ఉగ్రకుట్ర గుట్టురట్టు**

దేశంలో మరో ఉగ్రదాడి గుట్టు చేసారు. పంజాబ్ పోలీసులు జాయింట్ ఆపరేషన్తో ఈ ముప్పు తప్పింది. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని భరోపాల్ గ్రామంలో ఈ ఉగ్రమూక బాగోతం బట్టబయలైంది. దుండగులు ఆయుధాల అక్రమ రవాణాకు ఉపక్రమిస్తోన్న తరుణంలో బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు చాకచక్యంగా ఉగ్రమూక ఉనికిని పసిగట్టి పెద్ద ముప్పును తప్పించారు. సరిహద్దు భద్రతా దళం, పంజాబ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో భాగంగా అమృత్‌సర్ జిల్లాలోని సదరు గ్రామం నుండి రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లతో సహా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఇవాళ బిఎస్ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. భరోపాల్ గ్రామం సమీపంలో ఈ ఆపరేషన్ జరిగింది. స్వాధీనం చేసుకున్న వస్తువులలో రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఆరు మ్యాగజైన్‌లతో మూడు పిస్టళ్లు ఇంకా 50 లైవ్ రౌండ్లు ఉన్నాయి. పంజాబ్ పోలీసులతో వేగంగా సమన్వయం చేసుకోవడం వల్లే ఒక పెద్ద ఉగ్రవాద ఘటన జరగకుండా నిరోధించాం" అని బిఎస్ఎఫ్ అధికారి తెలిపారు. గత వారం రోజుల్లో భారత అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో భారీగా పట్టుబడ్డ ఆయుధాలు, పేలుడు పదార్థాల రికవరీలలో ఇది ఒకటి. కొన్ని రోజుల క్రితం, అమృత్‌సర్‌లోని సహోవాల్ గ్రామంలో ఇలాంటి ఉమ్మడి ఆపరేషన్‌లో ఐదు హ్యాండ్ గ్రెనేడ్‌లు, 4.50 కిలోల ఆర్‌డిఎక్స్, నాలుగు పిస్టళ్లు, 220 రౌండ్లు, రెండు రిమోట్ కంట్రోల్‌లు, బ్యాటరీ ఛార్జర్ స్వాధీనం చేసుకున్నారు.



## బంగ్లా బోర్డర్ వెంబడి
# నిరంతర పహారా
### మరింత భద్రతాకార్యాచరణ పెంచిన కేంద్రం

**న్యూఢిల్లీ, మే 1:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో మరిన్ని అలజడులు సృష్టించేందుకు పాకిస్థాన్ ప్రయత్నించే అవకాశాలున్నాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆక్రమంలో పొరుగునున్న బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దుల వద్ద సైతం భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సైనిక అధికారులను నిఘా వర్గాలు అప్రమత్తం చేశాయి. బంగ్లాదేశ్‌లో కొలువు తీరిన మహ్మద్ యూనస్ సర్కార్ పాకిస్థాన్‌తో స్నేహ సంబంధాలను కొనసాగిస్తోంది. అదీకాక బంగ్లాదేశ్‌లోని తీవ్రవాద వర్గాలతో సంబంధాలు బలోపేతం చేసుకొనేందుకు పాకిస్థాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని స్పష్టం చేశాయి. దీంతో బంగ్లాదేశ్‌ను స్థావరంగా చేసుకొని ఈతీవ్రవాద గ్రూప్‌ల ద్వారా భారత్‌లో అలజడులు రేపే అవకాశ ముందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ సరిహద్దు ప్రాంతంలో గస్తీని మరింతపెంచాలని సైనిక అధికారులను నిఘా వర్గాలు సూచించాయి. అదీకాక భారత్‌లో వక్ఫ్ సవరణ బిల్లు ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందింది. సదరు బిల్లు ఆమోదాన్ని పొందడాన్ని వ్యతిరే కిస్తూ.. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు.. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పలు హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ముగ్గురు మరణించగా.. వందలాది మంది తీవ్రంగాగాయపడ్డారు. మర్షిదాబాద్ జిల్లాలో ఈ హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడానికి బంగ్లాదేశ్‌లోని దుండగులుకారణమంటూ కేంద్రానికి నిఘా వర్గాలు ఇప్పటికే నివేదిక అందించింది. ఇదే విషయాన్ని ఆర్మీ అధికారులకు నిఘా వర్గాలు తాజాగా వివరిం చాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో మళ్లీ అలజ డులు జరిగే అవకాశముందని అభిప్రాయం వ్యక్త మవుతోంది. దీంతో బంగ్లాదేశ్, మయన్మార్ దేశా లతో సరిహద్దులుగా ఉన్న భారత్ భూభాగంగా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అంతేకాకుండా దాడికిముందు మిలిటెంట్లలో ఒకరితో బంగ్లాదేశ్ కేర్‌టేకర్ ప్రధాని మహ్మద్ యూనస్‌మాట్లాడారన్న వార్తలు గుప్పుమన్నాయి. ఈపరిణామాల నేపథ్యంలో ఇపుడు బంగ్లాదేశ్ భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతోంది. అటుచైనా, ఇటు పాకిస్థాన్‌లు బంగ్లాకు చేరు వయ్యేందుకు తహతహలాడుతున్న క్రమంలో భారత్ సరిహద్దు మొత్తం గస్తీని, భద్రతను మరింతపెంచాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



## పహాల్గాంలో మళ్లీ పర్యాటకుల సందడి

**శ్రీనగర్, మే 1:** జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో గల మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్ర దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ముష్కరులు సృష్టించిన నరమేధంలో 26 మంది బలయ్యారు. అయితే, ఈ దాడి తర్వాత జనం ఆ ప్లేస్‌కు వెళ్లేందుకు కాస్త వెనకడుగు వేసినప్పటికీ.. మళ్లీ పెహల్‌గామ్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతానికి పర్యాటకులు క్యూ కడుతున్నారు. దాడి అనంతరం రెండు మూడు రోజులు నిర్మానుష్యంగా మారిపోయినపెహల్‌గామ్ ప్రాంతం.. ప్రస్తుతం టూరిస్టులతో కళకళలాడుతోంది. వేసవిలో కశ్మీర్ అందాలను ఆస్వాదించేందుకు టూరిస్టులు మళ్లీ పహల్‌గామ్ బాటపడుతున్నారు. అక్కడ అందమైన ప్రదేశాల్లో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. ఫ్యామిలీతో కలిసి వ్యాలీని చుట్టేస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

మరోవైపు కశ్మీర్ లోయలో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో జమ్ము కశ్మీర్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను మూసివేసింది. లోయలో మొత్తం 87 పర్యాటక ప్రాంతాలుండగా.. అందులో 48 ప్రాంతాలను మూసివేసింది. ఆ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో భద్రత కల్పించిన తర్వాతే వాటిని తిరిగి ఓపెన్ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టూరిస్ట్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## అక్కను ప్రేమిస్తున్నాడని తమ్ముళ్ల ఘాతుకం

**న్యూఢిల్లీ, మే 1:** తమ అక్కను ప్రేమిస్తున్నాడన్న కోపంతో ఇద్దరు మైనర్లు దారుణానికి ఒడిగట్టారు. వార్నింగ్ ఇచ్చినా వినకపోవడంతో అక్క ప్రియుడ్ని చంపడానికి సిద్దమయ్యారు. స్నేహితుడితో కలిసి ప్లాన్ వేశారు. అక్క ప్రియుడ్ని దొరకబుచ్చుకుని నడిరోడ్డుపై కత్తులతో దాడి చేశారు. ఇష్టం వచ్చినట్లు పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఈ సంఘటన ఢిల్లీలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే ఢిల్లీకి చెందిన లావిష్ తన కటుంబంతో కలిసి రానా పార్క్‌లోని లిబాస్‌పూర్‌లో ఉంటున్నారు. లావిష్ బదార్‌పూర్‌కు చెందిన ఓ బిల్డర్ దగ్గర పని చేస్తున్నాడు. షాలీమార్ భాగ్‌లోని లయన్ బ్లడ్ సెంటర్‌లో పని చేస్తున్న ఓ యువతితో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ ప్రేమ విషయం యువతి ఇద్దరు తమ్ముళ్లకు తెలిసింది. వారు ఈ ప్రేమను వ్యతిరేకించారు. తమ అక్కకు దూరంగా ఉండాలంటూ గతంలో కొన్నిసార్లు లావిష్‌కు వార్నింగ్ ఇచ్చారు. అయితే, లావిష్‌మాత్రం వారి వార్నింగ్ పట్టించుకోలేదు. దీంతో అతడ్ని చంపాలని నిశ్చయించుకున్నారు. మరో మిత్రుడి సాయం తీసుకున్నారు. మంగళవారం నాలుగు గంటల సమయంలో అతడిపై దాడికి తెగబడ్డారు. పట్ట పగలు నడిరోడ్డుపై అతడ్ని కత్తులతో పొడిచారు. లావీష్‌కు వారి నుంచి తప్పించుకోవడానికి పరుగులు పెట్టాడు. ఒంటి నిండా గాయాలతో ఉన్న అతడ్ని చూసిన పాదచారులు.. వెంటనే దగ్గరలోని బాబా సాహెబ్ అంబేద్కర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# భారత్‌లోని పాకిస్తానీలకు కేంద్రం గుడ్‌న్యూస్!



**న్యూఢిల్లీ, మే 1:** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌లోని పాకిస్థానీయులంతా స్వదేశానికి వెళ్లిపోవాలంటూ కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 30వ తేదీ లోపు వారంతా భారత్ విడిచి వెళ్లాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అయితే ఈ ఆదేశాలపై భారత్ కాస్తా వెనక్కి తగ్గింది. ఆ క్రమంలో పాకిస్థానీయులు దేశం విడిచి వెళ్లాలంటూ జారీ చేసిన ఆదేశాలను కేంద్రం గురువారం కొంతమేర సవరించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు.. వాఘా అట్టారీ సరిహద్దు నుంచి పాకిస్థానీలు స్వదేశానికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులోభాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. సరిహద్దులోని అట్టారీ, వాఘా సరిహద్దును సైతం మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీలు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. అందుకు ఏప్రిల్ 30వ తేదీ తుది గడువుగా నిర్ణయించింది. ఇక న్యూఢిల్లీలోని పాక్ రాయబారిని సైతం భారత్ వీడి వెళ్లాలని స్పష్టంచేసింది. అందుకు వారం రోజులు గడువు విధించింది. దీంతో చాలా వరకు భారత్‌లోని పాకిస్థానీలు దేశం వీడి స్వదేశానికి పయనమయ్యారు. అలాగే వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థానీల ఆచూకీ కనుగొని వారి వివరాలను సైతం కేంద్రానికి ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దేశంలోని సీఎంలకు ఫోన్ చేసి మరి స్పష్టం చేశారు.

# భారత్‌తో యుద్ధమంటే పాక్‌కు వణుకే



## 1993లో సిఐఎ పత్రం

**న్యూఢిల్లీ, మే 1:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో భారత్ 36 గంటల్లో తమపై దాడి చేస్తుందని పాకిస్థాన్ సమాచార మంత్రి అలావుల్లా తరార్ పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ పరిస్థితుల్లో 1993లో భారత్–పాక్ సంబంధాలపై అమెరికా నిఘా సంస్థ ఓ రహస్య అంచనాలు ప్రచురించింది. ఇస్లామాబాద్‌కు న్యూఢిల్లీ అంటే లోలోపల ఉన్న భయాలను దీనిలో వెల్లడించింది. నేషనల్ ఇంటెలిజెన్స్ ఎస్టిమేట్ (ఎన్ఐఇ) ఇరు దేశాల సంబంధాలను పరిశీలించి ఈ పత్రాన్ని తయారుచేసింది. ఒకవేళ యుద్ధం మొదలైతే.. దానికి కశ్మీర్ కారణం ఉంటుందని అంచనా వేసింది. పాకిస్థాన్ ఆ సమయంలో కచ్చితంగా వెనుకంజ వేస్తుందని తెలిపింది.

**1993 అంచనాలు ఇవి..**

నాడు ఎన్ఐఇ సిఐఎకు పనిచేసే బ్రూస్ రీడెల్ నేతృత్వంలో పత్రాన్ని సిద్ధం చేశారు. నాటికి భారత్‌లో బాబ్రీ మసీద్ ఘటన చోటుచేసుకోగా.. పాక్ అంతర్గత కలహాలతో సతమతమవుతోంది. అణ్వాయుధాల విషయం ఇంకా బాహ్య ప్రపంచానికి తెలియలేదు. నాడు సిఐఎ అంచనా ప్రకారం ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరగడానికి 20 శాతం అవకాశం ఉంది. దీనికి తప్పుడు అంచనాలు, కవ్వింపు చర్యలు, ప్రతిచర్య, పెద్ద ఉగ్రదాడి, సైనిక విన్యాసాలపై అపోహలు, హఠాత్తుగా చెలరేగే మత విద్వేషాలు వంటివి కాణం కావచ్చని పేర్కొంది.

ఇక ఇటు భారత్ కానీ అటు పాకిస్థాన్ కానీ యుద్ధం కోరుకోవడం లేదని ఆ పత్రం వెల్లడించింది. కానీ, భారత్ ఎదుగుదలను చూసి పాక్ నిర్ఘాంతపోయి.. కశ్మీర్‌లో వేర్పాటువాద శక్తులతో చేతులు కలపడం, ఉగ్రవాదులతో జట్టు కట్టడం వంటివి చేసే అవకాశం ఉందని వెల్లడించింది. కశ్మీర్‌ను వేరు చేసేందుకు సాయుధ ఉగ్రమూకలకు శిక్షణ, ఆయుధాలు సమకూర్చడం వంటివి చేస్తుందని పేర్కొంది.

**పాక్ వ్యూహాత్మక భయం..**

అప్పటికే ఆధిపత్యం భారత్‌వైపు మొగ్గిందని పేర్కొంది. ఆర్థికంగా, సైనిక పరంగా, దౌత్యపరంగా న్యూఢిల్లీ వేగంగా ఎదుగుతోందని అభివర్ణించింది. ఇరు దేశాల మధ్య ఆ అంతరాన్ని పాక్ అందుకోలేదని వెల్లడించింది. ఆ సమయంలో భారత్‌కు కేవలం అంతర్గత సమస్యలు, ఆర్థిక వృద్ధి సవాలుగా ఉంది. నాడు పివి నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రి ఉన్నారు. ఇక పాకిస్థాన్ మాత్రం సైనిక పాలన, రాజకీయ అస్థిరత, ఆర్థిక పతనం మధ్య ఊగిసలాడుతోంది. ఆ దేశంలో భయంతోనే.. కశ్మీర్‌లో విద్వేషాలను మరింత ఎగదోసింది. ఇక ఈపత్రం కేవలం సిఐఎ మాత్రమే విశ్లేషించకుండా శ్వేతసౌధం, విదేశాంగ శాఖకు బ్రీఫింగ్ ఇచ్చేందుకు వినియోగిస్తారు. బిల్ క్లింటన్ హయాం నుంచి దక్షిణాసియాకు ప్రాధాన్యం పెరిగింది.

# రాణా నమూనాలు సేకరణకు కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ, మే 1:** ముంబయి ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణా వాయిస్, చేతిరాత నమూనాలను సేకరించేందుకు దిల్లీ కోర్టు అనుమతి ఇచ్చింది. నమూనాలను సేకరించాలని బుధవారం ఎన్ఐఏ అభ్యర్థించగా, ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ఈ మేరకు ఆమోదం తెలిపారు. ఇక సోమవారమే రాణా ఎన్ఐఏ కస్టడీని దిల్లీ కోర్టు పొడిగించింది. ఇదివరకు విధించిన 18రోజుల కస్టడీ గడువు ముగియడం వల్ల రాణాను కోర్టు ముందు హాజరుపర్చారు. ఈ క్రమంలోనే ప్రత్యేక కోర్టు మరో 12 రోజులపాటు కస్టడీకి పొడిగించింది. ఇక ఎన్ఐఏ కస్టడీలో ఉన్న రాణాను ఇటీవల ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారించగా, తప్పించుకునే విధంగా సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. విచారణకు ఏ మాత్రం సహకరించలేదని సమాచారం. 26/11 ముంబయి ఉగ్రదాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో రాణా వెల్లడించినట్లు తెలుస్తోంది. ఇక తహవ్వుర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. ముంబయి దాడులకు ముందు ఆకుట్రకు మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబయిలో రెక్కీ నిర్వహించాడు. అతడికి తహవూర్ రాణా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. 15ఏళ్ల క్రితం ట్రావెల్ ఏజెన్సీ నిర్వహి స్తున్నపుడు అతడికి హెడ్లీ పరిచయమయ్యాడు. ముంబయిలో ఉగ్రదాడులకు అవసరమైన బ్లూప్రింట్ తయారీలో రాణా హస్తం ఉన్నట్లు తెలియడం వల్ల రాణా, హెడ్లీపై ఉగ్రదాడులు, కుట్ర కేసులు నమోదు చేశారు.

26/11 దాడులు జరిగిన ఏడాది తర్వాత షికాగో ఎఫ్‌బీఐ అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 14 ఏళ్ల పాటు అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని అప్పగింత ప్రక్రియలోభాగంగా భారత్ తీసుకొచ్చారు. అయితే అంతకుముందు విచారణలో పలువు కీలక విషయాలు చెప్పినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆర్మీ వైద్యదళంలో కొంత కాలం పనిచేసి బయటికొచ్చినట్లు, ఆ తర్వాత కూడా లష్కరే ఉగ్రవాదులు, పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సంబంధీకులను కలిసేటప్పుడు ఆర్మీ యూనిఫాంనే రాణా ధరించేవాడని సమాచారం.

## ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు.. జెరూసలెంను అలుముకున్న పొగ

**జెరూసలెం, మే 1:** ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు చెలరేగింది. జెరూసలెం శివారులోని అడవుల్లో మంటలు ఎగసిపడుతున్నాయి. ఆ నగరంలో దట్టమైన పొగ అలముకుంది. దీంతో దేశంలో అత్యవసర పరిస్థితి ఏర్పడింది. 24 గంటల్లో వేలాది మంది స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. దేశ చరిత్రలో అతిపెద్ద అగ్నిప్రమాదాల్లో ఒకటిగా దీనిని అధికారులు అభివర్ణిస్తున్నారు. కార్చిచ్చు కారణంగా 13 మంది గాయపడ్డారు. అయితే ప్రాణనష్టం ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఈ కార్చిచ్చు దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వాతావరణం పొడిగా ఉండటం, బలమైన గాలుల వల్ల ఈ మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ అగ్ని కీలలు జెరూసలెం నగరానికి చేరుకోవచ్చని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. ఇది జాతీయ అత్యవసర పరిస్థితి అని అన్నారు. జెరూసలెంను రక్షించుకోవడం ప్రస్తుత ప్రాధాన్యం అని పిలుపునిచ్చారు. టెల్ అవీవ్, జెరూసలెంను కలిపే రోడ్డును మూసివేశారు. రహదారులు మొత్తం దట్టమైన పొగ కమ్ముకుంది. రోడ్డు మార్గంలో మంటలు చుట్టుముట్టడంతో, పలువురు తమ వాహనాలు విడిచిపెట్టి పెరుగెడుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సహాయక చర్యల కోసం సైన్యం కూడా రంగంలోకి దిగింది. అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు.

## అయోధ్య శిఖరంపై బంగారు కలశం



**అయోధ్య, మే 1:** అయోధ్య రామాలయ శిఖరంపై బంగారు తాపడంతో చేసిన కలశాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. 20 గేజ్ రాగి షీట్‌కు బంగారు పూత వేసి దాన్నే ఆలయ శిఖరంపై ప్రతిష్ఠించనున్నారు. మరోవైపు, ఆలయ మొదటి అంతస్తులోని రామ దర్బార్‌లో బంగారు తలుపును ఏర్పాటు చేయనున్నారు. రామ భక్తులు కోరుకున్నట్లుగానే ఆలయ శిఖరంపై కలశాన్ని ఏర్పాటు చేయబోతున్నామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా తెలిపారు. భక్తుల కల త్వరలో నెరవేరబోతోందని చెప్పారు. కలశంపై బంగారు పూత పూసే పని జరుగుతోందని వెల్లడించారు. ప్రాకార నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. బంగారు తాపడం చేయనున్న కలశం శరవేగంగా రామాలయ నిర్మాణ పనులు మరోవైపు, రామ దర్బార్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. రామ దర్బార్‌లో బంగారు తలుపును త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రామమందిరంలో ఏడు మండపాల నిర్మాణం త్వరలోనే పూర్తికానున్నట్లు వెల్లడించారు. రామ్ దర్బార్‌లోని విగ్రహాలు ఈ నెలలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయ ఈశాన్యంలో శివాలయం నిర్మాణం జరుగుతోంది. నైరుతిలో సూర్యదేవుని ఆలయం నిర్మితమవుతోంది. రామమందిరంలో ఏడు మండపాల నిర్మాణం త్వరలోనే పూర్తికానున్నాయి. అన్ని విగ్రహామూర్తులు ఆలయ సముదాయానికి చేరుకున్నాయి.

### ఖనిజాల ఒప్పందంపై ఎట్టకేలకు
# ఉక్రెయిన్-యుఎస్ సంతకం

**వాషింగ్టన్, మే 1:** ఉక్రెయిన్–అమెరికా మధ్య ఎట్టకేలకు అరుదైనఖనిజాల తవ్వకాల ఒప్పందం కుదరింది. యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్, ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ ప్రధాని యులియా సిర్దెంకో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో ఉక్రెయిన్‌లో అరుదైన సహజ వనరులు అయిన అల్యూమినియం, గ్రాఫైట్, చమురు, సహజవాయువు, ఇతర ఖనిజాలను తవ్వుకునేందుకు అమెరికాకు అనుమతి లభించినట్టయింది.

ఈ ఒప్పందం కుదరడం వల్ల ఉక్రెయిన్‌లో అమెరికా సంయుక్త నిధిని ఏర్పాటు చేయనుంది. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి చేపట్టాల్సి పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో యుఎస్ పెట్టుబడిదారులకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ఒప్పందం కుదరడంపై అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్టు చేసింది. 'ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి కావాల్సిన ఉమ్మడి పెట్టుబడి నిధిని స్థాపించడానికి ఉక్రెయిన్, అమెరికాలు సంతకం చేశాయి. స్వేచ్ఛాయుత, సార్వభౌమ, సంపన్నమైన ఉక్రెయిన్ కోసం ట్రంప్ నిబద్ధతను ఈ చరిత్రాత్మక ఆర్థిక భాగస్వామ్యం సూచిస్తుంది' అని తెలిపింది.

రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు తాము చొరవ తీసుకుంటామని, అందుకు బదులుగా ఉక్రెయిన్‌లో ఖనిజాల తవ్వకానికి తమను అనుమతించాలని యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రతిపాదించిన విషయం విదితమే. ఈ యేడాది ఫిబ్రవరిలోనే ఈ ఒప్పందంపై ఇరు దేశాలుసంతకం చేయాల్సి ఉండగా, ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య మీడియా ముందే మాటల యుద్ధం జరిగింది. దీంతో అప్పటి నుంచి ఇది అలాగే ఉండిపోయింది. అయితే ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు చాలా రోజులుగా తెరవెనుక ప్రయత్నాలు సాగించాయి.

## ఐదు బాటిళ్ల లిక్కర్‌తాగి ప్రాణం తీసుకున్న యువకుడు

**కోలార్, మే 1:** మద్యం ఆరోగ్యానికి హానికరం అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రెగ్యులర్‌గా తాగితే లివర్ డామేజ్ అవ్వడంతో పాటు, హార్ట్ ఫెయిల్ అవుతుందని తెలిసినా కూడా కొంతమంది తాగేవాళ్లు ఉన్నారు. ఇక, స్పీడుగా మద్యం తాగితే ఉన్నపళంగా ప్రాణాలే పోతాయి. అయితే, ఈ విషయం తెలియక కర్నాటకలోని కోలార్ జిల్లా పూజారహళ్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు తన ప్రాణం కోల్పోయాడు. వివరాల్లోకి వెళ్తే.. కార్తీక్ అనే 21 ఏళ్ల యువకుడు నీళ్లు కలపకుండా 5 క్వార్టర్ల మద్యం బాటిల్లు తాగుతానంటూ తన స్నేహితులతో పందెం వేశాడు. ఓడిపోతే తాను రూ. 10 వేలు ఇస్తానని వెంకట రెడ్డి అనే వ్యక్తితో సవాలు కూడా చేసినట్లు తెలుస్తోంది. పందెం కుదరడంతో కార్తీక్ తన దగ్గర ఉన్న డబ్బుతో ఐదు బాటిళ్ల మద్యాన్ని తెచ్చుకున్నాడు. ఒక్క చుక్క నీరు కూడా కలపకుండా ఏకంగా 5 బాటిళ్ల మద్యాన్ని గడగడా తాగేశాడు. ఆ ఆల్కహాల్ అతని శరీరంలోకి చేరడంతో కార్తీక్ ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. వెంటనే అతడిని కోలార్ జిల్లాలోని ముల్బాగల్‌లోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ కార్తీక్ చికిత్స పొందుతూ తన ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంకట రెడ్డి సహా ఆరుగురు వ్యక్తులపై నంగలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# కేంద్రం చేపడుతున్న కులగణన సర్వేను స్వాగతిస్తున్నాం

### నెరవేరనున్న రాహుల్ విజన్

### పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** దేశ జనాభా లెక్కలతోపాటు, కులగణన కూడా చేపట్టాలనే సంచలన నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి, కేబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ మినహా ఇతర కులాలను పరిగణనలోకి తీసుకునేవారు కాదని, ఈ విషయంపై రాహుల్‌గాంధీ ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. దీంతో రాహుల్‌గాంధీ విజన్ నెరవేరబోతోందని అన్నారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన చేశామని ఆయన అన్నారు. ఇది స్వతంత్ర దేశంలోనే మొదటిదని వివరించారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి ఆదర్శం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, కుల సర్వే నిర్వహించడం జరిగిందనిజనాభాలో 56.32 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందినవారని తేలిందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని అసెంబ్లీలో ఆమోదముద్ర వేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద నిరసన తెలియజేశామని గుర్తుచేశారు.

# డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కోసం నేడే దోస్త్ నోటిఫికేషన్

### 3 విడతల్లో ప్రవేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కోసం శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మగాంధీ, శాతవాహన, జేఎన్టీయూహెచ్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, తదితర సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు విడతల్లో ప్రవేశాలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దోస్త్ వెబ్‌సైట్, మొబైల్ యాప్, మీసేవ యాప్, మీసేవ కేంద్రాల ద్వారా ప్రవేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1. ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సిరసవాడ గ్రామానికి చెందిన మంగలి రమేష్ (30) అదే గ్రామంలో తన కులవృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మంగళి రమేష్ తల్లిదండ్రులు గతంలోనే చనిపోవడంతో తన నాయనమ్మ రామలక్ష్మమ్మ దగ్గర ఉంటున్నాడు. గురువారం ఉదయం రమేష్‌ను నిద్ర లేపడానికి వెళ్లి తలుపులు కొట్టగా రమేష్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అతని నాయనమ్మకు ఇంటి గది కిటికీలో నుంచి చూడగా చున్నీతో



మంగళి రమేష్ (ఫైల్)

ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. అది చూసిన నాయనమ్మ తన మనవడు మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపిం చడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన రమేష్ ఒంటిపై రక్తపు మరకలు, గాయాలు ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకునే క్రమంలో తగిలిన గాయాలా లేక వేరే ఏమైనా గాయాలా అనే విషయాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రికి రెండో భార్య కూడా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉండడం వల్ల ఇతని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నానమ్మ రామలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లు

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టివేత

### స్వాధీనం చేసుకున్న అధికారులు

**హైదరాబాద్ (శంషాబాద్) మే 1, ప్రభాతవార్త :** హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం భారీగా బంగారం పట్టుబడింది. డిఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం విలువ మూడు కోట్ల 45 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా. గురువారం తెల్లవారుజాము నదుబాయ్ లోని మస్కట్ నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజ్‌ను చెక్ చేయగా అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టుబడింది. ప్రయాణికుడు తను లగేజ్ బ్యాగ్ లో దాచుకొని తీసుకు వస్తున్న బంగారాన్ని తనిఖీలు భాగంగా అధికారులు గుర్తించారు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మూడున్నర కోట్ల విలువైన బంగారాన్ని డిఆర్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మూడు కిలోల 500 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న అధికారులు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్‌కు 3 రోజులు గడువు పెంపు

### ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్నిమరో 3 రోజులు పొడిగించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ టీకే శ్రీదేవి ఈ మేరకకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు సర్కార్ 25 శాతం డిస్కౌంట్‌తో వన్ టైమ్ సెటిల్మెంట్ (ఎల్ఆర్ఎస్)పథకాన్ని తీసుకొచ్చింది. అయితే, 2020లో అందుకు సంబంధించి మొత్తం 25,67, 107 దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు సుమారు 8 లక్షల అప్లికేషన్లను మాత్రమే అధికారులు క్లియర్ చేశారు. మిగిలిన వాటిని కూడా పరిష్కరించాలని ఉద్దేశంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో 25 శాతం రాయితీతో ప్రభుత్వం వన్టైమ్ సెటిల్మెంట్ను ప్రకటించింది. కానీ, అందుకు లాస్ట్ డేట్ గడువు మార్చి 31న ముగియగా.. దరఖాస్తుదారుల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. ఈ నేపథ్యంలోనే మరో మూడు రోజులు వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని పొడిగిస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

# రెవెన్యూ అవగాహన సదస్సులకు అనూహ్య స్పందన

### 555 మండలాల్లో పూర్తి.. భూ సమస్యలపై 11,630 దరఖాస్తులు స్వీకరణ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక సవాల్‌గా తీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీవరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11, 630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలాలలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలాన్నిపైలట్ గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. మంత్రి పొంగులేటి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పుకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. ఈచట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. ధరణితో వారు అనుభవించిన కష్టాలను, బాధలను వ్యక్తం చేశారు. ధరణి తో వారు ఎదుర్కొన్న సమస్యలను చెప్తుంటే వారు పడ్డ కష్టం కళ్ళముందే కనిపించింది. రైతుల భూ సమస్యలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాం. ఇకనుండి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది.

ఈ నెల 5వ తేది నుంచి రాష్ట్రం లోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఆ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్న సంగతి తెలిసిందే.

# అసోం సిఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### గాంధీభవన్ వద్ద రోడ్డుపై మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు బైఠాయింపు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** దేశంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని తిరస్కరించి మనుధర్మం తో పాలించేందుకు సంఘపరివార్ చేసే కుట్రలో భాగంగా మహిళలను రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకొనేందుకు వారి శీలహానం చేసే దిశగా అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వాస్ అనా గరికంగా వ్యాఖ్యలు చేశారని ఇది సభ్య సమాజానికి



సిగ్గుచేటని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అస్సాం సీఎం హేమంత్ బిస్వాస్ శర్మ అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గురువారం గాంధీ భవన్ వద్ద రోడ్డు మీదబైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో ఆఫీస్ బేరర్ల సమావేశంలో సికిందరాబాద్, ఖైరతాబాద్, రంగారెడ్డి, ఇతర సమీపజిల్లాల నుంచి పెద్దఎత్తున ఆఫీస్ బేరర్లు వచ్చి సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ కాంగ్రెస్‌లో మహిళలు పదవులు కావాలంటే శీలం కోల్పోక తప్పదని చెప్పడం ఆయన స్థాయికి తగది కాదని అన్నారు. మహిళలను అవమాన పరచడమే అని మొగిలి సునిత అన్నారు. సిఎం హేమంత్ బిస్వాశర్మ మాటలు స్త్రీజాతిని అవమాన పరిచేలా ఉందని అన్నారు.

అనాగరికంగా బిస్వాస్‌శర్మ మాట్లాడరని ఇది బిజెపికి మహిళల పట్ల ఉన్న చులకన భావం తెలుపుతోందని అన్నారు. బిజెపి పార్టీ మొత్తంగా ఇదే విధంగా మహిళల పట్ల ఇదే భావంతో ఉందా లేక పోతే వెంటనే ఆయనను సిఎం పదవి నుంచి దించివేయాలని ఆమె డిమాండ్‌చేశారు. అస్సాం సిఎం బేషర్తుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. హేమంత్ బిస్వా ఫోటోకు చెప్పుల దండ ఏర్పాటు చేయాలని సునీత ఇచ్చిన పిలుపు మేరకు పోలీసులు అప్రమత్తమై ఏలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా నిలువరించారు. పోలీసులు నిరసన దిగిన మహిళలను అరెస్ట్ చేసి బండ్లగూడా, కంచంబగ్, చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు. కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు మహిళా కాంగ్రెస్ నేతలు స్పృహ కోల్పోయారు.

# తెలుగులో రాసిన వాళ్లకు మార్కులు ఎలా వేశారు?.. టిజిపిఎస్సీని నిలదీసిన హైకోర్టు

### సబ్జెక్ట్ నిపుణులు మూల్యాంకనం చేసి మార్కులు వేశారన్న టిజిపిఎస్సీ న్యాయవాది

### గ్రూప్1 పిటిషన్లపై హైకోర్టులో నేడు మరోసారి విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** గ్రూప్1 నియామకాలు చేపట్టొద్దంటూ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల వల్ల గ్రూప్1 నియామక ప్రక్రియ ఆలస్యమవుతోందని, దీనివల్ల అర్హులైన అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారని మధ్యంతర పిటిషన్‌లో టీజీపీఎస్సీ పేర్కొంది. మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నా యంటూ గ్రూప్1 అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు టీజీపీఎస్సీ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌పైనా గురువారం కూడా హైకోర్టులో వాదనలు జరిగాయి. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో టీజీపీఎస్సీ అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది రచనారెడ్డి వాదించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఒకే నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ, హాల్ టికెట్లు మాత్రం వేర్వేరుగా జారీ చేశారని కోర్టుకు తెలిపారు. ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు వరుసగా నెంబర్లు కేటాయించడం కోసమే ఈ విధంగా మెయిన్స్ కోసం మరోసారి హాల్‌టికెట్లు జారీ చేశారని వాదించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు ఉల్లంఘించారన్నారు. కోటి మహిళా విశ్వవిద్యాలయంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో కేవలం మహిళా అభ్యర్థులను మాత్రమే కేటాయించారని, అంత కంటే ఆర్నెళ్ల ముందు జరిగిన ప్రిలిమ్స్‌లో పురుష అభ్యర్థులను కేటాయించిన అధికారులు, మెయిన్స్ విషయంలో వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని రచనా రెడ్డి వాదించారు. మెయిన్స్ పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలోనూ గందరగోళం ఏర్పడిందని, అధికారులు తుది మార్కులు ప్రకటించే సమయానికి పది మంది అభ్యర్థులను ఎక్కువగా చూపారని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో పక్కపక్కన లేదా ఒకరి వెనుక మరొకరు కూర్చున్న అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు రావడం అక్రమాలు జరిగాయనడానికి ఊతమిస్తోందన్నారు. మూల్యాంకనంలోనూ నిబంధనలు పాటించలేదన్నారు. దాదాపు రెండున్నర గంటలపాటు రచనా రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు సమయం ముగిసినా సాయంత్రం 6 గంటల వరకు ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పిన అంశాలనే పదే పదే చెబుతున్నారని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది రాజశేఖర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రూప్1పై వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయని అన్నారు. ఒక పిటిషన్ తరఫు న్యాయవాది వినిపించిన వాదనల్ని, మరో పిటిషనర్ తరఫు న్యాయవాది వినిపిస్తున్నారని టీజీపీఎస్సీ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒకే అంశంపై పదే పదే వాదించకుండా ఇతర అంశాలేవైనా ఉంటే వాదించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఇదే కేసులో బుధవారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ, తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా తమిళంలోనే మాట్లాడతారని, ఇక్కడ మాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారని అన్నారు. ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్-1 పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ఇక్కడ ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలని అన్నారు. మెయిన్స్ మూల్యాంకంలో అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరణ ఇవ్వాలని టీజీపీఎస్సీని ఆదేశించారు

# హైదరాబాద్‌లో టమాటా ఫైట్

### 11న అంతర్జాతీయ ఫెస్టివల్

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** తెలంగాణలో మరో అంతర్జాతీయ ఫెస్టివల్ జరగబోతోంది. ఇందుకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వేదిక కానుంది. హైదరాబాద్ నగరంలో మొట్ట మొదటి సారిగా టమాటా ఫైట్ ఫెస్టివల్ నిర్వహించబోతున్నారు. ఈ ఉత్సవం స్పెయిన్లోని ప్రసిద్ధ లా టమాటినా నుండి స్ఫూర్తి పొందింది. ఈ ఈవెంట్ ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటల నుండి



ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో జరుగుతుంది. ఇక్కడ పాల్గొనేవారు వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుతూ ఆనందిస్తారు. ఒకరినొకరు టమాటాలతో కొట్టుకుంటూ సందడి చేయనున్నారు. ఇందుకు గాను ఇప్పటికే 1,000 కేజీల వరకూ టమాటాలను సిద్ధం చేశారు. అంతేకాకుండా ఈ టమాటా ఫైట్ ఫెస్టివల్‌లో లైవ్ డీజే సంగీతం, క్రేజీ ఫన్ జోన్, నృత్య ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్, షాపింగ్ కోసం ఫ్లీ మార్కెట్, ఫన్ జోన్స్ కూడా ఉంటాయి. రుచికరమైన వంటలతో పలు రకాలకు సంబంధించిన ఫుడ్‌ను కూడా తినేందుకు అవసరమైన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అయితే టికెట్ల ధరలు 499 రూపాయల నుండి 3,499 రూపాయల వరకు ఉండనున్నాయని నిర్వహకులు తెలియ జేశారు. ఈ ఫెస్టివల్‌లో ఉపయోగించిన టమాటాలను వృథా కాకుండా ఎరువుగా రీసైకిల్ చేసి, రైతులకు అందించనున్నారు. కాగా ఎండలతో అల్లాడుతున్న హైదరాబాదీలకు ఈ ఉత్సవం ఒక సరికొత్త సరదా అనుభవాన్ని అందించనుంది.

# పనులే ప్రామాణికంగా ముందుకు సాగండి

### ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ షానవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ఎన్‌ఫోర్స్‌మెంట్ పని తీరు.. ప్రజలకు ప్రామాణికంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ఐపీఎస్ షానవాజ్ ఖాసిం అన్నారు. గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం తన చాంబర్‌లో పదవీ బాధ్యతలను చేపట్టారు. అబ్కారీ భవన్‌కు తొలిసారిగా డైరెక్టర్‌గా వచ్చిన డైరెక్టర్ షానవాజ్ ఖాసిం కు ఇంచార్జ్ అడిషనల్ కమిషనర్, జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి జాయింట్ కమిషనర్ కేఏబీ శాస్త్రీ, నాలుగురు ఎస్ టి ఎఫ్ టీమ్‌లు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. షానవాజ్ ఖాసిం గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ పదవి పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. తెలంగాణను "డ్రగ్ ఫ్రీ" రాష్ట్రంగా మార్చడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకోట్రాపిక్ పదార్థాలకు వ్యతిరేకంగా ప్రస్తుతం కొనసాగుతున్న డ్రైవ్ కొనసాగించాలన్నారు. శాస్త్రీయ దర్యాప్తు విధానాలను అనుసరించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. శిక్షా రేటును పెంచి, నేరస్థులలో భయాన్ని కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా స్వేదనం చేసిన మద్యం (గుడుంబా) నేరాలు రాష్ట్రంలోని కొన్నిచోట్ల కొనసాగుతున్నాయి. వాటిని నిర్మూలించడంపై దృష్టి పెట్టాలన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) ప్రభుత్వ ఆదాయాన్ని ప్రత్యక్షంగా గండి కొడుతుందిని, కొన్నిసార్లు ఇలాంటి మద్యం ప్రజారోగ్య సమస్యలకు కూడా దారి తీయవచ్చు అన్నారు. ఇన్‌ఫ్లోను పూర్తిగా కట్టడి చేయడం, రాష్ట్రంలో దాని రవాణా మరియు అమ్మకాల కట్టడికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు కెటిఆర్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరు కానున్నారు. 2025 జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ప్రొఫెసర్లు, వివిధ దేశాల నిపుణులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇండియా సాధిస్తున్న ప్రగతిని కేటీఆర్ వివరించనున్నారు. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠి తెలిపారు. కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచంపై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటొచ్చని సిద్ధార్థ్ సేఠి తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి.

# మిరుదొడ్డి పోలీసుస్టేషన్‌లో ఎసిబి అధికారుల దాడులు

### ముగ్గురు మధ్యవర్తుల నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం.. కేసు నమోదు

**మిరుదొడ్డి, మే 1, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీసు స్టేషన్‌లో ఎసిబి అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. సోదాలలో పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సంతోష్‌కుమార్‌ను విచారణ చేసి ముగ్గురు మధ్యవర్తుల ద్వారా రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకొని సంతోష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎసిబి అధికారి సుదర్శన్ విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజగామ రాజు అనే వ్యక్తి బైక్ యాక్సిడెంట్ ఘటనలో బైక్ పూర్తిగా డ్యామేజ్ కాగా సదరు బైక్‌ను ఢీ కొట్టిన హైదారాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి బైక్ యాక్సిడెంట్ కేసును సెటిల్మెంట్ చేస్తానని రూ.10 వేల లంచం హోంగార్డు సంతోష్ కుమార్ డిమాండ్ చేసినట్లు తెలిపారు. సంతోష్‌కుమార్ సూచన



హోంగార్డు సంతోష్ నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్న దృశ్యం

మేరకు సదరు వ్యక్తి మండల కేంద్రంలోని రేణుక హోటల్ యజ మాని చెన్నై శేఖర్‌కు రూ.2 వేలు, దుర్గ భవాని వైన్స్‌లో పని చేస్తున్న కార్మికుడు నెరెళ్ల రాజుకు రూ. 3 వేలు, మరో వ్యక్తికి రూ.2 వేలు అందజేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు నమ్మదగిన సమాచారంతో మిరుదొడ్డి పోలీసు స్టేషన్‌లో దాడులు నిర్వహించి హోంగార్డు సంతోష్‌కుమార్‌ను విచారణ చేసి ముగ్గురు మధ్యవర్తుల నుంచి రూ.7 వేలతోపాటు మొత్తం రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ కుమార్‌పై కేసు నమోదు చేసి హైదారాబాద్ నాంపల్లి ఎసిబి కోర్టు న్యాయ మూర్తి ముందు హాజరు పర్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నంబరు 1064కు కాల్ చేయాలన్నారు.

# సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీటిలో మునక

**కొల్లాపూర్, మే 1. ప్రభాతవార్త :** ఈత సరదా రెండు కుటుంబాల్లో విషాదం నింపిన సంఘటన వివరాలు నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ఉండే పోతినేని చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ముగ్గురు చిన్నారులు చెరువులో ఈతకు వెళ్ళి గల్లంతైన సమాచారం అందుకున్న అధికారులు చెరువు దగ్గరకు చేరుకుని స్థానికుల సహాయంతో ముగ్గురు చిన్నారుల మృతదేహాలు వెలికితీశారు. మృతి చెందిన చిన్నారులు గణేష్ రెడ్డి (13) రక్షిత (10)లు ఒకే కుటుంబానికి చెందిన అన్న, చెల్లెలు, ధర్మారెడ్డి పిల్లలు కాగా, వారి తల్లి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. కాగా, శ్రావణ్ (7) మరొక కుటుంబానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. చిన్నారుల మృతదేహాలు చూసిన తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరుగా విలపించారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి బిసి మంత్రులు, నేతల అభినందనల వెల్లువ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. దేశంలో నిర్వహించే జనాభా లెక్కల్లో భాగంగా కుల గణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పలువురు మంత్రులు, సలహాదారులు, ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు సిఎంను కలిసి అభినందనలు తెలియజేశారు. చట్ట పరమైన ఎలాంటి చిక్కులు ఎదురుకాకుండా శాస్త్రీయ పద్ధతిలో దేశంలో కుల గణన పూర్తి చేసిన ఘనత తెలంగాణకు దక్కుతుందని, ఇది దేశానికి రోల్ మాడల్‌గా ఉంటుందని వారు ముఖ్యమంత్రితో అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, మాజీ ఎంపీలు విహెచ్ హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మధుయాష్కీతో పాటు పలువురు ఎంపీలు, కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు, ప్రతినిధులు పెద్దఎత్తున జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. తెలంగాణలో విజయవంతంగా కుల గణన పూర్తి చేసిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయానికి రావడం సంతోషకరమైన పరిణామంగా వారు పేర్కొన్నారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులుతో కలిసి జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన ఉద్యమానికి అండగా నిలబడ్డ సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి అభినందించారు. కులగణన ప్రారంభించి. వివరాలు సేకరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కులగణన చేస్తామన్న మోడీకి, చేయాలని డిమాండ్ చేసిన రాహుల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణలో చేసిన 42శాతం రిజర్వేషన్ల బిల్లును అమలు చేయాలని అఖిలపక్షంలో ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సిఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఈనెల 6న దేశ వ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని, బీసీ కులగణన కోసం సహకరించిన అఖిలపక్ష నేతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మే 2వ వారంలో ఢిల్లీలో అఖిలపక్ష పార్టీలు, మేధావులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. మే 3వ వారంలో కులగణనకు మద్దతుగా నిలబడిన పార్టీలను, కులగణన చేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామన్నారు.

## ఆర్‌టిసి కార్మికులకు మంత్రి పొన్నం మేడే శుభాకాంక్షలు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ప్రజా పాలన ప్రభుత్వం లో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచే విధంగా శ్రమపడుతున్న డ్రైవర్లకు కండక్టర్లకు శ్రామికులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## ఎంపి ఈటలపై కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

### సెక్యూరిటీ గార్డుపై దాడి చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** నాయకుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. తనపై నమోదైన ఒక క్రిమినల్ కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల ప్రాంతంలోని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఒక సెక్యూరిటీ గార్డుపై ఈటల రాజేందర్ చేయి చేసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఘటనకు సంబంధించి బాధితుడైన సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు గతంలో ఈటలపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఈటల రాజేందర్ ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు.

ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, వాటి ఆధారంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అందువల్ల, ప్రస్తుత దశలో కేసును కొట్టివేయడం సముచితం కాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమర్పించిన వాదనలతో ఏకీభవించింది. ఈటల రాజేందర్‌పై నమోదైన కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను సంబంధిత దిగువ కోర్టులోనే ఎదుర్కోవాలని ఈటల రాజేందర్‌కు సూచిస్తూ, ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

# కాల్పుల విరమణపై శాంతి మంత్రం

### సిఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరిన పౌర హక్కుల సంఘాల నేతలు వినతి

### ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలన్న మంత్రి సీతక్క

### భద్రత బలగాలకు చిక్కని మావోయిస్టుల జాడ

**ములుగు జిల్లా క్రైమ్ (వెంకటాపురం), ప్రభాతవార్త:** నిషేధిత మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పచ్చని అడవులలో నేల రాలిన ఎండిన ఆకుల సాక్షిగా సుమారు పాతికవేల మంది బలగాల బూట్ల చప్పులతో క్రరిగుట్టల ప్రాంతం భయం గొల్పుతోంది. ఆపరేషన్ కగార్‌తో క్రరిగుట్టలపై మువ్వన్నెల జెండా రెపరెపలాడించి మావోయిస్టుల ఇలాకాలో పట్టు సాధించామని ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వ కనుసన్నలలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై పౌర హక్కుల సంఘాలు, ప్రజా సంఘాల నుండి తీవ్రవ్యతిరేకత వస్తోంది. ఈ ఘటన రాజకీయంగా కూడా ప్రకంపనలు రేగేలా కనబడుతోంది. తొమ్మిది రోజులుగా క్రరిగుట్టను జల్లెడ పట్టిన భద్రతా బలగాలకు మావోయిస్టులు చిక్కలేదు. వారి కొరకు భద్రతా బలగాలు సాగిస్తున్న వేటపై పౌర హక్కుల సంఘాలు ముఖ్యమంత్రిని సైతం కలిశాయి. ములుగు జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని సరిహద్దుల్లో ఉన్న క్రరిగుట్ట కేంద్రంగా జరుగుతున్న సాయుధ బలగాల కనుసన్నలలో సాగుతున్న నరమేధానికి అంకురార్పణ పలికిన తెలంగాణ పోలీసులు కాల్పుల విరమణ స్వచ్ఛందంగా పాటించేలా ఆదేశాలు చేయాలని పౌర హక్కుల సంఘాలు ముఖ్యమంత్రికి విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జరుగుతున్న వరుస ఎదురుకాల్పుల పరిణామాలపై తెలంగాణలోని ప్రజాస్వామిక శక్తులు వరుసగా స్పందించాయి. ఇందులో భాగంగానే నక్సలైట్లతో శాంతిచర్చలు జరపాలని కోరుతూ పీస్ డైలాగ్ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ వివిధ పార్టీలతో, ముఖ్యులతో కలుస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలన్న మంత్రి సీతక్క చేసిన ప్రకటనతో.. ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే కాల్పుల విరమణ ప్రకటన చేయాలనే డిమాండ్ ప్రజాసంఘాల నుండి వినబడుతుంది. మంత్రి సీతక్క ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రస్తావించి, సమస్య తీవ్రతను వివరించి, కాల్పుల విరమణకు సంబంధించిన అవకాశాలు మెరుగుపరచాలని పౌర హక్కుల సంఘాల నేతలు కోరుతున్నారు.

**అలసిన భద్రతా బలగాలు?**

25వేల మందికిపైగా క్రరిగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాలు ఎండ వేడిమి, వడగాల్పులకు నీరసించి పోయినట్టు తెలుస్తోంది. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలి. మంత్రి సీతక్క..ఆపరేషన్ కగార్ ను తక్షణం నిలిపివేయాలని, ఆదివాసీల ప్రయోజనాల దృష్టిలో ఉంచుకుని ఆమె డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. తెలంగాణ, ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆమె ఆకాంక్షించారు. మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని, అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కు లుంటాయని, ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయన్నారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని, బలప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నట్లు సీతక్క ఒక

## 12 నుంచి మరో 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఈనెల 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత నెల 10వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని 30వ తేదీ నాటికి 22 కార్యాలయాల్లో సగటున 866 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. గురువారం సచివాలయంలోని తమ కార్యాలయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ విభాగంపై సుదీర్ఘంగా మంత్రి సమీక్షించారు. రెండవ దశలో రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ , షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, షేర్ లింగంపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, అదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, పెద్దపల్లి, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల్, గజ్వేల్ మెదక్ జిల్లాలో సిద్దిపేట అర్బన్ రూరల్, రంగారెడ్డి వరంగల్ హైదరాబాద్, హైదరాబాద్ సౌత్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లలో అమలు చేస్తామని తెలిపారు. 22 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను అధికారులను అడిగి తెలుసుకున్నారు స్లాట్ బుకింగ్ విధానం అమలు అవుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి పోస్ట్ కార్డుద్వారా అభిప్రాయాలను సేకరించగా 94శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు మంత్రికి ఈ సందర్భంగా వివరించారు. పోస్టు కార్డులో ఉన్న ఫోన్ నెంబర్‌తో చంపాపేట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విష్ణుగౌడ్ అనే వ్యక్తితో మంత్రిగారు స్వయంగా ఫోన్‌లో మాట్లాడి స్పందన తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్‌కు అవసరమైన ఇంటర్నెట్ స్పీడ్‌ను పెంచుకోవాలని సూచించారు.



వచ్చే నెల 3వ వారం నాటికి రాష్ట్రం లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేయడానికి ఆధార్ ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని వీలైనంత త్వరితగతిన అమలులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. స్లాట్‌బుకింగ్ విధానం విజయ వంతం కావడంలో అధికారుల పాత్ర ప్రశంస నీయం. ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదేవిధంగా పనిచేసి స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంచిపేరు తీసుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అధికారులు ఏ పనిచేసినా ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించడమే లక్ష్యంగా ఉండాలని అభిలషించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్, సిసిఎల్ఎ సెక్రటరీ మకరంద్, మీసేవ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్‌ను కలిసిన ట్రెసా

**హైదరాబాద్, మే1,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావును ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రెసా ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా రెవిన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు ముఖ్యంగా ఎన్నికల సమయంలో బదిలీ అయిన త హశీల్దార్లను తిరిగి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దానికి వారు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ట్రెసా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్ రావు, కార్యదర్శి వాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హింసకు మేం వ్యతిరేకం.. ఎంత పెద్దసమస్యలైనా చర్చలే అంతిమ పరిష్కారం

### శాంతిచర్చలపై సిఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** మావోయిస్టులతో శాంతి చర్చలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము హింసకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. లోకంలో ఎంత పెద్ద సమస్యకైనా చర్చలే అంతిమ పరిష్కారమని పేర్కొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు చేయాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే అధిష్టానంతో చర్చించాకే తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని చెప్పారు. కాగా, మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి కాల్పుల విరమణ ఒప్పందం పాటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రయత్నించాలని జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలోని శాంతి చర్చల కమిటీ ఏప్రిల్ 27న సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సంగతి తెలిసిందే.

## ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను పరిష్కరించండి

### డిప్యూటీ సిఎం భట్టితో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య భేటీ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు ఎంతో కాలంగా మెడికల్, సరెండర్ పెండింగ్ బిల్స్ రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఈ మొత్తాలను ఇప్పించాలని శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. గురువారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిసి పెండింగ్ సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను సైతం వెంటనే మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పిఆర్‌సి నివేదికను వెంటనే బహిర్గత పరుస్తూ, ప్రభుత్వం ఇచ్చిన దానికంటే మెరుగైన ఫిట్‌మెంట్‌తో పిఆర్సి అమలు చేయాలని, గత సంవత్సరం సిపిక్స్ సర్వే విజయవంతంగా నిర్వహించిన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తక్షణం రెమ్యూనరేషన్ అందించాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సానుకూల నిర్ణయాలను తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## సన్నబియ్యం తరుగుతో డీలరు డీలా

### బ్యాగుకు రెండు కిలోల తరుగు భరించాలి

### రాష్ట్రవ్యాప్తంగా 17,256 రేషన్ డీలర్ల పరేషాన్

**హైదరాబాద్, మే 1,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం ఇస్తుండటంతో తరుగు డీలరును డీలా పరుస్తోన్నది. బియ్యం సరఫరా సమయంలో దాదాపు ప్రతీ బస్తాలో తరుగు వస్తోంది. క్వింటాళ్‌కు డీలరుకు ఇచ్చే రూ.140 కమీషన్ పోను అదనంగా డీలరు తరుగు కింద ఎదురు చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తెలంగాణలో ఏప్రిల్ 1నుంచి మూడు కోట్ల పదిలక్షల మంది లబ్దిదారులకు సన్నబియ్యంను పౌరసరఫరాల పథకం ఇంద చౌకధరల దుకాణం నుంచి సరఫరా చేస్తున్నారు. పౌరసరఫరాలశాఖ సరఫరా చేసే 50కిలోల బియ్యం బస్తాలో రెండు కిలోల తరుగు డీలరును తీవ్రంగా కలిచివేస్తున్నది. గతంలో దొడ్డుబియ్యం సరఫరా చేయడంతో చాలా మంది వాటిని తీసుకోకపోవడంతో డీలర్లు బస్తాకు రెండు కిలోల తరుగును పెద్ద నష్టంగా భావించపోయేది. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో పేద మధ్యతరగతి ప్రజలు వచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇదీ రేషన్ డీలర్లకు ఇబ్బందిగా మారింది.

రాష్ట్రంలో 17256 రేషన్ షాపులకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి షరమామూలుగానే రెండు కిలోల తరుగుతో బియ్యం బస్తాను డీలర్‌కు వస్తుండటంతో ఒకింత ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలస్థాయి గిడ్డంగుల నుంచి వచ్చే బియ్యం బస్తాల్లో ఉంటున్న తరుగే దీనికి ప్రధాన కారణం. ఇదివరకైతే దొడ్డు బియ్యం విషయంలో ఇది అంతగా ఇబ్బంది పెట్టకపోయినా.. ఇప్పుడు సన్నబియ్యం కారణంగా "తరుగు"సమస్యాత్మకంగా మారిందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ రేషన్ షాపుకు సరఫరా చేసే బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటాయి. ఇందులో గోనె సంచి బరువును జతచేసి 50.580 కిలోల చొప్పున బియ్యం ఉండేలా తూకం వేసి డీలరుకు సరఫరా చేయాలి.

కానీ, ఒకటి, రెండు కిలోల చొప్పున కోత విధిస్తూ సంచులను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో స్టేజి-1, స్టేజీ-2 గిడ్డంగుల నుంచే ఈ విధంగా తరుగుతో బియ్యం రావడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు సన్నబియ్యం విషయంలో కూడా అదే తంతును కొనసాగిస్తుండటంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మండలస్థాయి గిడ్డంగులున్న చోట వే బ్రిడ్జిలు అందుబాటులో లేకపోవడం కలిసొస్తోందన్న వాదనలు లేకపోలేదు.

ఎలక్ట్రానిక్ కాంటాలపై తూకం వేసి సరఫరా చేయాల్సి ఉన్నా దాన్ని విస్మరిస్తున్నారని. బయట వేబ్రిడ్జిలపై బియ్యం లారీలు తూకం వేసి పంపిస్తున్నారన్న విమర్శలున్నాయి. గోదాం నిర్వాహకులకు అడిగితే.. ఇప్పుడు. అప్పుడు సర్దుబాటు చేస్తామంటూ కాలయాపన చేస్తూ ఆవిషయాన్ని విస్మరిస్తూ వాపోతున్నారు. ఇప్పుడు.. ఇబ్బందికరం..గతంలో దొడ్డు బియ్యం సరఫరా సమయంలో తరుగు విషయమై అడిగినా పట్టించుకునేవారు లేకపోవడం, స్పందించి సహకరించేవారు లేకపోవడంతో చాలామందిరేషన్ డీలర్లు మిన్నకుండిపోయారు. కొందరు బయట లభించిన దొడ్డుబియ్యం కొనుగోలుచేసి తరుగు బోటును పూడ్చుకున్నారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. సన్నబియ్యం దాదాపు ప్రతీ లబ్దిదారుడు తీసుకుంటున్నాడు. విక్రయాలకి ఎవరూ ముందుకురావడం లేదు. ఫలితంగా వచ్చే చోటును పూడ్చుకోవడం డీలర్లకు అంత సులభం కాదు. ఉదాహారణకుఒక డీలరుకు ప్రతినెలా 200 క్వింటాళ్ల కోటా పంపిణీ జరుగుతుందనుకుంటే. అతనికి 400 బస్తాలు సరఫరా అవుతాయి. ప్రతీ బస్తాకు కనీసం కిలో తరుగు అనుకున్నా.. 400 కిలోలు. అంటే 2 క్వింటాళ్లు. ఈ లోటును ఎలా భర్తీ చేసుకోవాలన్నదే ఇప్పుడు డీలర్లకు తలనొప్పిగా మారింది. లబ్ధిదారుల ప్రయోజనార్థం ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణి ప్రారంభించినా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పాత పద్దతి పునరావృతం అవుతుండటంతో డీలరకు ఇబ్బంది కలుగుతోంది. డీలరు కూడా శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు ఆలోచిస్తే ఇక సన్నబియ్యం గొప్పలు తిప్పలు పెట్టడం ఖాయం.

తరుగు కోతకు ఇంకా అనుకోకుండా ఏదైనా బస్తాకు రంధ్రం పడితే మరింత ఎక్కువ బియ్యం డీలరు నష్టపోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పకడ్బందీగా తూకం వేసి ఎలాంటి తరుగు లేకుండా డీలర్లకు బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి.



## కులగణన దేశ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుంది

### బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలతోపాటు కులగణనను శాస్త్రీయంగా చేపట్టే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం సామాజిక న్యాయం, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కీలకంగా మారనుందని రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాయలంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, గతంలో అధికారంలో ఉన్న 60 సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కులగణన చేపట్టకపోవడం దారుణమైన మోసమని విమర్శించారు. 1931లో చివరిసారి బ్రిటిష్ ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్‌కు కులగణనపై ఎందుకు నిర్ణయం తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సిఫారసు చేసిన బిసి కమిషన్ (కాకా కలేల్కర్ కమిషన్)ను కాంగ్రెస్ పార్లమెంట్‌లో చర్చకు తీసుకురాకుండా తిరస్కరించిన చరిత్ర మరిచిపోవద్దని కాంగ్రెస్ పార్టీకి చురలకలంటించారు. నెహ్రూ నుండి రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ వరకు కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నారని ఆరోపించారు. నెహ్రూ బిసి రిజర్వేషన్లపై విముఖతతోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారని గుర్తుచేశారు. కులగణన విషయంలో తెలంగాణ మోడల్ అని చెబుతూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లాంటి నేతలు మాట్లాడటం మొసలి కన్నీరేనన్నారు. 94 సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న కులగణన నిర్ణయం ఒక చారిత్రాత్మక అధ్యాయాన్ని ఆరంభించిందన్నారు. ఇది బిసిలకు, మైనారిటీ వర్గాలకే కాకుండా, దేశం మొత్తానికి సామాజిక ఆర్థిక సమతుల్యతను తీసుకొచ్చే మార్గమని కొనియాడారు. అందుకే నరేంద్ర మోడీని ప్రజలు అభినవ అంబేద్కర్, అభినవ జ్యోతిబా ఫూలేగా పిలుస్తున్నారంటూ డాక్టర్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ పాల్గొన్నారు.



# కర్రిగుట్టల్లో హైటెన్షన్

### రోజురోజుకు ఉత్కంఠత రేపుతున్న సెర్చ్ ఆపరేషన్

### రంగంలోకి అదనపు బలగాలు.. గుట్టలపైకి చేరుకున్న జవాన్లు

### నిఘాను మరింత కట్టుదిట్టం చెయ్యాలి.. ఉన్నత స్థాయి సమీక్షలో దిశానిర్దేశం

**చర్ల, మే 1, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్‌లో భాగంగా టార్గెట్ క్రరిగుట్టలు చేపట్టి నేటికి 10 రోజులు కావస్తున్నా మావోయిస్టుల జాడ కనిపెట్టడంలో భద్రతా బలగాలకు పెను సవాల్‌గా మారింది. సుమారు 2,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న క్రరిగుట్టల (బ్లాక్ హిల్స్)ను చుట్టుముట్టడానికి 10 వేలకుపైగా బలగాలను వినియోగిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం స్వదేశంలో జరుపుతున్న అదిపెద్ద ఆపరేషన్ కావడంతో దేశవ్యాప్తంగా సంచలనం రోజురోజుకు ఉత్కంటత రేపుతుంది.

**రంగంలోకి అదనపు బలగాలు**

సుమారు పదివేల మంది పోలీసులు క్రరిగుట్టలను చుట్టుముట్టి మావోయిస్టుల వేట మొదలుపెట్టినా అనుకున్న ఫలితాలు రాకపోవడంతో రంగంలోకి అదనపు బలగాలు దింపింది. కేంద్రం హెలికాప్టర్ల ద్వారా మావోయిస్టు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బిజిఎల్ రాకెట్ లాంఛర్లను వినియోగిస్తూ డ్రోన్ల సహాయంతో నిఘా పెట్టినా మావోయిస్టుల జాడ కలిపెట్టిన దాఖలాలు పెద్దగా లేవు. దట్టమైన గుట్టలు గుహలతో నిండిన భూభాగం (క్రరిగుట్ట)లు కావడం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో సెర్చ్ ఆపరేషన్ జవాన్లకు అంత సులభమైన పనిగా కలిపించడం లేదు. మండు వేసవిలో భద్రతా బలగాల కష్టం వర్ణణాతీతం చాలామంది డీ హైడ్రేషన్ కారణంగా అనారోగ్యానికి గురయ్యారు. మరి కొందరూ జవాన్లకు ఆరోగ్య సమస్యలు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో షిఫ్ట్‌ల పద్ధతిలో మరిన్ని బలగాలను రంగంలోకి దింపాయి కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు.

**గుట్టలపైకి చేరుకున్న బలగాలు..**

నిటారుగా ఎనిమిది వందల అడుగుల అనేక గుట్టలను చేరుకోవడం బలగాలకు పెద్దపరీక్ష అని చెప్పవచ్చు. ఆపరేషన్ చేపట్టిన పదిరోజులకు భద్రతా బలగాలు క్రమక్రమంగా గుట్టలపైకి చేరుకొని మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ చేపడుతుంది. ఈ క్రమంలో జవాన్లు కొంతమేర విజయం సాధించినట్లు భారత జాతీయ జెండా గుట్టలపై ఎగురవేసి గమ్యానికి చేరుకున్నట్లు తమ విజయదరహాసాన్ని ప్రదర్శించి వీడియో విడుదల చేసారు.

అయితే క్రరిగుట్ట ఒకటే కాదు అలాంటి గుట్టలు అక్కడ చాలా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. గత రెండురోజులుగా గుట్టలపైకి చేరుకున్న బలగాలకు అవసరమైన ఆహారపదార్థాలు ఇతర వస్తువులను హెలికాప్టర్ల ద్వారా చేరవేస్తున్నారు. నిరంతరం కూబింగ్ ను ముమ్మరం చేసారు. కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన పదిరోజుల వ్యవధిలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. భారీ మొత్తంలో భద్రతా బలగాలను వినియోగిస్తూ హెలికాప్టర్లు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేసిన ఆశించిన ఫలితం లేకపోవడంతో ఆపరేషన్ క్రరిగుట్టలపై కేంద్ర ఇంటెలిజెన్సీ చీఫ్ తపన్ దేకా అత్యున్నత స్థాయి సమావేశంలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించారు.

**కేంద్ర ఇంటెలిజెన్స్ చీఫ్ ఉన్నతస్థాయి సమీక్ష..**

ఆపరేషన్ కగార్‌పై కేంద్ర ఇంటెలిజెన్సీ చీఫ్ తపన్ దేకా ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో పోలీసు ఉన్నతాధికారులతోపాటు సెంట్రల్ ఆర్మ్‌డఖ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)అధికారులతో అత్యున్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు రెండున్నర గంటలపాటు నిర్వహించిన సమావేశం తర్వాత ఆయన డిల్లీ వెళ్లిన తర్వాత సమావేశం గురించి వెలుగులోకి వచ్చింది. క్రరిగుట్టల్లో మావోయిస్టు కోసం కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇప్పటి వరకు జరిగిన విషయాలపై క్షుణ్ణంగా అడిగితెలుసున్నారు. ఇక ముందు జరగబోయే ఆపరేషన్ అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిసింది.

ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్ డిజిపి అరుణ్‌దేవ్ గౌతమ్ ఏడిజీ వివేకానంద్ సిఆర్పీఎఫ్ డిజీ జ్ఞానేంద్ర ప్రతాప్ ఎస్.ఐ.బి ఇతర పారామిలిటరీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత పదిరోజులుగా క్రరిగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్ కగార్ భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా చేసుకొని పెద్దఎత్తున చేపట్టి కూంబింగ్‌లో నేటికి మావోయిస్టుల జాడ కనిపించకపోవడంతో అసలు అక్కడ మావోయిస్టులు ఉన్నారా? ఉంటే వారిజాడ కనుగొవడంలో జాప్యం జరుగుతుందా.. లేదంటే నిఘా వర్గాలను భద్రతా బలగాలను తప్పుదోవ పట్టించి రహస్య ప్రాంతాలకు తరలి వెళ్లారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## '6జర్నీ' విడుదలకు రెడీ

పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 6జర్నీ. రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే9న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ ఆలూరి మాట్లాడుతూ, హీరో సమీర్ దత్, పల్లవి రాథోడ్ మెయిన్ లీడ్స్‌గా టేస్టీ తేజ, రవిప్రకాష్ రెడ్డి, రమ్యా రెడ్డి ప్రధాన పాత్రల్లో



నటించిన మా 6జర్నీ మూవీని మే 9న విడుదల చేస్తున్నాం. సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు దేశభక్తి ప్రధానంగా ఉండే కథాంశంతో సినిమాను రూపొందించాం. సినిమా తప్పకుండా మెప్పిస్తుంద్ధి అని అన్నారు. హీరో సమీర్ దత్త మాట్లాడుతూ, డిఫరెంట్ లవ్, యాక్షన్ థ్రిల్లర్‌గా 6జర్నీ తెరకెక్కింది. ఎంటైర్ టీమ్ ఎంతో కష్టపడ్డాం. బసీర్‌గారు సినిమాను బాగా తెరకెక్కించారు. నిర్మాత పాల్యం రవిప్రకాష్‌రెడ్డికి థాంక్స్. మే9 రిలీజ్ కాబోతున్న మా సినిమాను ఆశీర్వదించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానుఅన్నారు. హీరోయిన్ పల్లవి రాథోడ్ మాట్లాడుతూ, బసీర్, రవిప్రకాష్‌గారి సపోర్ట్‌తో సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు. సినిమాలో అన్నీ ఎలిమెంట్స్ ఉన్నాయి. మే9న మూవీ రిలీజ్ అవుతుంది. తప్పకుండా సినిమా అందిరికీ నచ్చుతుంది అన్నారు. నటి సాహితి మాట్లాడుతూ, 6 జర్నీ మూవీలో సరస్వతి అనే మంచి క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ బసీర్‌గారికి థాంక్స్. అలాగే నిర్మాత రవి చాలా కంఫర్ట్ జోన్ ఇచ్చి మాతో కలిసి ఆయన కూడా నటించారు. షూటింగ్‌ను అను కున్న సమయంలో పూర్తి చేశారు. సినిమాటోగ్రఫీ సురేందర్ రెడ్డికి థాంక్స్. నాతో పాటు నటించిన సమీర్, పల్లవి, తేజ సహా అందరికీ థాంక్స్. మే9న సినిమాను చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. నిర్మాత పాల్యం రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, లవ్, యాక్షన్, మిస్టరీ ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో 6జర్నీ మూవీని రూపొందించాం.

## 'హిట్: ది థర్డ్ కేస్' సూపర్ హిట్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్: ది థర్డ్ కేస్'. శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ చిత్రం, టీజర్, ట్రైలర్ పాటలతో విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'హిట్: ది థర్డ్ కేస్' మూవీ మే 1న పాన్ ఇండియాగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నేచురల్ స్టార్ నాని విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **హిట్ 3 కోసం దేశం అంత తిరిగారు కదా.. ఎలా ఉంది రెస్పాన్స్?** బ్రహ్మాండంగా ఉంది. షూటింగ్ కోసం అలాగే ప్రమోషన్స్ కోసం దేశ మొత్తం తిరిగాం. ఆడియన్స్ నుంచి చాలా మంచి రెస్పాన్స్ ఉంది. ఆడియన్స్ సినిమాని చూడాలని ఫిక్స్ అయిపోయారు. సినిమా రాకముందే అలాంటి ఒక పాజిటివ్ వైబ్ రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. **హిట్ 3 టీజర్ ట్రైలర్‌లో చాలా వైలెన్స్ కనిపిస్తుంది ..ఇది ఎలాంటి సినిమా?** హిట్ ఫ్రాంచైజీలో వచ్చిన రెండు సినిమాలు కూడా ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్. హిట్ 3 వచ్చేసరికి యాక్షన్ వైలెన్స్ కథ డిమాండ్‌ని బట్టి వచ్చింది. ఇది రెగ్యులర్ సినిమాల ఉండదు. చాలా రిలేటబుల్, స్టైలిష్‌గా ఉంటుంది. ఆర్గానిక్‌గా కుదిరిన కొన్ని ఎలిమెంట్స్ వల్ల సినిమాలో చూస్తున్నప్పుడే విజల్ వర్తీ మూమెంట్స్ చాలా ఉంటాయి. ఈ సినిమాని వైలెన్స్ కోసం తీయలేదు. కథలో ఆర్గానిక్‌గా వైలెన్స్ ఉంది. అది సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. **మీ సినిమాలకి ఫ్యామిలీ ఆడియన్స్ చాలా ఎక్కువగా వస్తుంటారు కదా.. ఈ సినిమా వైలెన్స్ కారణంగా ఏమైనా ఎఫెక్ట్ ఉంటుందా?** అడ్వాన్స్ బుకింగ్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. ఇది ఒక డిఫరెంట్ జోనర్ సినిమా. టార్గెట్ ఆడియన్స్‌ని మెప్పిస్తే ఖచ్చితంగా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా టార్గెట్ ఆడియన్స్‌ని ఖచ్చితంగా మెప్పిస్తుంది. **మీరు బాయ్ నెక్స్ట్ డోర్ ఇమేజ్‌తో స్టార్ట్ చేసి తర్వాత నేచురల్ స్టార్‌గా.. ఇప్పుడు చాలా వైలెంట్ సినిమాలు చేస్తున్నారు.. ఈ ట్రాన్స్ఫర్మేషన్‌ని ఎలా చూస్తారు?** నేను దీన్ని ట్రాన్స్ఫర్మేషన్‌గా చూడటం లేదు. ప్రతి సినిమాని ఒక కొత్త జోనర్ లో చేయాలని ప్రయత్నం చేస్తాను. హాయ్ నాన్న, జెర్సీ, దసరా, ఇప్పుడు హిట్ 3 ఇలా డిఫరెంట్ జోనల్లో చేసిన సినిమాలే. **డిఓపి షాన్ వర్గీస్ గురించి?** షాన్ అద్భుతమైన కెమెరామెన్. ఆయన విజువల్‌తో ఒక స్టోరీ చెప్పాలని ప్రయత్నిస్తారు. ఆయన పెట్టే ప్రతి ఫ్రేమ్ వెనక ఒక మంచి ఉద్దేశం ఉంటుంది. ఆయన ఒక షాట్ పెడితే అది ఆడియన్స్‌ని ఏం ఫీలయ్యాలా చేస్తుందో అనే క్లారిటీతోనే పెడతారు. ఆయన విజువల్స్ ఎమోషన్‌ని ఎన్హాన్స్ చేస్తాయి. **మిక్కి జే మేయర్‌ని మ్యూజిక్ కోసం తీసుకోవడానికి కారణం ఏమిటి?** మిక్కి మంచి క్రాఫ్ట్‌మ్యాన్, ఇప్పటివరకు మంచి ఫీల్‌గుడ్ సినిమాలు చేశారు. ఆయనఎప్పుడు కూడా థ్రిల్లర్ చేయలేదు. ఆయన ఒకవేళ థ్రిల్లర్ చేస్తే ఆ సౌండ్ వేరే ఉంటుంది.



## వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్



అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను ముంబయిలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం మే1 నుంచి 4 వరకు ముంబయి అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ సినిమాల గురించి మాత్రమే కాదు. ఓటీటీలు, కామిక్స్, డిజిటల్ మీడియా, యానిమేషన్, వీఎఫ్ ఎక్స్ ఇలా సినీ పరిశ్రమకు సంబంధించిన ఎన్నో విషయాలపై చర్చించనున్నారు. ఇక ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రధాని నరేంద్ర మోదీప్రారంభించారు. మారుతున్న సాంకేతికత నుంచి యంగ్ జనరేషన్‌ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతో ఉందన్నారు. ఇదిలా ఉంటే ఈ కార్యక్రమంలో ఓ అరుదైన సన్నివేశం చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రజనీకాంత్, చిరంజీవి, మోహన్‌లాల్ ముంబయికి వెళ్లిన విషయం తెలిసిందే. ఉత్తరాదికి చెందిన నటీనటులు కూడా పాల్గొన్నారు. నేటి యువతపై రజనీ క్రేజీ కామెంట్స్ ఒకనాటి డ్రీమ్ గర్ల్, రాజకీయ నేత హేమామాలిని, మిథున్ చక్రవర్తి, అక్షయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేవ్స్ వేడుక సమయంలో మోహనల్ లాల్, రజనీకాంత్, హేమామాలిని, చిరంజీవి, అక్షయ్‌కుమార్, మిథున్ చక్రవర్తి ఒకే దగ్గర కలిసి ఫోటోలకు పోజులిచ్చారు. ఈ లెజెండ్స్ అరుదైన కలయికకు సంబంధించిన ఫొటోలని మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సోషల్‌మీడియాఎక్స్‌లో పంచుకున్నారు.

## 'దేత్తడి' మాస్ అప్పీలింగ్ ఫస్ట్ లుక్

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ తమ ఫ్రైడ్ ప్రాజెక్ట్‌ను ఇటీవల ప్రకటించారు. రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో అలరించిన యంగ్ స్టార్ ఆశిష్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో నూతన దర్శకుడైన ఆదిత్య రావు గంగసాని తన క్రియేటివ్ విజన్‌ను తెరపైకి తీసుకురానున్నారు. ఈ చిత్రం హైదరాబాద్ వీధుల్లో చోటుచేసుకునే కల్చర్‌తో నిండిన, భావోద్వేగంతో కూడిన అనుభూతిని ప్రేక్షకులకు అందించనుంది. ఆశిష్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను అధికారికంగా విడుదల చేసింది. మాస్‌కు నచ్చే స్టైల్లో "దేత్తడి" అనే టైటిల్ పెట్టారు. ఇది హై ఎనర్జీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ప్రామిస్ చేస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆశిష్ హైదరాబాద్ వీధుల్లో కనిపించే డప్పు వాద్యకారుడి గెటప్‌లో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. భుజాలపై డప్పు తగిలించుకుని రెండు స్టిక్స్‌తో బలంగా మోగిస్తుండగా, మూడో స్టిక్‌ను పళ్ల మధ్యలో పట్టుకుని, అతని ముఖం మొత్తం జోష్‌తో నిండిపోయి ఉంది. అతని దుస్తులు కూడా అతని క్యారెక్టర్‌ను ప్రజెంట్ చేస్తూ మాస్ ఫీల్‌ను ఇస్తున్నాయి. బ్యాక్‌డ్రాప్‌లో డప్పులు మోగుతున్న గుంపు చుట్టూ జనం ఉత్సాహంగా డాన్స్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. ఇది సినిమాకు ఎంత ఎనర్జీగా ఉంటుందో సూచిస్తోంది. ఈ సినిమాలో మాస్ మేకోవర్‌లో కనిపించనున్న ఆశిష్, హైదరాబాదీ స్లాంగ్‌లో డైలాగులు చెప్పడం సినిమాకు మరో హైలైట్ కానుంది. ఈ సినిమాకు సంగీ తం మరో ప్రధాన బలంగా నిలవనుంది. దర్శకుడు స్వయంగా మ్యూజికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవాడు కావడంతో సినిమాలో సౌండింగ్ ఇన్నోవేటివ్‌గా ఉండ బోతుంది. ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. తారాగణం: ఆశిష్, టెక్నికల్ టీమ్: దర్శకత్వం: ఆదిత్య రావు గంగసాని, నిర్మాతలు: దిల్ రాజు, శిరీష్, బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, ఇన్ అసోసియేషన్ విత్ రుతమ్ స్టోరి ల్యాబ్, సమర్పణ: శ్రీమతి అనిత, క్రియేటివ్ నిర్మాత: రుతమ్ సమర్, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్ పార్ట్‌నర్: హ్యాష్ ట్యాగ్ మీడియా.






## హిందీలో బాలయ్య మాస్ స్పీచ్ వైరల్!

నందమూరి నటసింహం బాలకృష్ణ తాజాగా గౌరవ పద్మ అవార్డుతో పురస్కరించబడిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే బాలయ్య ఇపుడు అఖండ 2 చేస్తున్న నేపథ్యంలో ఈ అత్యున్నత పురస్కారం రావడంలో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇదిలా ఉండగా బాలయ్య మరియు తన కుటుంబంపై పలు బ్యూటిఫుల్ ఫోటోలు కూడా మంచి వైరల్‌గా మారగా వీటితో పాటుగా ఓ క్రేజీ క్లిప్ ఇపుడు వైరల్‌గా మారుతుంది.మరి ఇందులో బాలయ్య తన హిందీ స్పీచ్‌తో అదరగొట్టారని చెప్పాలి. నార్త్ ఆడియెన్స్‌కి రీచ్ అయ్యేలా పద్మ పురస్కారం అందుకున్న నేపథ్యంలో ముచ్చటించిన బాలయ్య తన ఇటీవల సినిమాలు అలాగే తన కుటుంబ నేపథ్యం ఇంకా తన సేవా కార్యక్రమాల కోసం కూడా చెప్పడం జరిగింది. దీనితో ఈ వీడియో ఇపుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక మళ్ళీ బాలయ్య ఇపుడు యథా విధిగా అఖండ 2లో బిజీగా మారను న్నారు.



## 'కిల్లర్' గ్లింప్స్ రిలీజ్

"శుక్ర", "మాటరాని మోనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా... విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏయు అండ్ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది."కిల్లర్" మూవీ గ్లింప్స్ తెలుగుతో పాటు కన్నడ భాషల్లో రిలీజ్ చేశారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో.. ఇలాంటి ఎలిమెంట్స్‌తో గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. "కిల్లర్" మూవీ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే ప్రాచీన వైమానిక శాస్త్రంలో ఆశ్చర్యపరిచే మానవ మేథస్సు రహస్యాలు వెల్లడించారు. ఆత్మ కలిగిన యంత్రాలు చూస్తారంటూ వైమానిక శాస్త్రంలో చెప్పిందే నిజం కాబోతోందా అంటూ ఈ గ్లింప్స్ ప్రారంభమైంది. డి బౌండ్ అనే డిజార్డర్‌తో బాధపడుతున్న హీరోయిన్ రాయ్, పూర్తిగా కోలుకుంటే పునర్జన్మ ఎత్తినట్లే అని, అప్పుడు ఆమెకు ఎదురు నిలవడం ఎవరి వల్లా కాదని గ్లింప్స్‌లో చూపించారు. సూపర్ షీ క్యారెక్టర్‌లో జ్యోతి రాయ్ చేసిన స్టన్నింగ్ యాక్షన్, సెటిల్డ్ పర్ ఫార్మెన్స్ హైలైట్ గా నిలుస్తోంది. లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలతో ఈ సినిమా రూపొందించినట్లు గ్లింప్స్‌తో తెలుస్తోంది. మొదలెడదామా అంటూ గ్లింప్స్ చివరలో హీరో, డైరెక్టర్ పూర్వాజ్ పవర్ ఫుల్ డైలాగ్‌తో ఆకట్టుకున్నారు. హై క్వాలిటీ మేకింగ్, వీఎఫ్ఎక్స్ గ్లింప్స్‌కు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకుంటున్న "కిల్లర్" సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. నటీనటులు: జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్, తదితరులు, టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్: ఆశీర్వాద్, సుమన్ జీవ, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్: మెర్జ్ ఎక్స్ఆర్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), లైన్ ప్రొడ్యూసర్: దశరథ, బ్యానర్స్: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్, ఏయుఅండ్ఐ. నిర్మాతలు: పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి.



## 'కింగ్‌డమ్' నుంచి ప్రోమో

కథా నాయకుడు విజయ్ దేవరకొండ, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్ త్రయం చేతులు కలిపితే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ప్రోమో ఉంది. ప్రోమోలో విజయ్, భాగ్యశ్రీ బోర్సే జోడీ చూడ ముచ్చటగా ఉంది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. పూర్తి గీతం మే 2వ తేదీన విడుదల కానుంది. వారు బ్రతకడానికి ప్రేమను నటిస్తారు, కానీ త్వరలోనే అది నిజమనిపిస్తుంది. అనే వాక్యాన్ని నిర్మాతలు జోడించారు. దానిని బట్టి చూస్తే, ప్రధాన పాత్రలు మొదట ప్రేమలో ఉన్నట్లు నటిస్తాయి, కానీ చివరికి నిజంగానే ప్రేమలో పడిపోతాయని అర్థమవుతోంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సినిమా పట్ల ఆసక్తిని, అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. జోమోన్ టి. జాన్ మరియు గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రహణం అత్యున్నత స్థాయిలో ఉంది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మే 2న విడుదల కానున్న హృదయం లోపల గీతం ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రోమోలో అనిరుధ్ సంగీతం కట్టిపడేసింది. అలాగే అనిరుధ్, అనుమిత నదేశన్ తమదైన గాత్రంతో మెప్పించారు. ఈ మనోహరమైన గీతానికి కెకె సాహిత్యం అందించారు. దార్ గై తన కొరియోగ్రఫీతో ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి అద్భుతమైన కథను, అంతే అద్భుతంగా తెరకెక్కిస్తూ కింగ్‌డమ్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకరా స్టూడియోస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## 'కెజెక్యూ' గ్రిప్పింగ్ టీజర్

సుధాకర్ చెరుకూరి నేతృత్వంలోని ప్రతిష్టాత్మక ఎస్ఎల్‌వి సినిమాస్, అనేక బ్లాక్ బస్టర్లు, సంచలనాత్మక చిత్రాలను అందించింది. ఈ నిర్మాణ సంస్థ ప్రస్తుతం 1990ల నేపథ్యంలో సాగే ఒక పీరియాడిక్ క్రైమ్ డ్రామా నిర్మిస్తోంది. "కెజెక్యూ కింగ్ జాకీ క్వీన్" అనే టైటిల్‌తో రూపొందిన ఈ చిత్రంలో బ్లాక్ బస్టర్ దసరా చిత్రంలో తన అద్భుతమైన నటనతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టితో పాటు శశి ఓదెల, యుక్తి తరేజ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కె.కె. దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇప్పటికే ఆసక్తికరమైన టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ గ్లింప్స్‌తో సంచలనాన్ని సృష్టించింది. నేచురల్ స్టార్ నాని లాంచ్ చేసిన టీజర్, రాజు పాత్రను పోషించిన దీక్షిత్ శెట్టి చెప్పిన డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. నగరం, తుపాకీ రెండూ ఒకటే అవి వాటిని పట్టుకున్న వ్యక్తి మాట వింటాయి. శశి ఓదెల జాకీ పాత్రలో పరిచయం కాగా తనది గొప్పతనాన్ని సాధించడానికి పెద్ద రిస్క్‌లు తీసుకోవడంలో నమ్మకం ఉన్న పాత్ర. యుక్తి తరేజా రాణి పాత్రలో కనిపించింది టీజర్ కత్తితో జీవించేవాడు కత్తితో చనిపోతాడు మత్తయి 26:52. అనే బైబిల్ నోట్‌తో ముగుస్తుంది. టీజర్ కేవలం పాత్ర పరిచయం కాకుండా, సినిమాటోన్ ప్రిమైజ్‌ని సెట్ చేస్తుంది. ఆకట్టుకునే విజువల్స్, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌లు, ఎక్సయిటింగ్ రైటింగ్‌తో మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. దీక్షిత్ శెట్టి ఫెరోషియస్ పెర్ఫార్మెన్స్, శశి ఓదె, యుక్తి తరేజా వారి స్క్రీన్ ప్రెజెన్స్‌తో శాశ్వత ముద్ర వేశారు. నగేష్ బానెల్ ఆకట్టుకునే సినిమాటోగ్రఫీ, పూర్ణచంద్ర తేజస్వి ఇంటెన్స్ మ్యూజిక్ ఈ చిత్రానికి మరోస్థాయికి తీసుకెళ్తాయి. శ్రావణ్ కటికనేని ఎడిటర్, శ్రీకాంత్ రామిశెట్టి ప్రొడక్షన్ డిజైనర్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. దసరా తర్వాత మిమ్మల్ని కలవడం ఆనందంగా వుంది. రెండేళ్ల తర్వాత అదే ప్రొడక్షన్ హౌస్‌లో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాలో నాకు ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్‌కి థాంక్యూ. ఈ సినిమా కోసం టీమంతా చాలా ఎఫర్ట్ పెట్టాం. సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తెలుగు ఆడియన్స్ నాలో ఉన్న టాలెంట్‌ని అప్రిషియేట్ చేసి నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. మా టీజర్‌ని లాంచ్ చేసిన నానికి హృదయ పూర్వక ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు. హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ, అందరికి నమస్కారం ఈ సినిమాలో ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. నిర్మాత సుధాకర్‌కి థాంక్యూ వారి నిర్మాణంలో మరెన్నో సినిమాలు చేయాలని ఉంది. యాక్టర్స్ దీక్షిత్ శశి చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యారు. ఈ సినిమాకి మీ అందరి సపోర్ట్ కావాలని కోరుకుంటున్నాను అన్నారు. హీరో శశి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. టీజర్‌ని లాంచ్ చేసిన నానికి థాంక్యూ. ఈ సినిమా చాలా ఎక్సైటింగ్‌గా ఉంటుంది. ఇంత మంచి క్యారెక్టర్ రాసి కొత్త వాడినైనా నేను చేయగలరని నమ్మిన డైరెక్టర్‌కి నిర్మాతకి థాంక్యూ. అందరం 100 ఎఫర్ట్ పెట్టి ఈ సినిమా చేసాం. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందని నమ్ముతున్నాను అన్నారు.



# బడ్జెట్‌లో ఫ్యాషన్‌గా..

ఇంట్లో ఎన్ని డ్రెస్‌లు ఉన్నా మార్కెట్‌లోకి కొత్తరకం రాగానే మనసు అటే మళ్లుతుంది. మనకున్న బడ్జెట్‌లోనే



ఫ్యాషన్‌గా ఉండే బట్టలు వేసుకోవాలనుకుంటే వాటిని ఎంపిక చేసుకోవడం కొంచెం కష్టమైన విషయమే. అయితే ఏదైనా ఆలోచిస్తే ఏదో ఒక పరిష్కారం దొరకకపోదు. అందుకు కొన్ని టిప్స్ పాటిస్తే మంచిది. ముందు బీరువాలో ఉన్న బట్టలన్నీ తీసి ఒక దగ్గర పెట్టుకోవాలి. అందులో సరిగ్గా వాడనివి కనిపిస్తాయి. బాగా వాడినవి కనిపిస్తాయి. అప్పటికి రంగు నచ్చకనో, ఫిట్టింగ్ కుదరకనో మరే కారణాలతోనే వేసుకుని ఉండకుండా ఉండేవి ఉంటాయి. అలాంటి వాటిని సరిచేయించడం లేదా వేరేవాటితో మ్యాచ్ చేసి వాడుకోవడం లాంటివి చేయవచ్చు. ఇక, బాగా వాడేసి బోర్ కొట్టిన వాటిని ఎవరికైనా ఇచ్చేందుకు పక్కనపెట్టాలి. అలాగే వార్డ్‌రోబ్ స్టైలిష్‌గా ఉండాలంటే అందుకు ఎంత బడ్జెట్ అయితే పెట్టుకోవచ్చు. ఏమేం కొనాలి అన్నది చూసుకోవాలి. దానిలో ఉన్నవి వాడుకునేలా కూడా చూసుకోవాలి. వాటిని ఎంత మేరకు వాడవచ్చు. ఏం కొనాలి, ఏం కానాల్సిన అవసరం లేదు అని చూసుకుంటే బెల్టులు, గొలుసులు, ఉంగరాలు, లెదర్‌జాకెట్లు, ఓవర్‌కోట్‌ల లాంటివి ఇదివరకే ఉంటే వాటికి ఏమైనా మ్యాచింగ్ చేసే కొత్తగా కనిపించవచ్చా అన్న కోణంలో సెట్‌చేసుకునేలా చూసుకోవాలి. రెండు, మూడు డ్రెస్‌లకు సరిపడేలా షూస్‌కానీ, కోట్‌లు కానీ ఎంచుకోవాలి. బ్లూ జీన్స్, వైట్ షార్ట్‌లాంటివి కాస్త ఎక్కువ ఉంటేనే సరిపోతుంది. కజిన్స్, స్నేహితులతో కొని దుస్తులు మార్చుకుంటే కొత్తగా అనిపిస్తుంది. ఎందుకంటే వారి వద్ద ఉన్నవి మీకు నచ్చవచ్చు. మీ వద్ద ఉన్న వారికి నచ్చవచ్చు. అటువంటప్పుడు ఒకరివి ఒకరు మార్చుకోవచ్చు. అవి సరదాగా వేసుకోవాలనిపిస్తాయి. వాళ్లకు కూడా కొత్తగా కనిపించిన అనుభూతి కలుగుతుంది. సాదా టీ షర్ట్ మీద ఏదైనా పాచ్ వేసి ఐరన్ చేసి కొత్త లుక్ తేవచ్చు. ఇష్టంగా వేసుకునే టీ షర్ట్‌ను వదలబుద్ధి కానప్పుడు చేతులు తీసేసి ట్యాంక్ టాప్‌గా మార్చి ఎత్ఫ్యాషన్‌గా ట్రైచేయవచ్చు. ఒకదానిమీద ఒకటి వేసుకునే టీషర్ట్‌లు చొక్కాలను మిక్స్ అండ్ మ్యాచ్ మోడల్‌లో వేసుకుంటే ట్రెండీగా ఉంటుంది. ఇంతా అయ్యాక కూడా ఏమైనా న్యూ లుక్ కావాలనిపిస్తే మంచి ఆఫర్ చూసి కొనుక్కోవచ్చు. ప్రస్తుతం ఫ్యాషన్ దుస్తులు రకరకాలుగా ఉంటున్నాయి. జాగ్రత్తగా ఎంపిక చేసు కుంటే కొత్తదనాన్ని ఆస్వాదించవచ్చు. ✠

# ఇంట్లోనే వర్కవుట్స్

బరువు తగ్గే క్రమంలో ఆహారానికి ఎంత ప్రాధాన్య మిస్తామో.. వ్యాయా మాలకూ అంతే ప్రాధాన్యమివ్వాలి. అయితే ఇందుకోసం కొంతమందికి జిమ్‌కి వెళ్లే సమయం ఉండదు. మరికొందరు నలుగురిలో వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది



పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే.. వర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే. వర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయా మాలు చేయడమన్నమాట! 'హోమ్ వర్కవుట్' జిమ్ వర్కవుట్ ట్రాకర్.. వంటి వివిధ రకాల యాప్స్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే కొంతమంది ఫిట్‌నెస్ నిపుణులూ ప్రత్యేకంగా యాప్స్ నక్రియేట్ చేసుకుంటారు. కొంత మొత్తం చెల్లిస్తే వాటిని డౌన్‌లోడ్ చేసుకొని వ్యాయామ చిట్కాలు పొందచ్చు. అయితే ఇక్కడ మనం చేసే వ్యాయామాల్ని బట్టి ఆయా జిమ్ పరికరాల్ని కొనుక్కోవడం మంచిది. ఇక కొంతమంది యూట్యూబ్ వీడియోలు చూస్తూ వర్కవుట్లు చేస్తుంటారు. కానీ కొన్ని రకాల వ్యాయామాల్ని నిపుణుల పర్యవేక్షణలోనే చేయాల్సి ఉంటుంది. కాబట్టి కొత్తగా వ్యాయామాలు ప్రారంభించే వారైనా లేదంటే అప్పటికే అలవాటున్న వారైనా.. సంబంధిత యాప్స్ డౌన్‌లోడ్ చేసుకొని లైవ్ సెషన్స్ ద్వారా ఎక్సర్‌సైజ్ మొదలు పెట్టడం సురక్షితం. ✠ డైట్ ప్లాన్ చేసుకోవాలి.

# శిరోజాలు ఆరోగ్యంగా



నల్లని ఒత్తైన పొడవాటి జుట్టు ఉండాలని అమ్మాయిలంతా కోరుకుంటారు. కానీ ఆ ఆశ అందరికీ నెరవేరడం లేదు. వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, రక్తహీనత వంటి కారణల వల్ల యువతులు, మహిళలు జుట్టురాలే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జాగ్రత్తలు పాటిస్తే మంచిది. జుట్టు రాలడానికి ప్రధాన కారణం వెంట్రుకల కుదుళ్ల బలహీనమవడమే. కుదుళ్ల బలంగా ఉండాలంటే విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు ఉండే పోషకాహారం తీసుకోవాలి. రోజు ఆకుకూరలు, గుడ్లు, చేపలు, నట్స్, మొలకలు, పండ్లు ఉండేలా వెంట్రుకల కుదుళ్ల బలంగా ఉండేందుకు వాటికి తగినంత రక్త ప్రవాహం అందేందుకు మాడుమీద మసాజ్ చేసుకోవాలి. ప్రతీ రోజూ కనీసం పదిహేను నిమిషాలు కొబ్బరినూనెతో తలమీద సున్నితంగా మర్దన చేసుకోవాలి. దీని వల్ల కుదుళ్ల ఉత్తేజితమై శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు రాలడాన్ని అరికట్టి వెంట్రుకలకు పోషణ అందించడంలో గుడ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఒక గిన్నెలో కోడిగుడ్డు తెల్లసొన వేసి నురుగు వచ్చేలా బాగా గిలక్కొట్టాలి. దీనిని వెంట్రుకల కుదుళ్లకు చేరేలా తలకు పట్టించాలి. కనీసం ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగి మైల్డ్ షాంపుతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. కొబ్బరి పాలలో క్యాల్షియం, ఐరన్, పాస్ఫరస్, విటమిన్లు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. తాజా కొబ్బరి పాలను తలకు పట్టించి అరగంట ఆరనివ్వాలి. తర్వాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది. వెంట్రుకలకు కాల్సిన తేమ పోషణ అందుతాయి. కలబంద గుజ్జును తలకు పట్టించి గంట సేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. కలబంద గుజ్జు తలలోని పీహెచ్ లెవల్స్‌ని సమతుల్యం చేస్తుంది. చుండ్రును నివారిస్తుంది. ముందుగా గ్రీన్ టీ తయారు చేసుకుని చల్లార్చి పక్కన పెట్టండి. తలస్నానం పూర్తయిన తరువాత ఈ టీని తల వెంట్రుకలకు పట్టించండి ఇది ఒక మంచి కండిషనర్‌లా పనిచేసి వెంట్రుకలకు మెరుపు నిస్తుంది. గ్రీన్‌టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కుదుళ్లను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. ✠

## ఆధ్యాత్మికం

# గమ్యానికి గమకం



ఇహపరాలకు సంబంధించిన విషయాలను ప్రస్తావించింది సువర్ణసూక్తం. సువర్ణం అంటే రెండు రెక్కలున్న ప్రాణి. కొమ్మపైనున్న రెండు పక్షుల్లో ఒకటి రావిపళ్లు తింటోంది. రెండోది చూస్తోంది. ఒకటి కర్మఫలం అనుభవించే జీవాత్మ. రెండోది కర్మకు తగ్గ ఫలాన్ని నిర్ణయించే పరమాత్మ. సువర్ణ శబ్దం సూర్యుడికి, గరుత్మంతుడికి, జీవాత్మకు సమానం. కర్మసాక్షి అయిన సూర్యుడికి పగలూ రాత్రి, గరుత్మంతుడికి శక్తి, భక్తి.. జీవుడికి ప్రాణం, జ్ఞానం రెక్కలతో సమానం. మనిషిలో సూర్యుడి ద్వారా ప్రాణశక్తి, గరుడుకి ద్వారా సూక్ష్మబుద్ధి ప్రవేశించి జీవాత్మను జీవుడిగా మార్చాయి. అతడిలోని చైతన్యం కర్మలకు పురిగొలిపి కర్మ ఫలాలను తిని పిస్తుంది. అందుకే అతడు రాగ ద్వేషాలకూ, కష్ట సుఖాలకూ ఆహార మౌ తాడు. మనిషి భోక్తా సువర్ణుడు. స్వార్థం రెక్క విప్పితేనే సుడి గుండం, త్యాగం రెక్క విప్పితే మోక్ష గుండం. సూ ర్యుడు ఆత్మ కారకుడు. పగలంతా లోకాలను వెలిగించి, రాత్రి పడమటి సముద్రం లో తల దాచు కుంటాడు. రెక్కలార్చి గగన విహారం చేసే ఎర్రని పక్షి నీటిని పీల్చుకుని, వర్షం కురి పిస్తుంది, తృప్తినిస్తుంది. జీవరాశిని రక్షిస్తుంది అని రుగ్వేదం సూర్యుణ్ణి వర్ణిస్తుంది. గరుత్మంతుడు తల్లి దాస్యం తప్పించడానికి స్వర్గాన్ని జయించి అమృతం తెచ్చాడు. పని పూర్తయిన వెంటనే తిరిగెళ్లి అమృతకలశాన్ని ఇంద్రుడికే సమర్పించాడు. ఇహపరాల నడుమ జీవనం సాగిస్తూ కష్టసుఖాలు చవిచూస్తూ వైరాగ్యంతో జీవన్ముక్తిని పొందడమే జీవిత పరమార్థం, నిష్కామకర్మం మార్గమే గమ్యానికి గమకం.

# గుడ్డులో పోషకాలు

రోజుకో గుడ్డు తింటే మంచి దన్నది తెలిసిందే! కానీ చాలా మంది ఇందులో కొలెస్ట్రాల్‌ని కారణంగా చూపించి దూరం పెడుతుంటారు. ఆ భయం అక్కర్లేదని నిజానికి గుడ్డువల్ల వయసుతో వచ్చే మతి మరుపులాంటి వాటిని దూరం పెట్టొచ్చని తేల్చింది అధ్యయనం. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాండియాగో శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. సుదీర్ఘకాలం గుడ్డు తినే అలవాటుండీ. యాభై ఏళ్లు దాటిన వెయ్యిమందికిపైన ఈ అధ్యయనం చేపట్టారు. వారంలో ఐదురోజులకు తగ్గకుండా గుడ్డు తిన్నవారిలో అలా తినని వారితో పోలిస్తే జ్ఞాపక శక్తి ఏమాత్రం సన్నగిల్లకుండా ఉండడం గమనించారు. గుడ్డులోని కొలిన్, ల్యూటిన్ వంటి వాటితోపాటు ఇతర మేలు రకం ప్రోటీన్లు మెదడులోని సున్నితమైన నరాలకు రక్షణగా ఉంటాయని చెబుతున్నారు. మగవాళ్లకన్నా ఆడవాళ్లకి గుడ్డులోని పోషకాలు ఎక్కువ మంచి చేస్తున్నాయని వీళ్ల అధ్యయనంలో తేలింది. ✠

# జ్ఞాపకాలతో సంతోషం!

ఉదయం నుంచి రాత్రి వరకు ఒకే సమయంలో ఒకే రకమైన పనులు చేస్తుంటాం. నిత్యం ఇదే పనులతో బిజీగా ఉండే అలవాటుపై అకస్మాత్తుగా వెగటు పుడుతుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఏం చేయాలనట తోచదు. ఇలా బోరింగ్ రూట్‌లో చిక్కుకుని దారి తెలియనప్పుడు చిన్న బ్రేక్ అవసరమంటున్నారు నిపుణులు. అది ఎందుకో చూద్దాం. ఆల్బమ్.. చిన్నప్పటి ఆల్బమ్ ఎక్కడుందో వెతకండి. చదువుకున్నప్పుడు స్నేహితులతో కలిసి తీసుకున్న ఫొటోలు, ఆ అల్లరి, అనుభవాలన్నీ రీల్స్‌లా కళ్లముందు మెదులుతాయి. అలాగే పెళ్లైన కొత్తలో తీసుకున్న ఫొటోల నుంచి పిల్లల సందడితో ఉన్న పుట్టినరోజుల వరకు కాసేపు చూస్తే చాలు. మొత్తం జ్ఞాపకాలన్నీ తుమ్మెదల్లా వచ్చి ముందు వాలతాయి. మనసునంతా ఆహ్లాదంగా మార్చేస్తాయి. కథనం... ఎక్కడో చూసిన ఓ సంఘటన మీకు ఏదైనా కథ రాయాలనే ఆలోచనను తెచ్చినప్పుడు దాన్ని టూకీగా ఓ చిన్న పుస్తకంలో రాసి ఉంచాలి. ఆ తర్వాత సమయాన్ని కేటాయించి మనసులోని ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వాలి. రాసేకొద్దీ మరిన్ని ఆలోచనలు రావొచ్చు. కథారచన మీ కెరియర్‌నే మార్చేయొచ్చు. మనసులో దాగున్న అభిరుచిని బయటకుతేగలిగతే మన జీవితలక్ష్యాన్ని అదే నిర్దేశిస్తుంది. ప్రసంగం .. స్ఫూర్తి ప్రసంగాలు వినండి. అటువంటివారి పుస్తకాలు చదవండి. ఆ జీవితకథలు మీలోని ప్రత్యేకతలను గుర్తించడమెలాగో నేర్పుతాయి. మనసుకు నచ్చిన మార్గాన్ని ఎంచుకోవడం ఎలాగో చెబుతాయివి. . సాయం.. చిన్నప్పుడు ఏదైనా సృజనాత్మకత మీలో ఉండే ఉంటుంది. దాన్నివెలికి తీయండి. వీలైతే కొందరికి నేర్పండి. తిరిగి అదే మిమ్మల్ని మరిన్ని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా చేస్తుంది. అలాగే సామాజిక సేవలందిస్తున్నవారికి చిన్న సాయం చేస్తే, మీ మనసంతా సంతోషంతో నిండుతుంది. ✠



# రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి

## మంచాలమ్మకు హారతులు - ఆశీర్వదించిన పీఠాధిపతి

**మంత్రాలయం,మే 1,ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి ఎస్.యడియూరప్ప, శివమొగ్గ ఎంపి రాఘవేంద్రలు గురువారం మంత్రాలయం విచ్చేశారు. వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు శ్రీ రాఘవేంద్రస్వామి మొమెంటో, ఫల,పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు

వీరివెంట మేనేజర్‌లు వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, పిఆర్‌ఓ వ్యాసరాజాచారి తదితరులు ఉన్నారు.

# ఇసుక అమ్మకాలతో రూ.745 కోట్ల ఆదాయం

## ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త** రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏడాదితో రూ.745 కోట్లు ఆదాయం వచ్చిందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈ అనిల్‌కుమార్ తెలిపారు. గత ప్రభుత్వం హయంలో ఏటా రూ. 678 కోట్లు రాగా, ఇప్పుడు వాటి ఆదాయం పెరిగిందన్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ ఇసుకు అక్రమ రవాణా జరగకుండా అరికట్టడంతో పాటు, సామాన్యులకు సులువుగా దొరికేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. అధిక ధరలకు ఇసుక అమ్మకాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మకాలు చేయాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 48 రీచుల నుంచి ఇసుక తరలిస్తున్నామని, ఇసుక కావాల్సిన వారికి డోర్డెలివరీ సౌకర్యం కల్పించామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమాలను నిరోధించడానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. ఇసుక రీచ్‌ల నుంచి వచ్చే వాహనాలకు జీపిఎస్ పరికరాలు, ఇసుక రీచుల వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందన్నారు. దీంతో ప్రభుత్వానికి ఇసుకు ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ప్రభుత్వం రూ. 1,200 కోట్లు టార్గెట్ పెట్టుకుందని తెలిపారు. ప్రస్తుతం ఇసుక బజార్లు నాలుగు చోట్ల ప్రారంభించామని, మరో రెండు చోట్ల త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. సన్న ఇసుక ధర రూ. 1,800, దొడ్డు ఇసుక రూ. 1,600లు నిర్ణయించినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ ఇసుక తవ్వకాలు పాటు వేబిల్స్ లేని వాహనాలను నియంత్రించే ఉద్దేశంతో సాండ్ బజార్స్‌కు శ్రీకారం చుట్టమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ఫలితంగా బహిరంగ మార్కెట్లో ఒక వారంలోనే సన్న ఇసుక ధర రూ.1,900 నుంచి 1,800, దొడ్డు ఇసుక ధర రూ.1,700 నుంచి రూ. 1,600 వరకు దిగి వచ్చిందన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే ఇసుకను చేర్చే వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భాగంగా తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఆన్‌లైన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసిందని వెల్లడించారు.



# అమరావతి ఆర్థిక గ్రోత్ ఇంజన్

## అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే: మంత్రి కొలసుపార్థసారథి

**విజయవాడ,మే1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మే 2 న జరిగే అమరావతి పనుల పున: ప్రారంభ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఏపీ సమాచారశాఖా మంత్రి కొలసుపార్ధ సారధి తెలిపారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి రాష్ట్ర ఆర్థిక గ్రోత్ ఇంజన్ అని, అటు వంటి రాజధాని అమరావతిని ప్రేమించే వారంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖమాత్యులు కొలుసు పార్ధసారధి పిలుపునిచ్చారు. మే 2 వ తేదీ సాయంత్రం 3.00 గంటల నుండి జరికే ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ హాజరవుతున్నారున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వ సహాయం వల్లే అమరావతి అభివృద్ధి పనులకు, పోలవరం ప్రాజెక్టు పనులకు నిధులను సమకూర్చుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు ఐదు లక్షల వరకూ ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని, ఎవరికీ ఎటు వంటి అసౌకర్యం కలుగ కుండా అన్ని రకాల వసతులను, సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలు పెరగకుండా శ్రమిస్తున్న కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు మే డే సందర్భంగా మంత్రిపార్ధసారధి:శుభాకాంక్షలు తెలిపారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం వారి అభ్యున్నతికి తప్పకుండా దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల శ్రమవల్లే సంపదలు సమకూరుతాయన్నారు.

# అక్షయతృతీయకు రికార్డు స్థాయిలో బంగారు డాలర్ల విక్రయాలు

**తిరుమల,మే 1 ప్రభాతవార్తప్రతినిధి:** అక్షయతృతీయ పర్వదినాన కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు కొందరు సెంటిమెంట్‌గా బుధవారం తిరుమలలోనే బంగారుడాలర్లు కొనుగోలుచేశారు. డబ్బున్న ధనవంతులేగాక ఆర్థికస్థోమత ఉన్న భక్తులు కూడా బుధవారంరోజు సెంటిమెంట్‌గా శ్రీవారి ప్రతిమతో ఉన్న టిటిడి విక్రయించిన 2గ్రాములు, 5,10గ్రాముల విలువైన బంగారు డాలర్లు 186 భక్తులు కొనుగోలుచేయడం విశేషం. అలాగే వెండి 5,10గ్రాముల డాలర్లు కూడా 337 విక్రయాలు చేశారు. ఈ మొత్తం విక్రయాల ద్వారా టిటిడికి బుధవారం ఒక్కరోజే 90,70,667 రూపాయలు ఆదాయం రికార్డు స్థాయిలో చేకూరడం నమోదైంది. సహజంగానే తిరుమలకు వచ్చిన భక్తులు మెడలో దేవుని డాలరుధరించడం పరిపాటిగా ఉంటుంది. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిమ డాలరు ధరిస్తే తమతోబాటే స్వామివారు ఉన్నట్లేనని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తుంటారు. సాధారణంగానే ఏడుకొండలస్వామిని ప్రతిరోజూ 70వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకొంటున్నారు. వీరిలో ఏ కొద్దిమంది



ధనవంతులైన భక్తులు మాత్రమే వారివారి స్థోమత బట్టి స్వామివారి ప్రతిమతో కూడిన బంగారు,వెండి డాలర్లు కొనుగోలుచేస్తుంటారు. తిరుమలలో ఆలయానికి ఎదురుగా ఉన్న కౌంటర్‌లో 5,10గ్రాముల బంగారు డాలర్లు మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. అలాగే వెండి డాలర్లు అందుబాటులో ఉన్నాయి. గత కొంతకాలంగా 2గ్రాముల బంగారు డాలర్లు టిటిడి అందుబాటులో ఉంచకపోయినా అక్షయతృతీయ పర్వదినంరోజు మాత్రం భక్తుల నుండి వచ్చే డిమాండ్‌కు తగ్గట్లు 2గ్రాముల డాలర్లను అందుబాటులో ఉండేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక చొరవ చూపారు. దేశవ్యాప్తంగా ఉన్న హిందువులు, జైనులు అక్షయతృతీయ పర్వదినాన్ని బంగారు కొనుగోలుపై ఆసక్తిచూపుతుంటారు. ఏప్రిల్ 30వతేదీ బుధవారం అక్షయతృతీయకావడంతో తిరుమలలోనూ భక్తులు సెంటిమెంట్‌గా దేవునిచెంత బంగారు కొనుగోలుచేయడంపై ఆసక్తిచూపారనే తెలుస్తుంది. అందుకు తగ్గట్లు టిటిడి సేల్స్(విక్రయాల) కౌంటర్‌లో భక్తులు బంగారు,వెండి డాలర్లను కొనుగోలు చేశారు.

# రైల్వే గ్రూప్-బి పదోన్నతులపై సిబి'ఐ'

**గుంతకల్లు రైల్వే,మే 1,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 4,18వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-బి గెజిటెడ్ అధికారుల పదోన్నతుల ప్రక్రియపై సిబిఐ,రైల్వే విజిలెన్స్ నిఘావర్గాలు దృష్టి సారించినట్లు అభిజ్ఞవర్గాల సమాచారం. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో కీలక విభాగాలలో ఖాళీగా ఉన్న 6584గ్రూప్‌బి గెజిటెడ్ ఆఫీసర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ఈ నెల 4,18తేదీల్లో జోన్‌వ్యాప్తంగా సిబిటి పద్ధతిలో రెండు విడతలలో,రెండు షిఫ్ట్‌లలో వ్రాతపరీక్షలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

సికింద్రాబాద్‌లోని రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం,ఆపరేటింగ్ విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కార్యదర్శిగా పనిచేసిన(సికింద్రాబాద్ డిఓఎం) అధికారి టిఐ, సెక్షన్ కంట్రోలర్ నియామకాల విషయంలో సిబిఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# తెలుగురాష్ట్రాల్లో సీట్ల పెంపుపై వాదనలు పూర్తి

## తీర్పురిజర్వుచేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, మే 1:** ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలిపినట్లుగా తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. "ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలి. కానీ కేంద్ర ఆ పని చేయకుండా కొత్తగా కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన జమ్మూకశ్మీర్‌లో మాత్రమే అసెంబ్లీ సీట్లను పునర్విభజించింది. ఇది పూర్తి అహేతుకం, రాజ్యాంగ విరుద్ధం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమల్లోకి వచ్చిన ఐదేళ్ల తర్వాతే జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేశారని పిటిషనర్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజన్ తన వాదనలు వినిపిస్తూ " ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటే 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల వరకు ఆగాలి అని, జమ్మూకశ్మీర్ పునర్విభజన వేరు అది కేంద్రపాలిత ప్రాంతం కిందికి వస్తుందని పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్ న్యాయవాది విభేదించారు. డీలిమిటేషన్‌కు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్న తేడా ఉండదన్నారు. "డీలిమిటేషన్‌పై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య చాలా వివాదం జరుగుతోంది. ఈ ప్రక్రియపై పూర్తి అయోమయం నెలకొంది.

# జింబాబ్వేపై బాంగ్లాదేశ్ ప్రతీకారం

## రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో తొలి టెస్టులో ఎదురైన ఓటమికి బంగ్లాదేశ్ ప్రతీకారం తీర్చుకుంది. ఛటోగ్రామ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో జింబాబ్వేను ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ జట్టును చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే తమ మొదటి ఇన్నింగ్స్‌లో 227 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో సీన్ విలియమ్స్ 67 పరుగులు, నిక్ వెల్చ్ 54 పరుగులతో అర్థ సెంచరీలు చేసి రాణించారు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో స్పిన్నర్ తైజుల్ ఇస్లాం 6 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. అతడితో పాటు, నయీమ్ హసన్ 2 వికెట్లు, తాంజిమ్ ఒక్క వికెట్‌ను సాధించారు. అనంతరం బంగ్లాదేశ్ తమ మోదటి ఇన్నింగ్స్‌లో 444




పరుగుల భారీ స్కోరు సాధించింది. బాంగ్లా బ్యాటర్లలో షాద్మాన్ ఇస్లాం 120 పరుగులు, మెహిదీ హసన్ మీరాజ్ 104 పరుగులతో అద్భుతమైన సెంచరీలు సాధించి చెలరేగిపోయారు. వారిద్దరితో పాటు, ముష్ఫికర్ రహీం 40 పరుగులు, మోనిమల్ 33 పరుగులు, షకీబ్ 41 పరుగులతో రాణించారు. జింబాబ్వే బౌలర్లలో విన్సెంట్ మసెకేసా 5 వికెట్లు పడగొట్టగా, ముజారబానీ, వెల్లింగ్టన్ మసకడ్జా బెన్నట్ తలా వికెట్ సాధించారు. ఆ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా జింబాబ్వే ఆట తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. బంగ్లా బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 111 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ 5 వికెట్లుతో రెచ్చిపోగా, తైజుల్ ఇస్లాం 3 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే బ్యాటర్లలో బెన్ కుర్రాన్ 46 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ విషయంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో బంగ్లాదేశ్ సమం చేసింది.

ఆట




# జూన్ 12 నుండి మహిళల వరల్డ్ కప్

## మొత్తం 12 జట్లు, 33 మ్యాచ్‌లు.. లండన్‌లో ఫైనల్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరుగనున్న వుమెన్స్ టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను జులై 5న చారిత్రాత్మక లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరుగనున్నది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ గురువారం ప్రకటించింది. ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొంటాయి. జూన్ 12 నుంచి మొదలయ్యే వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 33 మ్యాచులు జరుగనున్నాయి. 2017 వుమెన్స్ వన్డే ప్రపంచ కప్ ఫైనల్ సైతం లార్డ్స్‌లో జరిగింది. టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఓల్డ్ ట్రాఫోర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్‌కౌంటీ గ్రౌండ్‌లలో జరుగనున్నాయి.టోర్నమెంట్‌లోని జట్లను రెండుగ్రూపులుగా విభజించారు. గ్రూప్ రౌండ్ మ్యాచ్‌ల తర్వాత నాకౌట్ మ్యాచులు జరుగుతాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో సహా ఎనిమిదిజట్లు అర్హత టీ20 ప్రపంచకప్‌కి అర్హత సాధించాయి. మిగతా నాలుగు జట్లకు క్వాలిఫైయర్ పోటీలు నిర్వహించనున్నారు. ఐసీసీ అధ్యక్షుడు జై షా మాట్లాడుతూ అన్ని జట్లకు బ్రిటన్‌లో అభిమానుల నుంచి మద్దతు లభిస్తుందన్నారు. 2017లో లార్డ్స్‌లో జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో స్టేడియం కిక్కిరిసిపోయిందని ఫైనల్‌కు ఇంతకంటే మంచి వేదిక లేదన్నారు. టోర్నమెంట్‌కు సిద్ధమవడంపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆస్ట్రేలియాఇంగ్లాండ్ మధ్య జరిగిన 2020 టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌ను చూసేందుకు మెల్‌బోర్న్‌లో రికార్డు స్థాయిలో 86,174 మంది ప్రేక్షకులు వచ్చారు. ఆ తర్వాత కేప్ టౌన్ (2023), దుబాయి (2024) టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లల సమయంలోనూ స్టేడియాలు ప్రేక్షకులతో నిండిపోయాయి. కాగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఇంగ్లాండ్ మహిళల జట్టు కెప్టెన్‌గా నాట్ సివర్ బ్రంట్‌ను ఎంపిక చేసింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో నాట్ సివర్ ముంబయి ఇండియన్స్ తరఫున బరిలోకి దిగింది. హీథర్ నైట్ స్థానంలో మహిళల ఇంగ్లాండ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైంది. తొమ్మిది సంవత్సరాలు జట్టు కెప్టెన్‌గా కొనసాగింది.

# ప్లేఆఫ్స్ నుంచి చెన్నై ఔట్

## ఆర్‌సిబి, కెకెఆర్, రాజస్థాన్, గుజరాత్‌లకు కొత్త టెన్షన్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025, 18వ సీజన్‌లో అధికారికంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్లేఆఫ్స్ రేసుకు దూరమైంది. ఇప్పటి వరకు చెన్నై 10 మ్యాచ్‌లు ఆడగా కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. లీగ్ దశలో చెన్నై మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచినా, ఓడినా కూడా ఇప్పుడు చెన్నైకి వచ్చిన నష్టం లేదు. ప్లేఆఫ్స్ రేసులో ఉంటామా ఉండమా అన్న టెన్షన్ ఇప్పుడు చెన్నైకి లేదు. ఈ సమయంలో మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో ఆటగాళ్ల అత్యుత్తమ ప్రదర్శన చేసే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి దూరం కావడంతో కనీసం మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో గెలవాలనే పట్టుదలతో ఉంది. అదే జరిగితే అప్పుడు మిగిలిన జట్ల ప్లేఆఫ్స్ ఛాన్స్‌లు దెబ్బతింటాయి. ఈ నెల 3న ఆర్‌సీబీతో, 7న కేకేఆర్‌తో, 12న రాజస్థాన్‌తో, 18న గుజరాత్‌తో చెన్నై సూపర్ కింగ్స్ ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో గనుక చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధిస్తే అది ఆయా జట్ల ప్లేఆఫ్స్ అవకాశాల పై ప్రభావం చూపించవచ్చు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లు ఆడింది. 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. 14 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంకో నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో కనీసం రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా కూడా ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. అయితే ఇక్కడ ఆర్‌సీబీకి చెన్నైతో మ్యాచ్ కీలకం కానుంది. ఫైనల్ చేరుకునేందుకు టాప్2 జట్లకు రెండు అవకాశాలు ఉంటాయి. అదే 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లకు ఇలాంటి అవకాశం ఉండదు. టాప్2తో ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టాలంటే చెన్నైని ఆర్‌సీబీ ఓడించాల్సి ఉంటుంది. ఇక కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లు ఆడింది. కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే గెలిచింది. ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా ఆ జట్టు ఖాతాలో 9 పాయింట్లు ఉన్నాయి. లీగ్ దశలో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనే విజయం సాధిస్తేనే ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇందులో చెన్నైతో మ్యాచ్ కూడా ఉంది. చెన్నైతో మ్యాచ్‌లో కేకేఆర్ ఓడిపోతే ఆజట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను గట్టిగానే ప్రభావితం చేస్తుంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రాజస్థాన్ 10 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 3 మ్యాచ్‌ల్లోనే గెలిచింది. ఆ జట్టు ఖాతాలో ఆరు పాయింట్లు ఉన్నాయి. లీగ్ దశలో ఆ జట్టు ఇంకో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లో గెలిస్తే ఆ జట్టు ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది. అయితే అది మిగిలిన జట్ల సమీకరణాలపై ఆధారపడి ఉంది. చెన్నైతో మ్యాచ్‌లో ఆర్ఆర్ ఓడిపోతే ఆ జట్టు ఇంటి ముఖం పట్టాల్సిందే. గుజరాత్ టైటాన్స్ ఇప్పటి వరకు తొమ్మిది మ్యాచ్‌లు ఆడగా 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇంకో 5 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం మూడు మ్యాచ్‌లు గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఆ జట్టు ప్లేఆఫ్స్‌లో అడుగుపెడుతుంది. అయితే టాప్2లో నిలవాలంటే మాత్రం చెన్నైతో మ్యాచ్ కూడా గుజరాత్ కు కీలకమే.

# బాక్సింగ్ టోర్నీలో ఛాంపియన్‌గా భారత్

**న్యూఢిల్లీ:** ఆసియా జూనియర్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా భారత్ నలిచింది. టోర్నీలో అండర్-15 విభాగంలో భారత్ బాక్సర్లు ఏకంగా 25 పతకాలతో అదరగొట్టారు. ఇందులో 11 సర్వర్ణాలు, 3 రజతాలు, 11 కాంస్య పతకాలు ఉన్నాయి. ఫలితంగా ఈ విభాగంలో భారత్ ఓవరాల్‌గా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బాలికల విభాగంలో భారత్ బాక్సర్లు కోమల్ (33 కేజీలు), ఖుషీ (35 కేజీలు), తమన్నా (37 కేజీలు), సువీ (40 కేజీలు), మిల్కీ (43 కేజీలు), ప్రిన్సీ (52 కేజీలు), నవ్య (58 కేజీలు), సునైనా (61 కేజీలు), తృష్ణ (67 కేజీలు), వన్షిక (ప్లస్ 70 కేజీలు)తో బంగారు పతకాలు సంపాదించుకున్నారు. బాలుర విభాగంలో సంస్కార్ వనోద్ (35 కేజీలు) స్వర్ణ పతకాన్ని సాధించాడు. అలాగే బాలుర విభాగంలో రుద్రాక్ష్ (46 కేజీలు), అభిజిత్ (61 కేజీలు), లక్ష్యయ్ (64 కేజీలు) ఫైనల్లో ఓడపోయి రజత పతకాలు దక్కించుకున్నారు.



# టైటిల్ రేస్‌లో గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** సూపర్బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద టైటిల్ రేసులో నిలిచాడు. పోలాండ్‌లోని వార్సా వేదికగా జరగుతున్న బ్లిట్జ్ సెక్షన్లో ఆరంభంలో నిరాశపరిచినా తర్వాత మెరుగ్గా ఆడిన ప్రజ్ఞా ఫస్ట్ ఆఫ్ ముగిసే సరికి 9 గేమ్స్‌లో 5.5 పాయింట్లు సాధించాడు. దాంతో మొత్తంగా 15.5 పాయింట్లతో ఓవరాల్ జాబితాలో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఈ మెగా టోర్నీలో తొలి రెండు రోజులు ర్యాపిడ్ గేమ్స్‌లో ఇండియా గ్రాండ్ మాస్టర్ బాగా ఆడలేకపోయినా తదుపరి మొదలైన బ్లిట్జ్ విభాగంలో మాత్రం తన మార్కు ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులపై పైచేయి సాధించాడు. బ్లిట్జ్ తొలి రెండు గేమ్స్‌లో డేక్స్ బొగ్డాన్ (రొమేనియా), లెవోన్ అరోనియన్ (అమెరికా) చేతిలో ఓడినప్పటికీ తర్వాత వరుసగా అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్), మ్యాగ్జిమ్ లాగ్రావ్ (ఫ్రాన్స్), వాసెలిన్ తొపలోవ్ (బల్గేరియా), తన టీమ్ మేట్ అరవింద్ చిదంబరం, డేవిడ్ గావ్రిలెస్కు (రొమేనియా)పై విజయం సాధించాడు.



మరోవైపు ర్యాపిడ్‌లో సంయుక్త ఆధిక్యంలో నిలిచిన అరవింద్ బ్లిట్జ్ మొదటి నాలుగు రౌండ్లలో 2.5 పాయింట్లు నెగ్గి ఆకట్టుకున్నాడు. కానీ, తర్వాతి ఐదు గేమ్స్‌లో కేవలం ఒక పాయింట్‌తోనే పరిమితమయ్యాడు. దాంతో 14.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.

# జిఎస్‌టి వసూళ్లు ఆల్‌టైమ్ రికార్డు

**న్యూఢిల్లీ, మే 1:** వస్తు, సేవల పన్ను 'జిఎస్‌టి' వసూళ్లలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లు జిఎస్‌టి రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తంగా రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా, తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జిఎస్‌టి వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో జిఎస్‌టి వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోద య్యాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జిఎస్‌టి ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ తర్వాత నికర జిఎస్‌టి వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.




# టెస్లాకు కొత్త సిఇఒ! స్పందించిన ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, మే 1:** ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా మారిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను టెస్లా సిఇఒ బాధ్యతల నుంచి తప్పించాలని కంపెనీ బోర్డు భావిస్తోంది. కొత్త వ్యక్తి నియామకం కోసం ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపారవేత్తగా ఎదిగిన ఎలాన్ మస్క్ ట్రంప్ ప్రభుత్వంలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన 'డోజ్' సారథిగా పని చేస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నిల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం శ్రమించిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు కీలక పదవి దక్కింది. అయితే ట్రంప్ పరిపాలనలో మస్క్ అధిక ప్రమేయం ఉందనే వాదనలతో పెద్దఎత్తున విమర్శలు ఎదుర్కొన్నారు. ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నారని, ఇందులో మస్క్ కీలక పాత్ర పోషించారని విమర్శలు వచ్చాయి. రాజకీ యాల్లో అధిక జోక్యంతో ఈ కుబేరుడు తన



వ్యాపారాలను పట్టించుకోవడం లేదని పెట్టుబడి దారులపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఫలితంగా టెస్లా విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో మస్క్‌ను తప్పించి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించాలని బోర్డు సభ్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. టెస్లా ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాల్లో పెద్దఎత్తున నష్టాల్ని మూటగట్టుకుంది. లాభంలో 71శాతం క్షీణత నమోదు చేసుకుంది. టెస్లా ఆదాయ వ్యవహారాలపై నిర్వహించిన సమావేశంలో కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. ట్రంప్ పరిపాలనకు తాను కేటాయించే సమయాన్ని గణనీయంగా తగ్గించుకుంటానని, తన కంపెనీలు నడిపేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తానని మస్క్ తెలిపినట్లు తెలిసింది. టెస్లా సంస్థకు వేరొక సిఇఒను నియమించాలని బోర్డు భావిస్తోందని, అందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయన్న వార్తలను ఎలాన్ మస్క్ కొట్టిపారేశారు.

# రూ.2వేలు తగ్గిన పసిడి ధరలు

**ముంబై, మే 1:** అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్లో ఆల్‌టైమ్ గరిష్టానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. గురువారం ఒక్క రోజు 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. దీంతో 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.2,180 తగ్గి రూ.95,730గా పలికింది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. అటు అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధర కాస్త దిగొచ్చింది. ప్రస్తుతం ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద ట్రేడయింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడం, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంకేతాలు కనిపించడం, డాలర్ విలువ బలపడుతుండడంతో బంగారం గిరాకీ తగ్గినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. త్వరలోనే అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడనున్నాయి. ఇవి కూడా పసిడి ధరలపై ప్రభావం చూపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, అక్షయ తృతీయ సందర్భంగా దేశీయ మార్కెట్లో బంగారానికి గిరాకీ పెరిగింది. అక్షయ తృతీయ విక్రయాలు రూ.12వేల కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4వేల కోట్ల విలువైన వెండి కలిపి మొత్తంగా రూ.16వేల కోట్లుగా ఉండొచ్చని ఆలిండియా జ్యుయెల్లర్ అండ్ గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా వెల్లడించారు.



# కమర్షియల్ సిలిండర్ ధర తగ్గింపు..

**న్యూఢిల్లీ, మే 1:** హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఒక్కోసిలిండర్‌పై రూ.14.50 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ సవరణ చేపట్టాయి. ఇంట్లో వినియోగించే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మరోవైపు విమాన ఇంధన ధరలనూ చమురు కంపెనీలు తగ్గించాయి. దేశ రాజధాని ఢిల్లీలో కిలో లీటరుకు 4.4 శాతం మేర తగ్గించాయి. అంటే రూ.3,954 మేర తగ్గింది. దీంతో కిలోలీటర్ 85,486.80కు దిగొచ్చింది. ఏప్రిల్ 1న కూడా ఎటిఎఫ్ ధరల్ని 6.15 శాతం మేర చమురు కంపెనీలు తగ్గించాయి. ఎటిఎఫ్ ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. తగ్గిన ధరలతో ఆ మేర విమానయాన సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.



# వోక్స్‌వ్యాగన్ నుంచి 7వేల ఉద్యోగులు ఔట్!

**న్యూఢిల్లీ, మే 1:** యూరప్‌లోని అతిపెద్ద వాహన తయారీ సంస్థగా పేరున్న వోక్స్‌వ్యాగన్ పునర్నిర్మాణ ప్రయత్నంలో భాగంగా 7వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటిం చింది. కంపెనీకి అనుబంధ సంస్థగా ఉన్న కారియాడ్ సాఫ్ట్‌వేర్ విభాగంలో అధికంగా ఈ లేఆఫ్స్ ప్రభావం పడనుంది. దిగుమతి చేసుకున్న వాహనాలపై అమెరికా సుంకాలు, యూరోపియన్ యూనియన్ కర్బన ఉద్గారాల లక్ష్యాలకు సంబంధించిన జరిమానాల కారణంగా 2025 మొదటి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 40శాతం తగ్గిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. దిగుమతి చేసుకున్న ఆటోమొబైల్స్‌పై అమెరికా 25శాతం సుంకం విధించింది. ఇది వోక్స్‌వ్యాగన్ మెక్సికో యూనిట్‌లో తయారవుతున్న వాహనాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఇవి దాని యుఎస్ అమ్మకాలలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంది. సుంకాలు పెరగడంతో ఖర్చులు అధిక మయ్యాయి. డిమాండ్ తగ్గిపోయింది. ఇది లాభాలమార్జిన్లపై ప్రభావంచూపింది. వోక్స్‌వ్యాగన్ కఠినమైన యూరోపియన్ యూనియన్ కర్బన ఉద్గారాల లక్ష్యాలను చేరుకోవడం సవాలుగా మారు తుంది.




నిబంధనలు పాటించనం దుకు విధించే జరిమానాల కోసం కంపెనీ 600మిలియన్ యూరోలను కేటాయించింది. ఇది దాని ఆర్థిక దృక్పథాన్ని మరింత దెబ్బతీసింది. ఎలక్ట్రిక్ వెహికల్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో కంపెనీ అనుబంధ సంస్థ కారియాడ్ నిరంతరం జాప్యం చేస్తోంది. ఇది వోక్స్‌వ్యాగన్ ఈవీ లక్ష్యాలను ప్రభావితం చేసింది. ఈ విభాగాన్ని పునర్‌వ్యవస్థీకరించడానికి కంపెనీ 200 మిలియన్ యూరోలను కేటాయించింది. ఇది ఉద్యోగాల కోతకు, కార్యాచరణ మార్పులకు దారితీసింది.

# వాణిజ్యం

## అమూల్ పాల ధరలు పైపైకి..

**ముంబై, మే 1:** ప్రతిరోజు ప్రతి ఇంట్లో పాలు అనేది అందరు ఉపయోగించేది. అయితే పసి పిల్లల నుండి ప్రతి ఒక్క వ్యక్తి వరకు పాలు తాగే అలవాటు ఉంటుంది. తాజాగా అమూల్ పాల ధరలు సవరించింది. దీంతో ప్రస్తుతం అముల్ పాలు కొనడానికి మరో 2 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అవును, మదర్ డెయిరీ తర్వాత అమూల్ కంపెనీ కూడా పాల ధరను లీటరుకు రూ.2 పెంచింది. మదర్ డెయిరీ ఏప్రిల్ 30 నుండి పాల ధరలను లీటరుకు రూ.2 సవరించింది ఇంకా మే 1 నుండి కొత్త అముల్ పాల ధరలు అమల్లో ఉంటాయి. అమూల్ బ్రాండ్ పాలను విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్, కంపెనీ పాల కొత్త ధరలు గురువారం అంటే 1 మే 2025 నుండి వర్తిస్తాయని తెలిపింది. దీనికి కంపెనీ కారణం ఏం చెబుతుందని అనే దానిపై వివరణ కూడా ఇచ్చింది. ఢిల్లీఎన్‌సిఆర్, ఉత్తరప్రదేశ్, హర్యానా సహా ఉత్తరాఖండ్, తెలంగాణ మార్కెట్లలో అముల్ పాల కొత్త ధరలు ప్రస్తుతం వర్తిస్తాయని కంపెనీ ప్రతినిధి




తెలిపారు. ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల పాల ధరలు పెంచినట్లు పేర్కొంది. గత ఏడాది కూడా ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయి, దీని వలన పాల ధరలు పెరగాల్సి వచ్చింది. ఈసారి సమ్మర్ కాలం ముందుగానే ప్రారంభమైంది దింతో వేడిగాలులు కూడా మొదలయ్యాయి, ఈ కారణంగా పాడి పాల ఉత్పత్తి తగ్గడం ప్రారంభమైంది. ప్రస్తుతం లీటరు పాల ధర ఎంతకు అమ్ముతున్నారంటే :ఈ రోజు మే 1 నుండి కొత్త రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాత అముల్ స్టాండర్డ్, అముల్ బఫెలో మిల్క్, అముల్ గోల్డ్, అముల్ స్లిమ్ ట్రిమ్, అముల్ చాయ్ మజా, అముల్ తాజా అలాగే అముల్ కౌ మిల్క్ ధరలు రూ.2 పెరిగాయి. నేటి నుండి అముల్ ఫుల్ క్రీమ్ పాల ధర లీటరుకు రూ.65 నుండి రూ.67కి పెరిగింది. బల్క్‌వెండెడ్ పాలు (టోన్డ్) ధర లీటరుకు రూ.53 నుండి రూ.55కి పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.